తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
Estd : 2002
# జనంసాక్షి
www.janamsakshi.org
మంగళవారం 22.09.2026 | సంపుటి : 13 సంచిక : 63 | పేజీలు : 12 వెల : రూ. 4/-
RNI NO.TELTEL / 2013 /50370
హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్

ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698






జూరాల ప్రాజెక్టు ఎడమ, కుడి కాలువలకు సాగునీటిని విడుదల చేసి ఎండిపోతున్న పంటలను కాపాడాలని డిమాండ్ చేస్తూ గద్వాల పట్టణ పరిధిలోని జమ్మిచేడు వద్ద గద్వాల-ఎర్రవల్లి ప్రధాన రహదారిపై బైఠాయించి రాస్తారోకో చేస్తున్న రైతులు

# జూరాల నీటి కోసం రైతుల రాస్తారోకో..

- కిలోమీటర్ల మేర నిలిచిన వాహనాలు
- ఆత్మకూరు - గద్వాల మార్గంలోనూ రాకపోకలకు తీవ్ర అంతరాయం
- జాతీయ రహదారి అనుసంధాన మార్గాలపైనా ప్రభావం
- మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి, సి లక్ష్మారెడ్డి ముందస్తు అరెస్ట్
- చుట్టుపక్కల మోహరించిన వందల మంది పోలీసులు

## జమ్మిచేడు వద్ద గద్వాల-ఎర్రవల్లి ప్రధాన రహదారి దిగ్బంధం

**జోగులాంబ గద్వాల ప్రతినిధి / వనపర్తి బ్యూరో, సెప్టెంబర్ 21(జనంసాక్షి)** జూరాల ప్రాజెక్టు ఎడమ, కుడి కాలువలకు సాగునీటిని విడుదల చేసి ఎండిపోతున్న పంటలను కాపాడాలని డిమాండ్ చేస్తూ రైతులు సోమవారం పెద్దఎత్తున ఆందోళనకు దిగారు. గద్వాల పట్టణ పరిధిలోని జమ్మిచేడు వద్ద గద్వాల-ఎర్రవల్లి ప్రధాన రహదారిపై రైతులు బైఠాయించి రాస్తారోకో నిర్వహించారు. దీంతో రహదారిపై కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయి రాకపోకలు స్తంభించాయి. ఉదయం ప్రారంభమైన ఈ రాస్తారోకో సుమారు ఐదున్నర గంటలపాటు కొనసాగినట్లు స్థానిక రిపోర్టులు పేర్కొన్నాయి. ఎర్రవల్లి, వనపర్తి, కర్నూలు, హైదరాబాద్ వైపు వెళ్లే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. రహదారిపై వాహనాలు ఎక్కడికక్కడ నిలిచిపోవడంతో ఆర్టీసీ బస్సుల రాకపోకలపైనా ప్రభావంపడింది. మిగతా 2లో..


మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి గృహనిర్బంధం చేసిన పోలీసులు

### చేతులు జోడించి మొక్కుతున్నా.. రైతులను ఆగం చేయొద్దు ఆదుకోండి

అక్రమ అరెస్టులతో రైతుల ఆక్రోశాన్ని ఆపలేరు : నిరంజన్ రెడ్డి 2లో..



## జూరాల నీటికష్టాలకు బీఆర్ఎస్‌దే బాధ్యత

### రిజర్వాయర్‌లు ఎందుకు కట్టలేదు?: మంత్రి జూపల్లి

**గద్వాల(జనంసాక్షి)** జూరాల ఆయకట్టుకు నీళ్లు ఇవ్వలేకపోవడానికి బీఆర్ఎస్సే కారణమని మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. బీఆర్ఎస్ హయాంలో జూరాల దగ్గర అదనపు రిజర్వాయర్ ఎందుకు నిర్మించలేదని మిగతా 2లో..



# పనుల్లో జాప్యం సహించం

- వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణంలో జాప్యంపై సీఎం రేవంత్ సమీక్ష
- 30 రోజుల్లో పనులు పూర్తి చేయాలని అధికారులకు ఆదేశం

**హైదరాబాద్(జనంసాక్షి):** వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణ పనులపై సీఎం రేవంత్‌రెడ్డి సమీక్ష నిర్వహించారు. పనులు వేగంగా ఎందుకు జరగడం లేదని ఆరా తీశారు. నిధులు ఇస్తున్నా.. పనుల్లో జాప్యం చోటుచేసుకోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. "వచ్చే 30 రోజుల్లో 24 గంటలపాటు పనులు జరగాలి. వర్క్ షెడ్యూల్ తయారు చేసుకుని ముందు కెళ్లాలి. సీఎంవో అధికారులు తరచూ క్షేత్రస్థాయిలో సమీక్ష చేయాలి. ఇక నుంచి కలెక్టర్ ప్రతిరోజు ఆసుపత్రి పనుల పురోగతిపై దృష్టి సారించాలి. త్వరలో ఓపీ సేవ లు అందుబాటులోకి వచ్చేలా చర్యలు తీసుకోవాలి" అని సీఎం ఆదేశిం చారు. అలాగే సనత్‌నగర్ టిమ్స్‌లో స్టాఫ్ క్వార్టర్స్‌ను ఏర్పాటు చేయాలని.. వెంటనే పనులు ప్రారంభించాలన్నారు. సనత్‌నగర్ టిమ్స్ నిర్వహణను ఏజెన్సీకి అప్పగించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు.

# బీఆర్ఎస్‌పై రేవంత్ రెడ్డి కుట్ర

- రైతులను, పార్టీ నాయకులను అడ్డగించి అరెస్టులు చేయడం ముమ్మాటికీ సిగ్గుమాలిన చర్య
- వెంటనే వారిని విడుదల చేసి ,జూరాల ఆయకట్టు రైతులకు వెంటనే సాగునీరు విడుదల చేయాలి
- ఈ అక్రమ నిర్బంధం రాష్ట్రంలో సాగుతున్న అణచివేతకు ఉదాహరణ: కేటీఆర్

**హైదరాబాద్(జనంసాక్షి):**జూరాల ఆయకట్టుకు సాగునీరిచ్చి పంటను కాపాడాలని డిమాండ్ చేసిన ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా బీఆర్ఎస్ నేతలను అక్రమంగా అరెస్ట్ చేయడం దుర్మార్గమని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. ఈ మేరకు 'ఎక్స్'లో ఆయన పోస్ట్ చేశారు. "కళ్లముందే పంటలు ఎండిపోయి అల్లాడుతున్న అన్నదాతల గోసను ప్రభుత్వం తీర్చాల్సిందిపోయి, న్యాయమైన డిమాండ్‌తో నిరసనకు సిద్ధమైన రైతులను, బీఆర్ఎస్ శ్రేణులను అణచివేసేందుకు రేవంత్ సర్కార్ కుట్ర చేస్తోంది. మాజీ మంత్రులు నిరంజన్ రెడ్డి, సి.లక్ష్మారెడ్డి, శ్రీనివాస్ గౌడ్, మాజీ ఎమ్మెల్యేలు, బీఆర్ఎస్ నేతలను అక్రమంగా నిర్బంధించడం రేవంత్ రాక్షస మనస్తత్వానికి నిదర్శనం. వందలాది మిగతా 2లో..



### యుద్ధప్రాతిపదికన భూసేకరణ, పునరావాస చెల్లింపులు

# పూర్తిచేయాలి



**హైదరాబాద్(జనంసాక్షి):**భూసేకరణ, పునరావాసం పునర్వ్యవస్థీకరణకు ఇప్పటికే విడుదల చేసిన రూ.813 కోట్లను ఎలాంటి జాప్యం లేకుండా సంబంధిత రైతులకు అం దించాలని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి జిల్లా కలెక్టర్లు, నీటిపారుదల శాఖ అధికారులను ఆదేశించారు. నిధులు విడుదలైనప్పటికీ అవి ప్రభుత్వ ఖాతాల్లోనే ఉండిపోవడం, మరోవైపు భూసేకరణ పూర్తికాక సాగునీటి ప్రాజెక్టులు నిలిచిపోవడం ఎంతమాత్రం సమంజసం కాదని స్పష్టం చేశారు.రాష్ట్రవ్యాప్తంగా సాగునీటి ప్రాజెక్టుల భూసేకరణ, పునరావాసంపునర్వ్యవస్థీకరణ పను లు, పరిహారం చెల్లింపుల పురోగతిపై సోమవారం రాష్ట్ర సచివాలయం నుంచి జిల్లా కలెక్టర్లతో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.ఈ సమావేశంలో రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, ముఖ్యమంత్రి కార్యదర్శి మాణిక్‌రాజ్, ఆర్థిక శాఖ కార్యదర్శి సందీప్ సుల్తానియా, భూసేకరణ కమిషనర్ శివకుమార్‌నాయుడు, జిల్లా కలెక్టర్లు, నీటిపారుదల శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి ఇప్పటివరకు భూసేకరణ, పునరావాసం పునర్వ్యవస్థీకరణకు సంబంధించి రూ.3,101 కోట్ల విలువైన టోకెన్లు సమర్పించగా, ప్రభుత్వం రూ.2,504 కోట్లు విడుదల చేసినట్లు అధికారులు సమావేశంలో వివరించారు. ప్రస్తుతం జిల్లా స్థాయిలో చెల్లింపులకు పెండింగ్‌లో ఉన్న రూ.813 కోట్లలో రూ.502 కోట్లు భూసేకరణ అధికారుల వద్ద, మరో రూ.311 కోట్లు జిల్లా కలెక్టర్ల వద్ద ఉన్నట్లు తెలిపారు.ఈ పరిస్థితిపై మంత్రి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. నిధులు విడుదలైన తరువాత అవి తప్పనిసరిగా భూములు కోల్పోయిన రైతులకు చేరాలని స్పష్టం చేశారు. మిగతా 2లో..

## ఇందిరమ్మ ఇల్లు పేదల ఆత్మగౌరవానికి ప్రతీక

- ప్రతి పేదవాడి సొంతింటి కల నెరవేర్చడమే ప్రభుత్వ లక్ష్యం
- సంపన్నులు నెలవయ్యే చోట సామాన్యుడి సంచారం
- ఇందిరమ్మ టవర్స్ రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్
- ఎల్3 కేటగిరీలో బేస్‌మెంట్ పూర్తైన ఇళ్లకు నిధులు
- మంజూరై నిర్మాణం ప్రారంభం కాని అనర్హులకు రద్దు చేస్తాం
- రాయదుర్గం సభలో మంత్రి పొంగులేటి స్పష్టీకరణ



**శేరిలింగంపల్లి, (జనంసాక్షి) :** ఇంద్రమ్మ ఇల్లు అంటే ఏదో పేదవాడికి ఓ రెండు రూముల చిన్న ఇల్లు కాదని... ఇందిరమ్మ ఇల్లు అంటే ప్రస్తుత సమాజంలో ప్రతి పేదవాడి ఆత్మగౌరవానికి నిలువెత్తు నిదర్శనం అని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. శేరిలింగంపల్లి నియోజకవర్గం రాయదుర్గం పరిధి మల్కం చెరువును ఆనుకొని నిర్మించ తలపెట్టిన ఇందిరమ్మ టవర్స్ కు సోమవారం ఎమ్మెల్సీ బి. దయానంద్ గుప్తా, అడిషనల్ కలెక్టర్ కిరణ్మయి, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ తదితరులతో కలిసి మిగతా 2లో..

## '22ఏ' స్వతంత్ర విచారణ చేపట్టండి

### నిషేధిత భూముల జాబితా అంశంపై సీఎస్‌కు ఎన్‌హెచ్‌ఆర్‌సీ నోటీసులు

### 4 వారాల్లో రిపోర్టు ఇవ్వాలని ఆదేశం

**హైదరాబాద్(జనంసాక్షి):**తెలంగాణ రాష్ట్రంలో 22ఏ నిషేధిత భూముల జాబితా అంశంపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజుకు జాతీయ మానవ హక్కుల కమిషన్ నోటీసులు జారీ చేసింది. ఈ అంశంపై తక్షణమే స్వతంత్ర విచారణ చేపట్టాలని ఆదేశాలు జారీ చేసింది. తమ ఆదేశాల విషయంలో మిగతా 2లో..

స్పీకర్‌ను దూషించిన కేసు..

## తాతా మధు, నవీన్‌రెడ్డికి హైకోర్టు నోటీసులు



**హైదరాబాద్(జనంసాక్షి):**శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌ను దూషించిన కేసులో బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్‌రెడ్డిలకు తెలంగాణ హైకోర్టు నోటీసులు జారీ చేసింది. వారిని అరెస్టు చేయొద్దంటూ గతంలో నాంపల్లి కోర్టు ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ పోలీసులు హైకోర్టును ఆశ్రయించారు. నాంపల్లి కోర్టు ఉత్తర్వులను కొట్టివేయాలని పిటిషన్ దాఖలు చేశారు. పీపీ నాగేశ్వరరావు వాదనలు వినిపిస్తూ.. మిగతా 2లో..

## ఇనామ్ భూములు పేదలకు పంచాలి

జగదీశ్‌రెడ్డి చెరువు కాల్వలూ కాజేశారు

మద్దూర్‌లో జగదీశ్ రెడ్డి ఫామ్‌హౌస్ పరిశీలించిన కాంగ్రెస్ నేతలు



**రంగారెడ్డి (జనంసాక్షి):**బీఆర్ఎస్ నేతలకు చెందినవని ఆరోపిస్తూ, ఆ భూముల నిజాలు నిగ్గుతేల్చేందుకు కాంగ్రెస్ నేతలు గత మూడు రోజులుగా బృందంగా పర్యటిస్తున్నారు. ఇందులో భాగంగా నాలుగోరోజు హస్తం పార్టీ ప్రజాప్రతినిధుల నిజనిర్ధారణ బృందం రంగారెడ్డి జిల్లా షాబాద్ మండలం మద్దూర్ చేరుకున్నారు. నాలుగోరోజు క్షేత్రస్థాయి భూముల పరిశీలనలో భాగంగా ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి మిగతా 2లో..

### ఎన్నికలు జరగని గ్రామపంచాయతీలకు నిధులు

రూ.33.62 కోట్లు విడుదల చేసిన రాష్ట్ర ప్రభుత్వం

**హైదరాబాద్(జనంసాక్షి):** కోర్టు కేసులు, ఇతర అనివార్య కారణాల వల్ల గ్రామపంచాయతీ ఎన్నికలు జరగని 58 గ్రామపంచాయతీలకు తెలంగాణ ప్రభుత్వం గుడ్‌న్యూస్ చెప్పింది. ఎన్నికలు జరగలేదన్న కారణంతో నిలిచిపోయిన కేంద్ర ఆర్థిక సంఘం నిధుల స్థానంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా నిధులు విడుదల చేసింది.గ్రామపంచాయతీ ఎన్నికలు జరగకపోవడం ఆయా గ్రామాల అభివృద్ధికి అడ్డంకిగా మారకూడదన్న ఉద్దేశంతో మిగతా 2లో..



## హెల్త్ ఇన్నోవేషన్స్ కేంద్రంగా తెలంగాణ

- టెక్నాలజీతో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు
- కొత్త తరహా ఆలోచనలకు అండగా ప్రభుత్వం: మంత్రి శ్రీధర్ బాబు

**హైదరాబాద్(జనంసాక్షి):**దేశంలోనే హెల్త్ ఇన్నోవేషన్స్ కు ప్రధాన కేంద్రంగా తెలంగాణను తీర్చిదిద్దేందుకు ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తున్నామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పేర్కొన్నారు. హైదరాబాద్‌లో ఇప్పటికే ఉన్న ఐటీ, ఎమర్జింగ్ టెక్నాలజీస్, ఫార్మా, లైఫ్ సైన్సెస్ రంగాలు, స్టార్టప్‌ల సామర్థ్యాలను హెల్త్ కేర్ తో సమర్థవంతంగా అనుసంధానం చేసే కాంప్రహెన్సివ్ ఇన్నోవేషన్ ఎకో సిస్టంను రాష్ట్రంలో అభివృద్ధి చేస్తున్నామన్నారు. టీ-హబ్ లో 'బియాండ్ నంబర్స్ ప్రెసిషన్ ఫినోటైపింగ్ ఇన్ డయాబెటిస్ అండ్ మెటబాలిక్ కేర్' అనే అంశంపై 'హోమా సీఎంఈ 2026' పేరిట నిర్వహించిన మిగతా 2లో..

## అయోధ్య రామాలయంలో విస్తుపోయే వాస్తవం



ఆలయంలో ఏకంగా 105 సార్లు విరాళాల చోరీ

**లక్నో(జనంసాక్షి):**అయోధ్య రామాలయంలో విరాళాల చోరీకి సంబంధించి సిట్ దర్యాప్తులో కీలక వివరాలు వెలుగులోకి వచ్చాయి. ఒకట్రెండు సార్లు కాదు.. ఏకంగా 105 సార్లు విరాళాల చోరీ జరిగినట్లు సిట్ గుర్తించింది. చోరీ దృశ్యాలు సీసీటీవీ కెమెరాల్లో రికార్డయినట్లు మిగతా 2లో..

### మళ్లీ చిక్కుల్లో సోనియా

ఓటరు జాబితాలో పేరు అంశంపై దర్యాప్తు చేపట్టిన ఢిల్లీఈ న్యాయస్థానం 9లో..



## పశ్చిమాసియాలో మళ్లీ కమ్ముకున్న యుద్ధమేఘాలు!

### ఇరాన్‌లో 'కోడ్ 100' అమల్లోకి..!

**టెహ్రాన్(జనంసాక్షి)**పశ్చిమాసియాలో ఘర్షణలు ఎప్పుడు ఏ రూపం దాల్చుతాయో తెలియని ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఈ నేపథ్యంలో ఇరాన్ తన సాయుధ దళాలకు "కోడ్ 100" అలర్ట్‌ను జారీ చేసినట్లు సమాచారం. ఈ అలర్ట్‌ను ఆ దేశ అత్యున్నత స్థాయి సైనిక సన్నద్ధతగా రక్షణరంగ నిపుణులు అభివర్ణిస్తున్నారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ క్యాంప్ డేవిడ్ (వారాంతంలో విశ్రాంతి తీసుకునే ప్రదేశం) నుంచి షెడ్యూల్ సమయం కంటే ముందుగానే వైట్‌హౌస్‌కు తిరిగిరావడం, ఈ అలర్ట్ జారీ కావడం దాదాపు ఒకేసారి జరిగాయి. దాంతో పశ్చిమాసియాలో భీకరదాడులు జరుగుతాయా..? అనే సిగ్నల్ ప్రపంచానికి వెళ్లింది. ఈ కోడ్ 100 అలర్ట్ (అనీటవ 100)ను ఇరాన్ సాయుధ దళాలకు అత్యున్నత స్థాయి సంసిద్ధతగా చెబుతుంటారు. ఇది అమలు చేయడమంటే.. మిగతా 2లో..

### భారత్-న్యూజిలాండ్ ఎఫ్‌టీఏ

## అక్టోబర్ 20 నుంచి అమల్లోకి..

కేంద్ర మంత్రి పీయూష్ గోయల్



**న్యూఢిల్లీ(జనంసాక్షి) :** భారత్- న్యూజిలాండ్ మధ్య స్వేచ్ఛావాణిజ్య ఒప్పందం (ఎఫ్‌టీఏ) అక్టోబర్ 20 నుంచి అమల్లోకి రానున్నట్లు కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ వెల్లడించారు. ఇది ఇరుదేశాల మధ్య పెట్టుబడులు, వ్యాపార సంబంధాలు మెరుగుపడేందుకు దోహదం చేస్తుందన్నారు. భారత్, న్యూజిలాండ్ మధ్య ఏప్రిల్ 27న ఒప్పందం కుదిరిన సంగతి తెలిసిందే. దీని ప్రకారం.. భారత్ నుంచి న్యూజిలాండ్‌కు ఎగుమతి అయ్యే ఉత్పత్తులపైనా ఎలాంటి సుంకం ఉండదు. అంతేకాకుండా రానున్న 15 ఏళ్లలో న్యూజిలాండ్ 20 బిలియన్ మిగతా 2లో..

# ఇందిరమ్మ ఇల్లు పేదల ఆత్మగౌరవానికి ప్రతీక

ఆయన శంకుస్థాపన గావించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అంటే నిరుపేదల ప్రభుత్వమని, బడుగు బలహీన వర్గాలకు నమ్మకమైన భరోసా అని మంత్రి పొంగులేటి అభివర్ణించారు. ఇందిరమ్మ ఇళ్ళను రాష్ట్ర ప్రభుత్వం ఒక సంక్షేమ పథకంగానే కాకుండా యావత్ తెలంగాణ రాష్ట్ర నిరుపేద వర్గాల ఆత్మగౌరవానికి ప్రత్యేకగా భావించడం జరుగుతుందన్నారు. దాదాపు 7 వందల70 కోట్ల రూపాయల అత్యంత ఖరీదైన ప్రాంతంలో ప్రస్తుత పరిస్థితులలో సామాన్యుడు ఇమడలేడని, అలాంటి కార్పొరేట్ ప్రాంతంలో సామాన్యుల సంచారం ప్రభుత్వ ప్రగతికి అద్భుత మైలురాయని పొంగులేటి పేర్కొన్నారు. తెలంగాణ హౌసింగ్ బోర్డ్ కు సంబంధించిన 2.85 ఎకరాల స్థలంలో నాలుగు టవర్లను నిర్మిస్తూ 480 ప్లాట్లను ఏర్పాటు చేసి అత్యంత పారదర్శకంగా అర్హులైన నిరుపేదలకు వాటిని లక్కీ డ్రా పద్ధతిలో అందజేయడం ప్రభుత్వ నిబద్ధతకు కొలమానంగా భావించవచ్చున్నారు. ప్లాట్ల ఎంపికలు కులమతాలు, ప్రాంతాలు, రాజకీయ పార్టీలు, ఇతర భేదభావాలకు తావు లేకుండా సామాన్యుడైతే చాలు లక్కీ డ్రా రూపంలో అదృష్టం వరించి ఖరీదైన ప్లాట్ సొంతం అవుతుందని మంత్రి వివరించారు. ఇందిరమ్మ టవర్స్ లో కో ఫ్లాట్ 528 చదరపు అడుగుల లింక్ ఏరియా గా నిర్మితమవుతుందని, తద్వారా ఫ్లాట్ తగినంత విశాలంగా కుటుంబానికి అనుకువగా ఉండబోతుంది అనడంలో సందేహం లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ప్లాట్ కి ఐదు లక్షల రూపాయల సబ్సిడీ అందజేస్తుండగా లబ్ధిదారుల నుండి ఆరు లక్షల రూపాయలను కిస్తుల వారిగా చెల్లింపజేసి ఫ్లాటును దారా దత్తం చేయడం జరుగుతుందని దాదాపు 22 గజాల అవిభాజ్య షేర్ ప్రతి ఇంటి యజమానికి ఇక్కడ లభిస్తుందన్నారు. ఏడాది వ్యవధిలో వీటిని పూర్తి చేసి లబ్ధిదారుల ద్వారా గృహప్రవేశం చేయించడమే ప్రస్తుతం తమ ముందున్న ప్రధాన లక్ష్యమని, ఎన్ని ఇబ్బందులు ఎదురైనా అనుకున్న సమయానికి ఇళ్ల నిర్మాణాన్ని పూర్తిచేసి అర్హత పొందిన నిరుపేదను సొంతింటిలో నిలబెట్టడమే ప్రస్తుత ముఖ్యమంత్రి ఆశయమని మంత్రి పొంగులేటి కీర్తించారు. ఈ కార్యక్రమంలో యాదవ కో-ఆపరేటివ్ చైర్మన్ రఘునాథ్ యాదవ్, హౌసింగ్ ప్రాజెక్ట్ డైరెక్టర్ నాయక్, శేరిలింగంపల్లి మండల తహసిల్దార్ మహిపాల్ రెడ్డి, మాజీ కార్పొరేటర్లు దొడ్ల వెంకటేష్ గౌడ్, జగదీశ్వర్ గౌడ్, నార్నె శ్రీనివాసరావు, ఉప్పలపాటి శ్రీకాంత్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## '22ఏ' స్వతంత్ర విచారణ చేపట్టండి

తీసుకున్న చర్యలపై 4 వారాల్లో రిపోర్టు ఇవ్వాలని స్పష్టం చేసింది. 22ఏ అంశంపై హైదరాబాద్‌కు చెందిన ఓ న్యాయవాది ఫిర్యాదును పరిగణనలోకి తీసుకున్న కమిషన్ ఈమేరకు చర్యలు తీసుకుంది.

## ఇనామ్ భూములు పేదలకు పంచాలి

నేతృత్వంలో కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు పర్యటించారు. గత ప్రభుత్వంలో అవినీతి అక్రమాలు, భూ కబ్జాలు జరిగాయని అవి ప్రజలకు చూపించేందుకే వెళ్తున్నామని కాంగ్రెస్ ప్రజా ప్రతినిధుల బృందం వెల్లడించింది. ప్రజాభవన్ నుంచి బయలుదేరిన నిజనిర్ధారణ కమిటీ సభ్యులు బీఆర్ఎస్? నేతలపై తీవ్ర విమర్శలు చేశారు. ప్రజా భవన్ నుంచి బస్సులో బయలుదేరారు. మాజీ మంత్రి జగదీశ్ రెడ్డికి సంబంధించిన భూములను ప్రజలకు చూపిస్తామని తెలిపారు. మద్దూర్‌లో 50 ఎకరాల్లో జగదీశ్‌రెడ్డి ఫామ్‌హౌస్ ఉందని, 50 ఎకరాల్లో ఇనామ్ భూములు ఉన్నాయని కాంగ్రెస్ నేతల ఆరోపించారు. అధికారాన్ని అడ్డం పెట్టుకుని జగదీశ్‌రెడ్డి చెరువు కాల్వలు కాజేశారని వెల్లడించారు. జగదీష్ రెడ్డి 50 ఎకరాల భూమి ఫామ్ హౌస్ మ్యాప్ కాంగ్రెస్ ప్రజా ప్రతినిధుల బృందం విడుదల చేసింది. ఇందులోనే 11 ఎకరాల ఇనామ్ భూములు ఉన్నట్లు ఆరోపించారు.

# జూరాల నీటి కోసం రైతుల రాస్తారోకో

మరోవైపు జూరాల ప్రాజెక్టు వైపు రైతులు పెద్దఎత్తున తరలివెళ్లకుండా పోలీసులు భారీగా బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆత్మకూరు-గద్వాల మార్గంలో బారికేడ్లు ఏర్పాటు చేసి వాహనాలను, ఆందోళనకారులను తనిఖీ చేశారు. పోలీసుల ఆంక్షలతో ఈ మార్గంలోనూ రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. జూరాల ప్రాజెక్టు పరిసరాల్లో భారీగా పోలీసులను మోహరించారు. జమ్మిచేడు వద్ద రహదారి దిగ్బంధం, ఆత్మకూరు-గద్వాల మార్గంలో పోలీసుల ఆంక్షల ప్రభావంతో జాతీయ రహదారి 44కు అనుసంధానమయ్యే ప్రాంతీయ రహదారులపై కూడా ట్రాఫిక్ అంతరాయం ఏర్పడినట్లు పరిస్థితి కనిపించింది. జూరాల ప్రాజెక్టు వద్ద కూడా రైతులు ఆందోళనకు దిగారు. ప్రాజెక్టు వైపు వెళ్లేందుకు ప్రయత్నించిన రైతులు, నాయకులను పోలీసులు అడ్డుకోవడంతో పలుచోట్ల వాగ్వాదం, తోపులాట చోటుచేసుకుంది. కొందరిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ప్రాజెక్టు పరిసరాలను పోలీసులు పూర్తిగా తమ ఆధీనంలోకి తీసుకున్నారు. జూరాల కుడి కాలువకు నీటిని విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ రైతులు గద్వాల కలెక్టరేట్‌ను కూడా ముట్టడించారు. జమ్మిచేడు వద్ద మరోసారి ఆందోళనకు వెళ్తున్న రైతులను పోలీసులు అడ్డుకున్నారు. మూడున్నర నెలలుగా కంటికి రెప్పలా కాపాడుకున్న వరి పంట, చేతికొచ్చే మరో నెలన్నర సమయంలో ఎండిపోతుండటంతో రైతులు రోడ్లపైకి వచ్చారు. కడుపుమండి కాలువ గేట్లు తెరుచుకున్న రైతులు, గత మూడు రోజులుగా పంటలను కాపాడుకోవడానికి సాగునీరు విడుదల చేయాలని రైతులు అధికారులకు విన్నపాలు చేస్తూ, ప్రాజెక్టు వద్ద ధర్నాలు నిర్వహించారు. శనివారం ఉదయం నుంచి రాత్రి 7 గంటల వరకు శాంతియుతంగా నిరసన తెలిపినా అధికారుల నుంచి ఎలాంటి స్పందన లేకపోవడంతో రైతుల ఆగ్రహం కట్టలు తెంచుకుంది. ఆదివారం వనపర్తి, గద్వాల పరిధిలోని ఆయకట్టు రైతులు ఏకమై జూరాల ప్రాజెక్టు ఎడమ కాలువ రెగ్యులేటర్ వద్దకు దూసుకెళ్లారు. తాళాలు బద్దలు కొట్టి, స్వయంగా గేట్లు ఎత్తి నీటిని కాలువలోకి విడుదల చేసుకున్నారు. అయితే, రంగంలోకి దిగిన నీటిపారుదల శాఖ అధికారులు వెంటనే ఆ గేట్లను తిరిగి మూసివేశారు. సోమవారం రోజున గద్వాల గద్వాల జమ్ములమ్మ వద్ద బీఆర్ఎస్, బీజేపీ నేతలు సహా వందలాది మంది రైతులు బైటాయించారు. దీంతో ఎక్కడికక్కడ వాహనాలు స్తంభించిపోయాయి. గద్వాల, ఆలంపూర్ నియోజకవర్గాలకు చెందిన బీఆర్ఎస్, బీజేపీ స్థానిక నేతలు పోలీసుల ఆంక్షలను ధిక్కరించి పొలాల వెంబడి జూరాల ప్రాజెక్టు వైపు వెళ్లేందుకు రైతులతో కలిసి ప్రయత్నించారు. ఉద్రిక్తతల నేపథ్యంలో గద్వాల డీఎస్పీ, స్థానిక సీఐ టంగుటూరి శ్రీను ఆధ్వర్యంలో ముందస్తు చర్యగా జిల్లాలోని మండల స్థాయి విపక్ష నాయకులను, పలువురు రైతు ప్రతినిధులను తెల్లవారుజామునే పోలీస్ స్టేషన్లకు తరలించారు. రైతులు మళ్లీ ప్రాజెక్టు ముట్టడికి రాకుండా ఉండేందుకు ప్రభుత్వం జూరాల చుట్టుపక్కల వందలాది మంది పోలీసులను మోహరించింది. ఆత్మకూర్-గద్వాల హైవేతో పాటు ప్రాజెక్టుకు వచ్చే అన్ని ప్రధాన రహదారులపై ముళ్లకంచెలు, మల్టీ లేయర్ బారికేడ్లను ఏర్పాటు చేసి కట్టుదిట్టమైన పహారా కాస్తున్నారు. సోమవారం జూరాల వద్ద ధర్నాకు సిద్ధమైన బీఆర్ఎస్ నేతలను, మాజీ మంత్రులు సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి, లక్ష్మారెడ్డి, శ్రీనివాస్ గౌడ్‌లను పోలీసులు గృహ నిర్బంధం చేశారు. పలువురు మండల స్థాయి నాయకులను, రైతులను ముందస్తుగా అదుపులోకి తీసుకున్నారు.

## చేతులు జోడించి మొక్కుతున్నా.. రైతులను ఆగం చేయొద్దు ఆదుకోండి



జూరాల ప్రాజెక్టులో నీటి లభ్యత ఉన్నప్పటికీ పాలమూరు రైతాంగానికి సాగునీరు అందించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి ఆరోపించారు. రైతుల సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీసేందుకు జూరాల ముట్టడికి వెళ్తున్న తనను పోలీసులు వ్యవసాయ క్షేత్రంలోనే నిర్బంధించి, అనంతరం వనపర్తిలోని తన నివాసానికి తరలించి గృహనిర్బంధం చేశారని తెలిపారు. రైతుల కోసం పోరాడుతున్న నాయకులను అరెస్టు చేయడం, బీఆర్ఎస్ నాయకులను హౌస్ అరెస్టు చేయడం సరికాదన్నారు. అరెస్టులతో రైతుల ఆక్రోశాన్ని అణచలేరని వ్యాఖ్యానించారు.అనంతరం నిర్వహించిన విలేకరుల సమావేశంలో నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ జూరాల ప్రాజెక్టులో ప్రస్తుతం సుమారు 9 టీఎంసీల నీరు అందుబాటులో ఉందని, తాగునీటి అవసరాలకు సుమారు 2 టీఎంసీలు కేటాయించినప్పటికీ మిగిలిన నీటిని రైతులకు అందించేందుకు అవకాశం ఉందని పేర్కొన్నారు. సంబంధిత చీఫ్ ఇంజనీర్‌తో మాట్లాడగా 8.4 టీఎంసీల నీటి లభ్యత ఉందని తెలిసిందన్నారు. శ్రీశైలం ప్రాజెక్టు నుంచి తాగునీటి అవసరాలకు 9 టీఎంసీలు, జూరాల నుంచి అలంపూర్, గద్వాల ప్రాంతాలకు తాగునీటి కోసం సుమారు 1.5 టీఎంసీలు అవసరమవుతాయని తెలిపారు. మిగిలిన నీటిని ఆరుతడి పంటలకు వినియోగించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతులకు సాగునీరు అందించే అవకాశం ఉన్నప్పటికీ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. కృష్ణారావు, శ్రీహరి నియోజకవర్గాల్లో రైతులు పెద్దఎత్తున వరి సాగు చేశారని, వారికి ముందస్తుగా అవగాహన కల్పించకుండా ప్రభుత్వం వ్యవహరించిందని విమర్శించారు. ప్రస్తుతం నెలకొన్న పరిస్థితి ప్రకృతి కారణంగా వచ్చిన కరువు కాదని, ప్రభుత్వ విధానాల వల్ల ఏర్పడిన పరిస్థితి అని ఆరోపించారు. కలెక్టర్, అధికారులు, పాలకులు రైతుల సమస్యలపై స్పందించాల్సిన అవసరం ఉందన్నారు. ఆలమట్టి ప్రాజెక్టులో సుమారు 150 టీఎంసీల నీరు అందుబాటులో ఉందని, అక్కడి నుంచి సాగునీటిని తీసుకురావడానికి అవకాశం ఉన్నప్పటికీ ప్రభుత్వం చొరవ చూపడం లేదని నిరంజన్ రెడ్డి పేర్కొన్నారు. ప్రభుత్వ లెక్కల ప్రకారం జూరాలకు 244 టీఎంసీల వరద నీరు వచ్చిందని, అందులో ఇప్పటివరకు కేవలం 18 టీఎంసీలను మాత్రమే వినియోగించుకున్నామని తెలిపారు. రైతులకు న్యాయం జరిగే వరకు తమ పోరాటం కొనసాగుతుందని, అవసరమైతే లక్షలాది మంది రైతులతో ఉద్యమించి జల హక్కులను కాపాడుకుంటామని నిరంజన్ రెడ్డి తెలిపారు. జిల్లా అధ్యక్షులు గట్టు యాదవ్ జిల్లా అధికార ప్రతినిధి వాకిటి శ్రీధర్ జిల్లా మీడియా సెల్ కన్వీనర్ నందిమల్ల అశోక్ , కె.మాణిక్యం,గంధం.పరంజ్యోతి, వెంకట్ రావు,రఘువర్ధన్ రెడ్డి,ధర్మా నాయక్,వెంకట్ సాగర్,జాత్యనాయక్, మాజీ సర్పంచ్ రమేష్,నాగన్న యాదవ్, జోహెబ్ హుస్సేన్,నారాయణ నాయక్, చిట్యాల రాము,కవితా నాయక్ ,విజయ్ మోహన్,మోహన్ శేఖర్,కుమార్,ఉందెకోటి.శివ, గోపాల్ ,బాలయ్య,ఆంజనేయులు, సునీల్,సత్తార్, కర్ణాకర్,లు జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభికి వినతి పత్రాన్ని అందించారు. జడ్చర్లలోని తిరుమలహిల్స్‌లో మాజీ మంత్రి డాక్టర్ సి లక్ష్మారెడ్డిని, జూరాలకు బయల్దేరిని మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డిని పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు.

## జూరాల నీటికష్టాలకు బీఆర్ఎస్‌దే బాధ్యత

ప్రశ్నించారు. జోగులాంబ గద్వాల జిల్లాలోని జూరాలలో ఆయన ఈమేరకు మాట్లాడారు. వరద లేని పరిస్థితుల్లో గేట్లు ఎత్తితే తాగునీటికి ఇబ్బంది కాదా? అని ప్రశ్నించారు."కేసీఆర్ గతంలో 20 టీఎంసీల గట్టు రిజర్వాయర్‌ను తీసుకొస్తామని చెప్పారు. జూరాల, భీమా ఆయకట్టుకు సింగోటం నుంచి నీళ్లు తెస్తామన్నారు. పాలమూరుపై అంత ప్రేమ ఉంటే రిజర్వాయర్లను ఎందుకు నిర్మించలేదు? కేసీఆర్ రిజర్వాయర్లు కట్టకపోవడం వల్లే నీళ్లను నిల్వ చేసుకోలేకపోతున్నాం. పాలమూరు జిల్లాను ఎండబెట్టే ప్రయత్నం చేశారు. కేసీఆర్ హయాంలో కృష్ణా నీటిలో తెలంగాణ వాటా 30 శాతానికి మించలేదు. మా ప్రభుత్వంలో ఈ వాటా 43 శాతం వరకు ఉంది. నీటి కేటాయింపుల విషయంలో కాంగ్రెస్ సర్కారు రాజీపడదు. 15 టీఎంసీలతో గూడెందొడ్డి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నిర్మాణానికి నిధులు ఇచ్చాం. ఆల్మట్టి, నారాయణపూర్ నుంచి ఇంకా నీళ్లు వస్తాయని భావిస్తున్నాం. ప్రాజెక్టుల్లో ఉన్న నీళ్లను సరైన పద్ధతిలో ఉపయోగించుకునే ప్రయత్నం చేస్తున్నాం. వచ్చే సీజన్‌కు నీటి ఎద్దడి లేకుండా చేస్తాం" అని అన్నారు.

## బీఆర్ఎస్‌పై రేవంత్ రెడ్డి కుట్ర

రైతులను కూడా పోలీసులు అడ్డుకుని నిర్బంధించడం రాష్ట్రంలో సాగుతున్న అణచివేతకు ఉదాహరణ. సీఎంగా విఫలమైన రేవంత్ తన చేతకానితనాన్ని కప్పిపుచ్చుకోవడానికే జిల్లాలోని అనేక మండలాల్లో బీఆర్ఎస్ నేతల ముందస్తు అరెస్టులు, గృహనిర్బంధాలకు చీకటి ఆదేశాలిచ్చారు. జూరాల ప్రాజెక్టులో 9 టీఎంసీల నీటి లభ్యత ఉన్నా కూడా విడుదల చేయకుండా కుంటిసాకులతో ప్రభుత్వం పచ్చని పంటల ఉసురు తీస్తోంది. తమ పంటలను కాపాడుకునే ఏకైక తపనతో రైతులు జూరాల గేట్లు ఎత్తే ప్రయత్నం చేస్తే వారిపై అక్రమ కేసులు బనాయించింది. తెలంగాణ గడ్డపై ఉన్న జూరాల ప్రాజెక్టు పరిసరాల్లోకి రైతులు రాకుండా ఎక్కడికక్కడ బారికేడ్లు ఏర్పాటుచేసి వందలాది పోలీసులను చుట్టుపక్కల మోహరించడం.. వస్తున్న రైతులను అడ్డగించి అరెస్టులు చేయడం ముమ్మాటికీ సిగ్గుమాలిన చర్య. అక్రమంగా అరెస్టు చేసిన రైతులు, బీఆర్ఎస్ నేతలను ప్రభుత్వం విడుదల చేయడంతోపాటు జూరాల ఆయకట్టు రైతులకు వెంటనే సాగునీరు విడుదల చేయాలి" అని కేటీఆర్ డిమాండ్ చేశారు.

## అయోధ్య రామాలయంలో విస్తూపోయే వాస్తవం

సుప్రీంకోర్టుకు తెలిపింది. చోరీకి పాల్పడిన వారందరినీ గుర్తించినట్లు వివరించింది. అయోధ్య విరాళాల చోరీ కేసుపై సోమవారం సుప్రీం కోర్టులో విచారణ జరిగింది. సిట్ తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలు వినిపించారు. దర్యాప్తులో గుర్తించిన వివరాలను న్యాయస్థానానికి వివరించారు. పూర్తిస్థాయి దర్యాప్తు త్వరలోనే పూర్తవుతుందని, సెప్టెంబర్ 25 లోపు ఛార్జ్‌షీట్ దాఖలు చేస్తామని కోర్టుకు తెలిపారు.విచారణ సందర్భంగా న్యాయస్థానం పలు అంశాలను లేవనెత్తింది.

తెలంగాణ ప్రభుత్వం
రెవిన్యూ (LA) విభాగం
కలెక్టరేట్: మహబూబ్‌నగర్
ఫారం - VI, ప్రాథమిక ప్రకటన
(చట్టం-30/2013 యొక్క సెక్షన్ -11(1) మరియు నిబంధన-19 యొక్క ఉప-నిబంధన (1) చూడండి)
No. Rev/G1/LAG/0031/2026-G-Section తేది: 09.09.2026

మహాత్మా గాంధీ కల్వకుర్తి ఎత్తిపోతల పథకం కింద ఘనపూర్ బ్రాంచ్ కెనాల్‌లోని కమలుద్దీన్ మేజర్‌పై 8L మైనర్ తవ్వకం కొరకు ప్రజా ప్రయోజనం కోసం, మహబూబ్‌నగర్ జిల్లా, భూత్పూర్ మండలం, యెల్కిచర్ల గ్రామంలో మొత్తం ఎ.0.36 గుం.ల భూమి ప్రజా ప్రయోజనం కోసం అవసరమని తెలంగాణ ప్రభుత్వం/జిల్లా కలెక్టర్ భావించినందున ప్రభుత్వం, జి.ఓ.ఎం.ఎస్. నెం. 51, ఇరిగేషన్ & CAD (LA R&R/A2) డిపార్ట్మెంట్, తేదీ 25.07.2017 ద్వారా, 2013 నాటి భూసేకరణ, పునరావాసం మరియు పునఃస్థాపనలో హేతుబద్ధమైన పరిహారం మరియు పారదర్శక హక్కు చట్టంలోని అధ్యాయం-II & III యొక్క నిబంధనల ననుసరించి మహాత్మాగాంధీ ఎత్తిపోతల పథకాన్ని మినహాయించింది. అందువల్ల, సదరు చట్టంలోని సెక్షన్ 4(1) ప్రకారం అవసరమైన సామాజిక ప్రభావ అంచనా అధ్యయనం నిర్వహించబడలేదు. భూసేకరణ కారణంగా ఏ కుటుంబాలూ పునరావాసం చెందే అవకాశం లేదు. ప్రభావిత కుటుంబాల పునరావాసం మరియు పునఃస్థాపన ప్రయోజనం కోసం అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ప్రాజెక్ట్ నిర్వాహకుడిగా నియమించబడ్డారు.

అందువల్ల, పైన పేర్కొన్న ప్రాజెక్ట్ కోసం, మహబూబ్‌నగర్ జిల్లా, భూత్పూర్ మండలం, యెల్కిచర్ల గ్రామంలో, పైన పేర్కొన్న ప్రాజెక్ట్ నిమిత్తం, ప్రామాణిక కొలత ప్రకారం సుమారుగా ఎ.0.36 గుం.ల భూమి, దాని సవివరమైన వివరణ ఈ క్రింది విధంగా సేకరణలో ఉందని తెలియజేయడమైనది.

గ్రామం : యెల్కిచర్ల మండలం : భూత్పూర్ జిల్లా : మహబూబ్‌నగర్

| క్ర. సం. | సర్వే నం. | మెట్ట/ ఐ.డీ/ తరి | భూమి రకం | సేకరణకింద ప్రతిపాదిత ఏరియా (ఎ.లలో) ఎ.గుం. | ఆసక్తి గల వ్యక్తి పేరు మరియు చిరునామా | సరిహద్దులు ఉ | ద | తూ | ప | చెట్లు | కట్టడాలు |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 | 2 | 3 | 4 | 5 | 6 | 7 | 8 | 9 | 10 | 11 | 12 |
| 1 | 640 | మెట్ట | పట్టా | 0.06 | బాల స్వామి తండ్రి నారాయణ | - | - | - | - | టేకు -1 | - |
| 2 | 640 | మెట్ట | పట్టా | 0.05 | ఎం.బాలయ్య తండ్రి నారాయణ | - | - | - | - | - | - |
| 3 | 640 | మెట్ట | పట్టా | 0.05 | మురికి లక్ష్మయ్య తండ్రి బాలయ్య | - | - | - | - | వేప-1 తుమ్మ -2 | - |
| 4 | 640 | మెట్ట | పట్టా | 0.07 | పట్టాదారు : వందనం భద్రయ్య తండ్రి పెద్ద నాగన్న స్వాధీనపరుడు: మొగులయ్య తండ్రి సత్యన్న | - | - | - | - | పల్లవ చెట్టు-1 చిన్న పల్లవ చెట్టు-3 | - |
| 5 | 640 | మెట్ట | పట్టా | 0.13 | మురికి రాములు తండ్రి బాలయ్య | - | - | - | - | బోర్ & అర్రె మూడు -1 | - |
| | మొత్తం : | | | 0.36 | | | | | | | |

హేతుబద్ధమైన పరిహారం మరియు భూసేకరణ, పునరావాసం మరియు పునఃస్థాపనలో పారదర్శకత హక్కు చట్టం 2013 (చట్టం నెం.30 ఆఫ్ 2013)లోని సెక్షన్ 11 (1) నిబంధనల ప్రకారం సంబంధిత వ్యక్తులందరికీ ఈ నోటిఫికేషన్ జారీ చేయబడింది.

భూమి యొక్క ప్లాన్ను మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టర్ మరియు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ LA R&R, యూనిట్-II, ఇరిగేషన్ ప్రాజెక్ట్, మహబూబ్‌నగర్ కార్యాలయంలో ఏదేని పనిదినం పనివేళల్లో పరిశీలించవచ్చును. మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టర్/ కలెక్టర్-కమ్-సంబంధిత ప్రభుత్వం, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ LA R&R, యూనిట్-II, ఇరిగేషన్ ప్రాజెక్ట్, మహబూబ్‌నగర్ మరియు అతని సిబ్బందికి, సదరు చట్టంలోని సెక్షన్ (12)లో సూచించిన మరియు నిర్దేశించిన విధంగా వారి పనిని సక్రమంగా నిర్వహించడానికి అవసరమైన భూమిలోకి ప్రవేశించి సర్వే చేయడానికి, ఏదైనా భూమి యొక్క స్థాయిని తీసుకోవడానికి, ఉపరితలం క్రింద తవ్వడానికి లేదా బోరు వేయడానికి మరియు ఇతర అన్ని పనులను చేయడానికి అధికారం ఇస్తున్నారు.

చట్టంలోని సెక్షన్ 11(4) ప్రకారం, కలెక్టర్ యొక్క ముందస్తు అనుమతి లేకుండా, ఈ నోటిఫికేషన్ ప్రచురించబడిన తేదీ నుండి ఏ వ్యక్తి కూడా భూమికి సంబంధించిన ఏ లావాదేవీలు అనగా అమ్మకం/కొనుగోలు మొదలైనవి చేయకూడదు లేదా చేయించకూడదు, లేదా అటువంటి భూమిపై ఎలాంటి చిక్కులను సృష్టించకూడదు.

సేకరణపై ఏవైనా అభ్యంతరాలు ఉన్నయెడల ఆసక్తిగల వ్యక్తి చట్టంలోని సెక్షన్ (15) ప్రకారం ఈ నోటిఫికేషన్ ప్రచురించబడిన తేదీ నుండి 60 (అరవై) రోజులలోపు మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టర్‌కు వాటిని దాఖలు చేయవచ్చు.

సం/-స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ LA R&R యూనిట్-II ఇరిగేషన్ ప్రాజెక్ట్, మహబూబ్‌నగర్
సం/- అదనపు కలెక్టర్ (రెవెన్యూ), మహబూబ్‌నగర్
సం/-ఖుష్బూ గుప్తా IAS జిల్లా కలెక్టర్ మహబూబ్‌నగర్
DIPR RO.NO: 896/LA/PP/Advt/Pub/2026-27

## పశ్చిమాసియా కమ్ముకున్న యుద్ధమేఘాలు!

తమ దేశంపై జరగబోయే దాడికి దీటుగా స్పందించడానికి సైనిక, భద్రతా దళాలను సంసిద్ధంగా ఉంచడమే. దళాలను అవసరమైన చోట వేగంగా మోహరించేలా, యుద్ధప్రాతిపదికన సైనిక సమాచార మార్పిడి తగ్గట్టుగా చర్యలు ఉంటాయి. దీంతో అమెరికా, ఇరాన్ మధ్య మరోసారి భీకరదాడులు జరుగుతాయా..? అనే ఆందోళన వ్యక్తమవుతోంది. అయితే, ఈ కోడ్ 100 అలర్ట్‌పై ఇరాన్ నుంచి అధికారికంగా ఎలాంటి ప్రకటనా రాలేదు. ప్రస్తుతం పశ్చిమాసియాలో అమెరికా మిత్ర దేశం సౌదీ అరేబియా ఇరాన్ మద్దతున్న హూతీ తిరుగుబాటుదారుల మధ్య ఘర్షణలు జరుగుతున్నాయి. సౌదీ చమురు ఎగుమతులకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. కీలకమైన ఈస్ట్-వెస్ట్ ఆయిల్ పైప్‌లైన్ (పెట్రో లైన్) మూసివేయాల్సి వచ్చింది. సౌదీ రాజధాని రియాద్‌లో భారీ పేలుడు శబ్దాలు వినిపించాయి. రియాద్ సహా పరిసర ప్రాంతాలపై తాము క్షిపణి, డ్రోన్ దాడులు చేసినట్లు హూతీలు ప్రకటించగా.. వాటిని తాము అడ్డుకున్నామని సౌదీ ప్రకటించింది. హూతీలపై దాడులకు దిగే అవకాశాలను అమెరికా పరిశీలిస్తోందంటూ ఒక దశలో వార్తలు వచ్చాయి. వాటి కోసమే ట్రంప్ క్యాంప్ డేవిడ్‌లో తన పర్యటనను కుదించుకుని షెడ్యూల్ కంటే ఒక రోజు ముందుగానే శ్వేతసౌధానికి చేరుకున్నారని పలు కథనాలు పేర్కొన్నాయి. పశ్చిమాసియాలో దాడులు మరింత తీవ్రమయ్యే అవకాశం ఉండడంతో ఆయా దేశాల్లో ఉన్న తమ పౌరులు అప్రమత్తంగా ఉండాలని అగ్రరాజ్యం సూచించింది. ఆ సమయంలో ఇరాన్ కోడ్ 100 (అనీటవ 100)ను యాక్టివేట్ చేసిందన్న మీడియా కథనాలు వెలువడ్డాయి.

### తాతా మధు, నవీన్‌రెడ్డికి హైకోర్టు నోటీసులు

రాజ్యాంగబద్ధ పదవిలో ఉన్న స్పీకర్‌ను తాతా మధు, నవీన్‌రెడ్డి అసభ్య పదజాలంతో దూషించారని తెలిపారు. విధుల్లో ఉన్న పోలీసు అధికారులపైనా దాడి చేశారని చెప్పారు. ఈక్రమంలో కౌంటర్ దాఖలు చేయాలని ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్‌రెడ్డికి ఉన్నత న్యాయస్థానం నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను ఈ నెల 23కు వాయిదా వేసింది.

## హెల్త్ ఇన్నోవేషన్స్ కేంద్రంగా తెలంగాణ

జాతీయ సదస్సును ఆయన సోమవారం లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ... తమ ప్రభుత్వం విద్య, వైద్య రంగాలకు అత్యంత ప్రాధాన్యమిస్తోందన్నారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలను అందించేందుకు మెడిసిన్‌ను టెక్నాలజీతో మిళితం చేస్తున్నామన్నారు. మారుతున్న ఆధునిక జీవనశైలి కారణంగా డయాబెటిస్, ఇతర మెటబాలిక్ వ్యాధులు వేగంగా పెరుగుతున్నాయన్నారు. వీటిని కేవలం సాంప్రదాయ వైద్య విధానాలతోనే కాకుండా, లైఫ్ స్టైల్ డేటాను విశ్లేషించడం ద్వారా సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు అవకాశముందన్నారు. ఈ తరహా దీర్ఘకాలిక వ్యాధులను ప్రాథమిక దశలో గుర్తించాల్సిన అవసరముందన్నారు. ఆ దిశగా మరిన్ని నూతన ఆవిష్కరణలు రావాలన్నారు. రాబోయే రోజుల్లో హెల్త్ కేర్ రంగంలో ఎదురయ్యే సవాళ్లను పరిష్కరించే కొత్త ఆలోచనలకు తమ ప్రభుత్వం ఎప్పుడూ అండగా ఉంటుందని మంత్రి శ్రీధర్ బాబు భరోసానిచ్చారు. ప్రజారోగ్య రంగాన్ని మరింత బలోపేతం చేసేందుకు వైద్య నిపుణులు, పరిశోధకులు, సంస్థలు రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి పనిచేసేందుకు ముందుకు రావాలని కోరారు. ఈ సందర్భంగా... ప్రముఖ వైద్యులు డా.ముద్దు సురేంద్ర నెహ్రూ రచించిన 'ది న్యూ పారాడైమ్' పుస్తకాన్ని ఆవిష్కరించారు. అలాగే... ప్రపంచంలోనే తొలి ఉచిత మెటబాలిక్ కాలిక్యులేటర్ యాప్ 'మెట్రిక్ ఎక్స్ ప్లోరర్'ను ప్రారంభించారు. 'ప్రూఫ్ ఆఫ్ కాన్సెప్ట్(పీవోసీ)' పేరిట ప్రభుత్వ ఆసుపత్రుల నుంచి ఎంపిక చేసిన 50 మంది రోగులకు ఉచిత ప్రోటోకాల్‌ను అందించే కార్యక్రమానికి కూడా ఆయన శ్రీకారం చుట్టారు.

# యుద్ధప్రాతిపదికన భూసేకరణ, పునరావాస చెల్లింపులు పూర్తిచేయాలి

కలెక్టర్లు వ్యక్తిగతంగా చొరవ తీసుకొని రైతులతో సంప్రదింపులు జరపడంతోపాటు అవార్డుల ప్రక్రియను పూర్తి చేసి పరిహారం చెల్లింపులను వేగవంతం చేయాలని ఆదేశించారు."ప్రభుత్వం విడుదల చేసిన డబ్బు భూములు కోల్పోయిన రైతులకు చేరాల్సిందే. ఏదైనా వాస్తవమైన కారణంతో చెల్లించడం సాధ్యం కాకపోతే, అందుకు గల కారణాన్ని స్పష్టంగా తెలియజేసి నిధులను తిరిగి ప్రభుత్వానికి పంపాలి. అంతేగానీ, నెలల తరబడి ఖాతాల్లో నిరుపయోగంగా ఉంచడానికి వీల్లేదు" అని మంత్రి స్పష్టం చేశారు .సాగునీటి ప్రాజెక్టుల భూసేకరణ, పునరావాసం, అటవీ అనుమతులకు సంబంధించిన అవసరాల కోసం 2026లో రూ.6 వేల కోట్లు అందిస్తామని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చిన విషయాన్ని మంత్రి గుర్తుచేశారు. ప్రాధాన్య ప్రాజెక్టుల పనులు నిధుల కొరతతో ఆలస్యం కాకూడదన్న ఉద్దేశంతోనే ఈ మొత్తాన్ని నీటిపారుదల శాఖ సాధారణ బడ్జెట్‌కు అదనంగా సమకూరుస్తున్నట్లు తెలిపారు.రైతుల పట్ల మానవీయంగా వ్యవహరించాలిభూములు కోల్పోతున్న రైతుల పట్ల అధికారులు న్యాయబద్ధంగా, మానవీయంగా వ్యవహరించాలని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సూచించారు. అవార్డులు జారీ చేసి, చెల్లింపులకు అన్ని ఏర్పాట్లు పూర్తయిన తరువాతే టోకెన్లు సమర్పించాలని స్పష్టం చేశారు."రైతుల భూములను తీసుకునే విషయంలో ప్రభుత్వం అన్యాయం చేయాలని కోరుకోవడం లేదు. చట్టపరమైన నిబంధనలు, నిర్దేశిత ప్రక్రియకు లోబడి సాధ్యమైనంత వరకు మార్కెట్ ధరలకు దగ్గరగా పరిహారం అందించాలి" అని మంత్రి పేర్కొన్నారు.అవార్డు ప్రకటించిన తరువాత కూడా పరిహారం చెల్లింపులు ఆలస్యమైన కేసుల్లో నిబంధనల ప్రకారం రైతులకు వడ్డీ చెల్లించాలని ఆదేశించారు. కోర్టు కేసులు, యాజమాన్య వివాదాల కారణంగా నిలిచిపోయిన భూసేకరణ కేసులన్నింటినీ ప్రత్యేకంగా నమోదు చేసి, అడ్వొకేట్ జనరల్‌తో చర్చించి వేగంగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు.జిల్లాలవారీగా సమస్యలపై సమీక్షనల్గొండ, యాదాద్రి భువనగిరి, నారాయణపేట, సిద్దిపేట, వికారాబాద్, జగిత్యాల, హనుమకొండ తదితర జిల్లాల్లో భూసేకరణకు ఎదురవుతున్న సమస్యలను మంత్రి జిల్లాలవారీగా సమీక్షించారు.నల్గొండ జిల్లాలోని చింతపల్లి రిజర్వాయర్, పెండ్లిపాక బ్యాలెన్సింగ్ రిజర్వాయర్, ఉదయసముద్రం, నెల్లికల్లు ప్రాజెక్టులకు సంబంధించిన భూసేకరణలో జాప్యంపై ఆరా తీశారు. ముఖ్యంగా ఎస్ఎల్‌బీసీ సొరంగం పూర్తయిన తరువాత దాని ప్రయోజనాలు రైతులకు అందాలంటే పెండ్లిపాక బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ భూసేకరణను అత్యవసరంగా పూర్తి చేయాలని ఆదేశించారు. "ఎస్ఎల్‌బీసీ సొరంగం పూర్తయినా, బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌కు అవసరమైన భూసేకరణ పూర్తికాకపోతే పెట్టిన పెట్టుబడికి ఆశించిన ప్రయోజనం దక్కదు" అని మంత్రి హెచ్చరించారు.భూసేకరణ ప్రక్రియలో రెండు, మూడు వారాల సమయాన్ని సాధారణ పరిపాలనా జాప్యంగా భావించవద్దని కలెక్టర్లకు సూచించారు. ప్రతి దశకు నిర్దిష్ట గడువు పెట్టుకొని సాధ్యమైనంత తక్కువ సమయంలో ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు.అనేక సాగునీటి ప్రాజెక్టుల ప్రధాన పనులు ఇప్పటికే పూర్తయ్యాయని, పంపిణీ కాలువలు, అనుసంధాన పనులు, కొద్దిపాటి భూసేకరణ పెండింగ్‌లో ఉండటంతోనే వాటి ఫలాలు రైతులకు అందడం లేదని మంత్రి తెలిపారు. అందువల్ల భూసేకరణ ప్రక్రియను అత్యంత ప్రాధాన్య అంశంగా పరిగణించాలని స్పష్టం చేశారు.ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు మాట్లాడుతూ, చెల్లింపులకు కేసులు పూర్తిగా సిద్ధమైన తరువాతే నిధులను కోరాలని కలెక్టర్లకు సూచించారు. ప్రభుత్వం విడుదల చేసిన నిధులు ఖాతాల్లో నిరుపయోగంగా ఉండకుండా జాగ్రత్త వహించాలని, ఆర్థిక వనరులను బాధ్యతాయుతంగా వినియోగించాలని ఆదేశించారు.

# ఎలాంటి సిలబస్ కమిటీని నియమించలేదు

**'పోటీ పరీక్షల్లో సిలబస్ మార్పు' వార్తలపై ప్రకటన విడుదల చేసిన టీజీపీఎస్సీ**

**ఒకవేళ ఉంటే వివరాలను సంబంధిత నియామక నోటిఫికేషన్‌తో పాటే జారీ చేస్తామని వెల్లడి**

హైదరాబాద్(జనంసాక్షి):రాష్ట్రంలో ప్రభుత్వ ఉద్యోగాల భర్తీకి నిర్వహించే పరీక్షల సిలబస్‌లో మార్పుపై వస్తున్న అంశాలపై టీజీపీఎస్సీ స్పందించింది. ఉద్యోగ నియామక పోటీ పరీక్షలకు సంబంధించి టీజీపీఎస్సీ కీలక ప్రకటన విడుదల చేసింది. ఉద్యోగ నియామక పోటీ పరీక్షలకు సంబంధించి తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) కీలక ప్రకటన విడుదల చేసింది. రాష్ట్రంలో ప్రభుత్వ ఉద్యోగాల భర్తీకి నిర్వహించే పరీక్షల సిలబస్‌లో మార్పుపై వస్తున్న అంశాలపై స్పందించింది. తాము ఎలాంటి సిలబస్ కమిటీని నియమించలేదని స్పష్టం చేసింది. ఈ మేరకు టీజీపీఎస్సీ ఓ ప్రకటనను విడుదల చేసింది.సిలబస్ మార్పు ప్రచారంతో ఆందోళన చెందుతున్న అభ్యర్థుల నుంచి వచ్చిన వినతులు, సందేహాలపై స్పందించిన టీజీపీఎస్సీ పోటీ పరీక్షల సిలబస్‌లో పెద్దగా ఏవైనా మార్పులు ప్రతిపాదిస్తే ఒక సంవత్సరం ముందే తెలియజేస్తామని పేర్కొంది. ఒకవేళ సిలబస్‌లో స్వల్ప మార్పులు ఉన్నా గానీ ఆ వివరాలను సంబంధిత నియామక నోటిఫికేషన్ తో పాటే జారీ చేస్తామని టీజీపీఎస్సీ కార్యదర్శి తెలిపారు.

## భారత్-న్యూజిలాండ్ ఎఫ్‌టీఏ అక్టోబర్ 20 నుంచి అమల్లోకి..

యూఎస్ డాలర్ల మేర భారత్‌లో పెట్టుబడులు పెట్టేందుకు ఈ ఒప్పందం మార్గం సుగమం చేస్తుందని గోయల్ తెలిపారు "న్యూజిలాండ్‌తో మరింత బలమైన భాగస్వామ్యాన్ని నెలకొల్పేందుకు భారత్ నిబద్ధతతో వ్యవహరిస్తోంది. ఈ క్రమంలోనే అక్టోబర్ 20న దసరా సందర్భంగా భారత్- న్యూజిలాండ్ స్వేచ్ఛావాణిజ్య ఒప్పందం ప్రారంభం కాబోతోంది" అని గోయల్ వెల్లడించారు. ఈ ఒప్పందం భారత్‌లోని వ్యవసాయ ఉత్పాదకతపైనా ప్రభావం చూపిస్తుందని, న్యూజిలాండ్ సాంకేతికత భారతదేశపు అవసరాలను, పెరుగుతున్న డిమాండ్‌ను తీరుస్తుందని ఆయన పేర్కొన్నారు.

## ఎన్నికలు జరగని గ్రామపంచాయతీలకు నిధులు

మంత్రి సీతక్క ప్రత్యేక చొరవ తీసుకున్నారు. ఎన్నికలు నిర్వహించలేని పరిస్థితి గ్రామపంచాయతీల తప్పు కాదని, అందువల్ల అభివృద్ధి నిధులు నిలిచిపోవడం వల్ల ప్రజలు నష్టపోకూడదని మంత్రి సీతక్క ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లారు.మంత్రి సీతక్క చొరవతో తెలంగాణ ఆర్థిక శాఖ 58 గ్రామపంచాయతీలకు మొత్తం రూ.33,62, 9000 నిధులను విడుదల చేసింది. విడుదలైన నిధులు ఆయా గ్రామపంచాయతీల ఖాతాల్లో జమ అయ్యాయి.ఎన్నికలు జరగలేదన్న కారణంతో కేంద్ర ఆర్థిక సంఘం నిధులు అందకపోయినా, గ్రామాల్లో అభివృద్ధి పనులు నిలిచిపోకుండా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యామ్నాయంగా నిధులు సమకూర్చింది.గ్రామపంచాయతీల పరిస్థితికి ఎన్నికలు జరగకపోవడం కారణం కాకూడదు.. ప్రజల అభివృద్ధి ఆగకూడదు అన్న ఉద్దేశంతో ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంతో 58 గ్రామపంచాయతీలకు ప్రయోజనం కలగనుంది. రాష్ట్ర ప్రభుత్వం తరఫున నిధులు మంజూరు చేసిన నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం కూడా ఆయా గ్రామ పంచాయతీలకు తన వాటాను విడుదల చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని మంత్రి సీతక్క విజ్ఞప్తి చేశారు చేశారు.

## మళ్లీ తెరపైకి ధర్మస్థల హత్యాచార కేసు

**దర్యాప్తు చేపట్టాలని సుప్రీంకోర్టు ఆదేశం**

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**సుమారు 14ఏళ్లుగా మిస్టరీగా ఉన్న 'ధర్మస్థల' అత్యాచారం, హత్య కేసు మళ్లీ తెరపైకి వచ్చింది. ఈ కేసులో మళ్లీ దర్యాప్తు చేపట్టాలని సుప్రీంకోర్టు సోమవారం ఆదేశించింది. మూడు నెలల్లో విచారణ పూర్తి చేసి సమగ్ర నివేదిక సమర్పించాలని పేర్కొంది. 2012 అక్టోబర్ 9న ధర్మస్థలలో 17 ఏళ్ల యువతి అపహరణకు గురై.. మరుసటి రోజు నేత్రావతి నది సమీపంలో శవమై కనిపించించిన ఘటన కలకలం రేపిన విషయం తెలిసిందే. కేసును తొలుత కర్ణాటక సీఐడీ దర్యాప్తు చేయగా.. అనంతరం సీబీఐకి అప్పగించారు. ఈ కేసులో సంతోష్‌రావు అనే వ్యక్తిని అరెస్టు చేశారు. తగిన ఆధారాలు లేకపోవడంతో 2023లో సీబీఐ స్పెషల్ కోర్టు అతడిని నిర్దోషిగా విడుదల చేసింది.బాధితురాలి తల్లి దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టు తాజా ఆదేశాలు జారీ చేసింది. గత దర్యాప్తులో కీలక అంశాలను పరిగణనలోకి తీసుకోలేదని ఆమె ఆరోపించారు. కేసులో సరైన దర్యాప్తు జరగలేదని పేర్కొంటూ మళ్లీ విచారణ జరపాలని కోరారు. ఈ మేరకు పిటిషన్‌ను పరిశీలించిన సుప్రీంకోర్టు.. కేసును పునర్విచారణ చేపట్టాలని ఆదేశించింది.

# సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ పనులు వేగంగా పూర్తి చేయాలి

- ప్రిన్సిపల్ సెక్రటరీ క్రిస్టియాన ఆదేశాలు



**వరంగల్ బ్యూరో, సెప్టెంబర్ 21 (జనం సాక్షి) :** వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి క్రిస్టినా జె. చోంగ్తూ, ఐఏఎస్, వైద్య ఆరోగ్య శాఖ సంచాలకులు డాక్టర్ వాణి సోమవారం వరంగల్‌లోని నూతనంగా నిర్మాణంలో ఉన్న సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిని సందర్శించారు. ఈ సందర్భంగా వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, హన్మకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ ముఖ్య కార్యదర్శిని మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కను అందించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వైద్య, ఆరోగ్య శాఖకు సంబంధించిన పలు అంశాలపై చర్చించారు. అనంతరం నిర్మాణంలో ఉన్న సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిని సందర్శించి నిర్మాణ పనుల పురోగతిని పరిశీలించారు. ఆసుపత్రిలో అందుబాటులోకి రానున్న వైద్య సదుపాయాలు, మౌలిక వసతులు తదితర అంశాలపై అధికారులతో సమీక్షించారు. ప్రజలకు మెరుగైన, నాణ్యమైన వైద్య సేవలు అందేలా అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ నిర్దేశిత గడువులోగా నిర్మాణాన్ని పూర్తి చేసేలా సంబధిత శాఖల సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ సందర్శనలో సంబంధిత శాఖల అధికారులు వారి వెంట ఉన్నారు.

## పోలీసులమంటూ బంగారు వ్యాపారులకు
# డిజిటల్ అరెస్టు బెదిరింపులు

- సైబర్ నేరగాళ్ల ఆట కట్టించిన పోలీసులు
- 4.20 లక్షలు అక్రమ వసూళ్లు చేసిన సైబర్ నేరగాళ్ల అరెస్టు
- వివరాలు వెల్లడించిన ఎస్పీ డాక్టర్ శబరిష్, సీఐ సత్యనారాయణ, ఎస్సై క్రాంతి కిరణ్




**కేసముద్రం, సెప్టెంబర్ 21 (జనం సాక్షి):** అడ్డదారిలో ధనార్జనే ధ్యేయంగా పోలీసులమంటూ నటిస్తూ బంగారు వ్యాపారులే లక్ష్యంగా పెట్టుకుని ఫోన్ కాల్స్ ద్వారా బెదిరింపులకు పాల్పడి డిజిటల్ అరెస్టు పేరుతో అక్రమంగా డబ్బులు వసూలు చేస్తున్న ఇద్దరు నేరగాళ్లను కేసముద్రం పోలీసులు అరెస్టు చేశారు. నిందితుల నుండి సెల్ ఫోన్ తో పాటు పోలీస్ యూనిఫామ్ ను స్వాధీనం చేసుకున్నట్లు జిల్లా ఎస్పీ డాక్టర్ శబరిష్ తెలిపారు. నిందితులు నిడమనూరు గ్రామం నల్గొండ జిల్లా వాసులుగా గుర్తించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నిందితులు పోలీస్ యూనిఫామ్ ధరించి ఫోటో తీసుకొని వాట్సప్, ట్రూ కాలర్లలో డిపిలలో ఉపయోగించి స్థానిక మండలానికి చెందిన ఓ బంగారు వ్యాపారి ఫోన్ నెంబర్ ను గూగుల్ ద్వారా సేకరించి ఈనెల 10న వ్యాపారికి పోలీస్ అధికారులమంటూ ఫోన్ చేసి ఇద్దరు దొంగలను పట్టుకున్నామని వారు దొంగలించిన బంగారాన్ని బాధితుడు కొనుగోలు చేశాడని అందుకు సంబంధించిన రసీదులు తమ వద్ద ఉన్నాయని, తాను కొనుగోలు చేసిన బంగారాన్ని రికవరీ గా ఇవ్వకపోతే అరెస్టు చేస్తామని భయభ్రాంతులకు గురిచేసి వ్యాపారి దగ్గర 88026 రూపాయలు అక్రమంగా వసూలు చేశారు. ఈ ఘటనపై ఎస్సై క్రాంతి కిరణ్ కేసు నమోదు చేయగా సిఐ సత్యనారాయణ దర్యాప్తు చేపట్టి సాంకేతిక ఆధారాలతో చాకచక్యంగా నిందితులను గుర్తించారు. పోలీసుల పేరుతో ఫోన్ కాల్స్, డిజిటల్ అరెస్ట్ బెదిరింపులు, ఆన్లైన్ డబ్బుల డిమాండ్ల పట్ల స్పందించకుండా అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ డాక్టర్ శబరిష్ తెలిపారు. సైబర్ మోసానికి గురైతే 1930 కు కాల్ చేసి సంబంధిత సైబర్ క్రైమ్ పోర్టల్ ద్వారా ఫిర్యాదు చేయాలని సూచించారు.

## మక్తల్, నారాయణపేట ఎత్తిపోతల పథకం నిర్వాసితులకు
# హకీంపేట్-లగచర్ల ప్యాకేజీ వర్తింపజేయాలి

- రైతు సంఘం డిమాండ్



**మక్తల్, సెప్టెంబర్ 21 (జనంసాక్షి) :** కొడంగల్ నియోజకవర్గంలోని హకీంపేట, పోలేపల్లి, లగచర్ల తరహాలోనే మక్తల్-నారాయణపేట ఎత్తిపోతల పథకం నిర్వాసిత రైతులకు కూడా సమానమైన ప్యాకేజీని అమలు చేయాలని నిర్వాసిత రైతుల సంఘం నాయకులు మంత్రి వాకిటి శ్రీహరికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ భూసేకరణ విషయంలో ప్రభుత్వం చూపుతున్న వివక్ష వల్ల తమకు తీవ్ర నష్టం జరుగుతోందని, తక్షణమే ఈ నష్టాన్ని నివారించి రైతులకు న్యాయం చేయాలని కోరారు.

కొడంగల్ నియోజకవర్గంలో ప్రభుత్వం భూములు సేకరించిన రైతులకు ఎకరాకు రూ. 23 లక్షల పరిహారంతో పాటు, లేఅవుట్‌తో కూడిన నివాస ప్లాట్లు, ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేసిందని గుర్తుచేశారు. అదే ప్రాతిపదికన మక్తల్, నారాయణపేట ఎత్తిపోతల పథకం కింద భూములు కోల్పోతున్న నిర్వాసిత రైతులకు కూడా నియోజకవర్గ కేంద్రాల్లో ప్లాట్లు కేటాయించి, ఇందిరమ్మ ఇండ్లు నిర్మించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. దీంతో పాటు భూములు కోల్పోయిన రైతుల కుటుంబాల సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రత్యేక పెన్షన్ పథకాన్ని ప్రకటించాలని కోరారు. అలాగే, రైతులకు ఉపాధి కల్పించేలా రూ. 10 లక్షల విలువైన డైరీ (పాడి పరిశ్రమ) పథకాన్ని సబ్సిడీపై అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో నిర్వాసితుల సంఘం గౌరవ అధ్యక్షులు జి. వెంకట్రావు రెడ్డి, ఉపాధ్యక్షులు ధర్మరాజు గౌడ్, జిల్లా ముఖ్య సలహాదారులు ఎం. గోపాల్ రెడ్డి, జిల్లా నాయకులు ఎం. లక్ష్మీకాంత్, పి. ఆంజనేయులు, సి.ఆర్. గోవిందరాజ్, సురేందర్ రెడ్డి, సూరత్ మల్లప్ప, కోళ్ల బసప్ప, బాలగారి తమన్న, బాపూర్ నర్సింలు గౌడ్, నిడుగుర్తి నరసప్ప, రాజు గౌడ్, సంజన్నుల సంజప్ప, చిన్నపోర్ల కురుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల ఆరోగ్యం విద్యాభివృద్ధికి అహర్నిశలు కృషి

- ఎమ్మెల్యే ప్రేమ సాగర్ రావు



**మంచిర్యాల ప్రతినిధి, సెప్టెంబర్ 21 (జనంసాక్షి) :** విద్యార్థుల ఆరోగ్యం, విద్యాభివృద్ధికి ఎల్లప్పుడూ నా వంతు సహకారం అందిస్తాను" అని మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ సాగర రావు పేర్కొన్నారు. మంచిర్యాల జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఎమ్మెల్యే జన్మదినం సందర్భంగా విద్యార్థులతో కలిసి టిఫిన్ చేశారు. సెంట్రలైజ్డ్ కిచెన్ ద్వారా అందిస్తున్న నాణ్యమైన ఉచిత అల్పాహారాన్ని (టిఫిన్) ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు స్వయంగా విద్యార్థులతో కలిసి ఆత్మీయంగా స్వీకరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ ధర్ని మధుకర్, డిప్యూటీ మేయర్ సల్ల రమ్య-మహేష్, కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, కార్పొరేటర్ తూముల నరేష్, కార్పొరేటర్లు, నాయకులు, మహిళా నాయకురాలు, యువజన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ముడుపులిస్తేనే మ్యుటేషన్లు..?

- పల్లెల్లో పంచాయతీ కార్యదర్శుల అక్రమ వసూళ్లు
- పట్టించుకోని జిల్లా అధికార యంత్రాంగం
- అవస్థలు పడుతున్న సామాన్య ప్రజానీకం
- చర్యలు చేపట్టాలని పలువురు డిమాండ్



**వెంకటాపూర్(రామప్ప), సెప్టెంబర్ 21 (జనం సాక్షి):** పల్లెలే ప్రభుత్వానికి పట్టుకొమ్మలు. అలాంటి పల్లెల్లో పాలన గాడి తప్పుతోంది. ప్రజలకు పారదర్శకంగా సేవలందించాల్సిన కొందరు కార్యదర్శులు ముడుపులు ముట్టనిదే ఎలాంటి పనీ చేయడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా ములుగు జిల్లాలోని వెంకటాపూర్ మండలంలో గల పలు గ్రామ పంచాయతీల్లో కార్యదర్శులు తమ చేతివాటాన్ని ప్రదర్శిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. నూతన గృహ నిర్మాణ అనుమతులు, ఇంటి నెంబర్ల కేటాయింపు, ఇంటి యజమాని పేర్ల మార్పులు, ఇంటి మ్యుటేషన్ ప్రక్రియలో భాగంగా కొందరు పంచాయతీ కార్యదర్శులు సామాన్యుల నుంచి వసూళ్లకు పాల్పడుతున్నారనే ఆరోపణలు జోరుగా వినిపిస్తున్నాయి. అధికారిక రుసుము కాకుండా అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారనే ఆరోపణలు సైతం ఉన్నాయి. రామప్పకు యునెస్కో గుర్తింపుతో పాటు మండలంలో సింగరేణి బొగ్గు గని ఏర్పాటు నేపథ్యంలో గ్రామాల్లో నూతన గృహ నిర్మాణాలు, వెంచర్ల ఏర్పాట్లు జోరుగా ఊపందుకున్నాయి. ఇదే అదునుగా భావిస్తున్న కొందరు అధికారులు క్షేత్రస్థాయిలో నిబంధనలకు వ్యతిరేకంగా ముందుకు వచ్చి ఆర్థిక ప్రయోజనం కోసం అక్రమాలకు పాల్పడుతున్నట్లు విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అధికారులతో గొడవపడే ధైర్యం లేని సామాన్యులు అనుమతులకు ఆలస్యం కాకుండా ఉండేందుకు భయంతో అధికారులు అడిగినంత లంచం ఇవ్వాల్సిన పరిస్థితి నెలకొందని ఆరోపణలు ఉన్నాయి. అడిగినంత ఇస్తేనే పనులు జరుగుతాయనే భావన ప్రజల్లో ఏర్పడటంతో ఇదే అదునుగా భావించిన అధికారులు లబ్ధిదారుల నుండి అందినకాడికి దోచుకుంటున్నారనే విమర్శలు ఉన్నాయి. ఇటీవల మండలంలోని ఓ గ్రామానికి చెందిన వ్యక్తి వారి తాతల కాలం నాటి పాత ఇంటిని కూల్చి కొత్త ఇల్లు నిర్మించుకోవాలని భావించాడు. ఇందుకోసం నిర్మాణ అనుమతి కోసం పంచాయతీ కార్యాలయానికి వెళ్లాడు. "ఇల్లు ఇంకా మీ తాత పేరుకే ఉంది, దీన్ని మీ పేరు మీదికి మ్యుటేషన్ చేయాలి" అని కార్యదర్శి సూచించాడు. నామమాత్రపు రుసుముతో మ్యుటేషన్ పూర్తవ్వాల్సి ఉండగా, సదరు కార్యదర్శి మాత్రం భారీగా డబ్బులు డిమాండ్ చేశాడు. పని త్వరగా జరగాలన్నా, ఇంటి అనుమతి తొందరగా రావాలన్నా రూ.20 వేలు ఇవ్వాల్సిందేనని తేల్చి చెప్పాడు. అడిగిన ముడుపులు ముట్టడంతో సదరు అధికారి లబ్ధిదారుడికి వెంటనే అనుమతులు మంజూరు చేసినట్లు తెలిసింది. అదే విధంగా మండలంలోని మరో గ్రామంలో నిరుపేద కుటుంబానికి చెందిన వ్యక్తికి ఇటీవల కాలంలో ఇందిరమ్మ ఇల్లు మంజూరైంది. ఇంటి నిర్మాణం చేపట్టిన తర్వాత ప్రభుత్వం ఇచ్చే బిల్లులు అందుకోవడంతో పాటు అవి సరిపోకపోతే బ్యాంకు రుణం తీసుకోవడం కోసం సొంత ఇంటి రిజిస్ట్రేషన్, నిర్మాణ అనుమతులు తప్పనిసరి అయ్యాయి. దీనికోసం సదరు నిరుపేద తమ గ్రామంలోని పంచాయతీ కార్యాలయానికి నేరుగా వెళ్లాడు. డబ్బులిస్తేనే ఫైలు ముందుకు కదులుతుందని సదరు గ్రామ అధికారి చెప్పడంతో చేసేదేమీ లేక సదరు లబ్ధిదారుడు చివరికి రూ.10 వేలు ఇచ్చి అనుమతి పత్రాలు తీసుకున్నట్లు సమాచారం. ఇదంతా జరుగుతున్నప్పటికీ జిల్లా అధికారులు మాత్రం తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తుండడంతో గ్రామాల్లో అధికారులు ఆడిందే ఆట, పాడిందే పాట అన్న చందంగా తయారైంది. దీంతో గ్రామాల్లో సామాన్యులు తమ తమ పనుల నిమిత్తం అధికారులకు అడిగినంత డబ్బు ఇవ్వలేక తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైనా జిల్లా అధికార యంత్రాంగం స్పందించి వెంకటాపూర్ మండలంలోని పలు గ్రామాల్లో గ్రామ పంచాయతీ అధికారులు చేస్తున్న అవినీతి, అక్రమాలపై విచారణ జరిపించి వారిపై శాఖపరమైన చర్యలు చేపట్టాలని పలువురు ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ఇదిలా ఉండగా, ఇంటి నిర్మాణ అనుమతులు, ఇంటి నెంబర్ల కేటాయింపులు తదితర సేవలన్నీ పూర్తిగా ఆన్ లైన్ లోనే అందిస్తున్నామని సంబంధిత శాఖ ఉన్నతాధికారులు తెలిపారు. గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులకు ఎవరూ డబ్బులు ఇవ్వాల్సిన అవసరం లేదని, ఎవరైనా కార్యదర్శులు అదనపు డబ్బులు ఇవ్వాలని వేధించినా, ఇబ్బందులకు గురి చేసినా వెంటనే తమ దృష్టికి తీసుకువస్తే వారిపై తగు చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఏది ఏమైనప్పటికీ వెంకటాపూర్ మండలంలోని పలు గ్రామాల్లో జరుగుతున్న అవినీతి అక్రమాలపై జిల్లా అధికార యంత్రాంగం ఏ విధంగా స్పందిస్తుందో చూడాలి మరీ.

# వరంగల్ అభివృద్ధి పనులు స్పీడప్ చేయాలి

- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి



**హైదరాబాద్ (జనంసాక్షి) :** వరంగల్ అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. వరంగల్ అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులపైన సీఎం రేవంత్ రెడ్డి సమీక్ష నిర్వహించారు. భారీ నిధులతో నిర్మిస్తున్నందున పకడ్బందీగా పనులు చెయ్యాలని, వరంగల్ ఔటర్ రింగ్ రోడ్డు పైన ప్రదానం గా దృష్టి పెట్టాలని సూచించారు. ఖమ్మం ,వరంగల్ ,కరీంనగర్ లను కలుపుతూ రోడ్ కనెక్టివిటీ ఏర్పాటు చెయ్యాలని, వరంగల్ ఎయిర్పోర్ట్ ప్రారంభం వరకు రోడ్ కనెక్టివిటీ డెవలప్మెంట్ కావాలని, హైదరాబాద్ తరహా లో వరంగల్ ను అభివృద్ధి చేయాలని, టెంపుల్,ఫారెస్ట్ టూరిజం పైన దృష్టి పెట్టాలని సూచించారు. ఎయిర్పోర్ట్ ప్రారంభం అయ్యాక భద్రకాళి దేవాలయం ,రామప్ప టెంపుల్ కి భక్తుల సంఖ్య పెరుగుతుందని, టెంపుల్ కమిటీ ల పైన దృష్టి పెట్టాలని, అన్ని సౌకర్యాల తో పెద్ద బస్ టెర్మినల్ కోసం ప్రణాళికలు సిద్ధం చేయాలని, వరంగల్ కు కాస్మోపాలిటన్ సిటీగా మారే అవకాశాలు ఉన్నాయని, ఆ దిశగా అధికారులు దృష్టి పెట్టి ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని, వరంగల్ భవిష్యత్ ను దృష్టిలో పెట్టుకుని అధికారులు పని చేయాలని అధికారులను ఆదేశించారు.



## జూరాల ఎడమ కాలువను
# పరిశీలించిన ఎస్పీ

- రైతుల సమస్యల పరిష్కారానికి అధికారులతో సమన్వయం..
- శాంతియుతంగా సమస్యలను తెలియజేయాలని సూచన

**వనపర్తి బ్యూరో -అమరచింత, సెప్టెంబర్ 21 (జనం సాక్షి):** జూరాల కెనాల్ ఆయకట్టు పరిధిలో రైతులు ఎదుర్కొంటున్న సాగునీటి సమస్యలను ప్రజాస్వామ్య పద్ధతిలో శాంతియుతంగా సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని వనపర్తి జిల్లా ఎస్పీ సునిత రెడ్డి సూచించారు. రైతుల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లే క్రమంలో పోలీసు శాఖ తరఫున అవసరమైన సహకారం అందిస్తామని తెలిపారు. సోమవారం జూరాల డ్యాం వద్ద ఎడమ కాలువ ప్రాంతాన్ని జిల్లా ఎస్పీ స్వయంగా పరిశీలించారు. క్షేత్రస్థాయిలో నెలకొన్న పరిస్థితులను తెలుసుకుని, రైతులు ఎదుర్కొంటున్న సాగునీటి ఇబ్బందులపై వివరాలను పరిశీలించారు. రైతుల సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి, పరిష్కారానికి సమన్వయంతో కృషి చేయాలని సూచించారు. సాగునీటి సమస్యలపై రైతులు తమ అభిప్రాయాలను, సమస్యలను శాంతియుతంగా తెలియజేయాలని ఎస్పీ కోరారు. నిరసన కార్యక్రమాలు నిర్వహించే సమయంలో సంయమనం పాటించాలని, ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావివ్వకుండా వ్యవహరించాలని సూచించారు. ప్రజల రాకపోకలకు అంతరాయం కలగకుండా కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. రైతుల సమస్యలను ప్రజాస్వామ్యబద్ధంగా అధికారుల దృష్టికి తీసుకెళ్లేందుకు పోలీసు శాఖ సహకరిస్తుందని ఆమె స్పష్టం చేశారు. అదే సమయంలో శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా ప్రతి ఒక్కరూ పోలీసు శాఖకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. రైతులు, అధికారులు పరస్పర సమన్వయంతో వ్యవహరిస్తే సమస్యలను సానుకూలంగా పరిష్కరించుకునే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.


# పోక్సో కేసులో నిందితుడికి ఐదేండ్ల జైలు



**కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 21(జనంసాక్షి):** వాంకిడి పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన పోక్సో కేసులో నిందితుడికి ఆసిఫాబాద్ జిల్లా న్యాయస్థానం ఐదేళ్ల జైలు శిక్షతో పాటు రూ.10,000 జరిమానా విధిస్తూ జిల్లా న్యాయస్థాన ప్రధాన న్యాయమూర్తి శారదా దేవి తీర్పు వెలువరించినట్లు జిల్లా ఎస్పీ నితికా పంత్ తెలిపారు. కేసు వివరాలలోకి వెళితే.... 07.05. 2022న మధ్యాహ్నం సుమారు 12 గంటల సమయంలో బాలిక ఇతర పిల్లలతో కలిసి ఆడుకుంటుండగా, అదే గ్రామానికి చెందిన వడ్డరే హనుమంతు (వయస్సు 66 సంవత్సరాలు), తండ్రి చంద్రు అనే వ్యక్తి బాలికకు రూ.50 చూపించి దుకాణానికి తీసుకెళ్తానని చెప్పి, అనంతరం మాయమాటలు చెప్పి తన ఇంటి వైపు తీసుకెళ్లాడు. ఈ విషయాన్ని నిందితుడి ఇంటి సమీపంలో ఉన్న ఓ మహిళ గమనించారు. కొద్దిసేపటి తర్వాత నిందితుడి ఇంటి నుంచి బాలిక అరుపులు వినిపించడంతో చుట్టుపక్కల వారు అక్కడికి చేరుకుని నిందితుడిని బయటకు తీసుకువచ్చారు. బాధితురాలి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు అప్పటి వాంకిడి ఎస్సై లావణ్య కేసు నమోదు చేశారు. అనంతరం అప్పటి దర్యాప్తు అధికారి డీఎస్పీ శ్రీనివాస్ కేసును సమగ్రంగా దర్యాప్తు చేసి, నిందితుడిని అరెస్ట్ చేసి, కోర్టులో అభియోగ పత్రం (చార్జిషీట్) దాఖలు చేశారు. క్రైమ్ నెంబర్ 87/2022గా నమోదై కేసును విచారించిన ఆసిఫాబాద్ జిల్లా న్యాయస్థానం ప్రధాన న్యాయమూర్తి శారదా దేవి నిందితుడికి పోక్సో చట్టం సెక్షన్ -10 కింద ఐదేళ్ల జైలు శిక్ష, రూ.10,000 జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు. ఈ కేసులో ప్రభుత్వ తరఫున పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎం.శ్రీనివాస్ 11 మంది సాక్షులను కోర్టులో హాజరు పరిచి వాదనలు వినిపించారు. కోర్టు లైజనింగ్ ఆఫీసర్ జె. బాల్ సింగ్, సీడీఓ రాంసింగ్, ధనరాజ్ సమర్థవంతంగా సమన్వయం చేస్తూ కేసు పురోగతికి సహకరించారు. కేసుకు సంబంధించిన సాక్ష్యాధారాలను సమర్థవంతంగా సేకరించి, సమగ్రంగా దర్యాప్తు పూర్తి చేసి, నిందితుడికి శిక్ష పడేలా కృషి చేసిన పిపి ఎమ్. శ్రీనివాస్ ,ప్రస్తుత ఆసిఫాబాద్ డీఎస్పీ బి. అశోక్, ప్రస్తుత వాంకిడి సీఐ ఎస్. వేణుగోపాల్, ఎస్సై డి. మహేందర్, కోర్టు లైజనింగ్ ఆఫీసర్ కె. బాల్ సింగ్, సబ్ డివిజన్ సీడీఓ రాంసింగ్, ధనరాజ్ , భరోసా అడ్వకేట్ శైలజ, అలాగే సాక్షులను సమన్వయం చేసి గౌరవ న్యాయస్థానంలో సకాలంలో హాజరుపరిచిన పోలీసు అధికారులను, సిబ్బందిని జిల్లా ఎస్పీ నితికా పంత్ అభినందించారు. నేరాలకు పాల్పడే వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని, బాధితులకు న్యాయం జరిగేలా జిల్లా పోలీస్ శాఖ ఎల్లప్పుడూ కట్టుబడి పనిచేస్తుందని జిల్లా ఎస్పీ నితికా పంత్ తెలిపారు.

# కుప్పంలో జలహారతి.. తెలంగాణ రైతుల కన్నీటి ఆర్తి

- శ్రీశైలం నుంచి 672 కిలోమీటర్లు ప్రయాణించిన కృష్ణా జలాలు కుప్పం చేరిక
- తెలంగాణ రైతులకు సాగునీరు ఇవ్వకుండా ఏపీకి నీటి తరలింపుపై మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి ఆగ్రహం



**వనపర్తి బ్యూరో సెప్టెంబర్ 21 (జనంసాక్షి) :** శ్రీశైలం ప్రాజెక్టు నుంచి 672 కిలోమీటర్లు ప్రయాణించి కృష్ణా జలాలు కుప్పం చేరుకున్నాయని, మరోవైపు కృష్ణా నది పరివాహక ప్రాంతంలో ఉన్న తెలంగాణ రైతులు సాగునీటి కోసం కన్నీరు పెట్టుకుంటున్నారని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నారు. కుప్పంలో నిర్వహించాల్సిన జలహారతి కార్యక్రమం వాయిదా పడిందని పేర్కొన్నారు. ఏవీఆర్--హెచ్ఎన్ఎస్ఎస్ ప్రాజెక్టు రెండో దశలో భాగంగా రూ.560.29 కోట్ల వ్యయంతో 123.64 కిలోమీటర్ల పొడవైన కుప్పం బ్రాంచ్ కెనాల్‌ను నిర్మించినట్లు తెలిపారు. శ్రీశైలం నుంచి విడుదలయ్యే నీటిని హంద్రీ--నీవా సుజల స్రవంతి ద్వారా కుప్పం బ్రాంచ్ కెనాల్‌కు తరలించి, కుప్పం నియోజకవర్గంలోని 110 చిన్నతరహా నీటిపారుదల చెరువుల ద్వారా 6,300 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు, కుప్పం, పలమనేరు ప్రాంతాల్లోని సుమారు 4.02 లక్షల మందికి తాగునీరు అందించే చర్యలు చేపట్టారని పేర్కొన్నారు. కృష్ణా నదికి సమీపంలో ఉన్న, కృష్ణా జలాలపై హక్కు ఉన్న పాలమూరు ప్రాంత రైతులకు మాత్రం సాగునీరు అందడం లేదని నిరంజన్‌రెడ్డి ఆరోపించారు. విద్యుత్ సరఫరా సక్రమంగా లేకపోవడంతో ఎత్తిపోతల పథకాల మోటార్లు పనిచేయక రైతుల పొలాలు ఎండిపోతున్నాయని అన్నారు. జూరాల నుంచి సాగునీరు విడుదల చేయకుండా ప్రభుత్వం రైతులను ఇబ్బందులకు గురిచేస్తోందని విమర్శించారు. ఎల్‌నినో పరిస్థితులను కారణంగా చూపుతూ తెలంగాణలో క్రాప్ హాలిడే పరిస్థితులు ఏర్పడేలా ప్రభుత్వం వ్యవహరిస్తోందని ఆరోపించారు. శ్రీశైలం ప్రాజెక్టు నుంచి పోతిరెడ్డిపాడు, వెలిగొండ మార్గాల ద్వారా కృష్ణా బేసిన్‌కు సంబంధం లేని ప్రాంతాలకు నీటిని తరలిస్తున్నప్పటికీ తెలంగాణ ప్రభుత్వం అడ్డుకోవడంలో విఫలమైందని అన్నారు. కృష్ణా నది పక్కనే ఉన్న తెలంగాణ ప్రాంతంలోని చెరువులకు మాత్రం నీరు అందడం లేదని పేర్కొన్నారు. తెలంగాణ ప్రయోజనాలు, జల హక్కుల విషయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని నిరంజన్‌రెడ్డి విమర్శించారు. ప్రభుత్వం తన విధానాలను మార్చుకుని తెలంగాణ రైతులకు సాగునీరు అందించేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సాగునీటి కోసం ప్రశ్నిస్తున్న బీఆర్ఎస్ నాయకులను పోలీసులు గృహనిర్బంధం చేయడం సరికాదని అన్నారు. తెలంగాణ రైతులకు సాగునీరు అందించడంలో విఫలమవుతున్న రాష్ట్ర ప్రభుత్వం, ఏపీ ప్రభుత్వం చేపడుతున్న నీటి తరలింపును అడ్డుకోవడంలోనూ విఫలమైందని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి ఒక ప్రకటనలో విమర్శించారు.

# చందా చోరీ - 105 సార్లు

## నమ్మకానికి పరీక్ష.. వ్యవస్థకు చెంపపెట్టు

అయోధ్య రామాలయంలో వెలుగులోకి వచ్చిన చందా చోరీ ఉదంతం ఒక సాధారణ ఆర్థిక అవకతవక కాదు. కోట్లాది మంది భక్తుల విశ్వాసంతో ముడిపడిన వ్యవస్థలో పర్యవేక్షణ ఎంత బలహీనంగా ఉంది, జవాబుదారీతనం ఎంత లోపించింది అన్నదానికి ఇది తీవ్రమైన ప్రశ్నార్థకం. సుప్రీంకోర్టు విచారణలో సిట్ వెల్లడించిన వివరాల ప్రకారం ఒకటి రెండుసార్లు కాదు.. ఏకంగా 105 సార్లు విరాళాల చోరీ జరిగినట్లు గుర్తించారు. సీసీటీవీ దృశ్యాల ఆధారంగా ఘటనలను నిర్ధారించి, నిందితులను గుర్తించినట్లు సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా కోర్టుకు వివరించారు. సెప్టెంబర్ 25లోపు పూర్తి ఛార్జిషీట్ దాఖలు చేస్తామని సిట్ హామీ ఇచ్చింది.

ఇది ఏదో సాధారణ ఆలయంలో జరిగిన చోరీ కాదు. బాబ్రీ మసీదు-రామ జన్మభూమి వివాదం, అద్వానీ రథయాత్ర, కర్ఫ్యూలు, అల్లర్లు, ప్రాణనష్టం.. దశాబ్దాల రాజకీయ, సామాజిక, న్యాయ సంఘర్షణల తర్వాత కోర్టు తీర్పుతో నిర్మితమైన రామాలయం. కోట్లాది మంది భక్తుల విశ్వాసానికి ప్రతీకగా నిలిచిన చోట, అదే విశ్వాసం పేరుతో వచ్చే విరాళాలపై చేతులు పడటం మరింత తీవ్రమైన విషయం. విశ్వాసం ఎంత గొప్పదైనా, దాని పేరుతో వ్యవస్థలపై ప్రశ్నలు అడగకుండా వదిలేస్తే దుర్వినియోగానికి తలుపులు తెరిచినట్టే.

నిధుల చోరీ కేసులో ట్రస్టు డ్రైవర్ అరెస్టు కావడం, అనంతరం జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్టు ప్రధాన కార్యదర్శి చంపత్ రాయ్, సభ్యుడు అనిల్ మిశ్రా రాజీనామా చేయడం, ఆ తర్వాత సీఈవో వ్యవస్థను ఏర్పాటు చేసి మాజీ సైనికాధికారి జితేంద్ర మిశ్రాను నియమించడం.. ఇవన్నీ వ్యవస్థను పునఃపరిశీలించాల్సిన అవసరాన్ని ముందే సూచించాయి. అయినా 105 ఘటనలు వెలుగులోకి వచ్చే వరకు పర్యవేక్షణ వ్యవస్థ ఎందుకు కదల్లేదన్నదే ఇప్పుడు అసలు ప్రశ్న. ఒక్కసారి జరిగితే తప్పిదం కావచ్చు. పదిసార్లు జరిగితే వ్యవస్థ వైఫల్యం కావచ్చు. 105 సార్లు జరిగిందంటే పర్యవేక్షణలోని లోపాలను తీవ్రంగా పరిశీలించాల్సిందే.

నమ్మకం పేరుతో ప్రశ్నలను మూసివేయలేం. భక్తి పేరుతో లెక్కలను దాచలేం. పవిత్రత పేరుతో జవాబుదారీతనానికి మినహాయింపు ఇవ్వలేం. మత విశ్వాసం వ్యక్తిగత హక్కు కావచ్చు. కానీ కోట్ల రూపాయల విరాళాలు, ప్రజల నమ్మకంతో నడిచే సంస్థాగత వ్యవస్థలు మాత్రం ప్రజా పరిశీలనకు, ఆడిట్‌కు, పారదర్శకతకు లోబడి ఉండాల్సిందే. దేవుడిపై భక్తి వేరే.. దేవుడి పేరుతో నడిచే వ్యవస్థపై జవాబుదారీతనం వేరే. ఈ రెండింటిని కలగలపడం సమాజానికి ప్రమాదకరం.

శాస్త్ర సాంకేతిక రంగాల్లో ముందుకు దూసుకెళ్తున్న ప్రపంచంలో విరాళాల లెక్కల విషయంలో మాత్రం పాత పద్ధతులు, బలహీన పర్యవేక్షణ కొనసాగితే ఇలాంటి ఘటనలు పునరావృతం కాకమానవు. ప్రతి విరాళానికి డిజిటల్ రికార్డు, ప్రతి లావాదేవీకి ఆడిట్ ట్రయిల్, నిరంతర సీసీటీవీ పర్యవేక్షణ, స్వతంత్ర ఆడిట్, బాధ్యత నిర్ధారించే స్పష్టమైన వ్యవస్థ ఉండాలి. విశ్వాసాన్ని కాపాడాలంటే ముందుగా ఆ విశ్వాసాన్ని దోచుకునే అవకాశాలను మూసివేయాలి.

ఈ కేసులో అసలు పరీక్ష చోరీ చేసిన వారిని పట్టుకోవడంతో ముగియదు. 105 సార్లు చోరీ జరగడానికి వీలు కల్పించిన లోపాలు ఏమిటి? ఎవరి పర్యవేక్షణలో వైఫల్యం జరిగింది? ఎక్కడ నియంత్రణలు పనిచేయలేదు? అన్న ప్రశ్నలకు కూడా సమాధానాలు రావాలి. వ్యక్తులను శిక్షించడం అవసరం. కానీ వ్యవస్థలోని రంధ్రాలను మూసివేయడం అంతకంటే అవసరం.

భక్తి పేరుతో వచ్చిన ప్రతి రూపాయి పవిత్రమైనదే కావచ్చు. కానీ ఆ రూపాయిని నిర్వహించే వ్యవస్థ పవిత్రమని ముందుగానే భావించడం మాత్రం సరిపోదు. నమ్మకం అడగకుండా ఇవ్వొచ్చు.. కానీ నిధుల విషయంలో లెక్క మాత్రం అడగాల్సిందే. విశ్వాసాన్ని కాపాడేది అంధ నమ్మకం కాదు; పారదర్శకత, పర్యవేక్షణ, కఠినమైన జవాబుదారీతనం.

# ఎన్ఐఏ కోర్టు ఆదివాసులకు విధించిన మరణ శిక్షను రద్దు చేయాలి




పశ్చిమబెంగాల్ ఆదివాసీ ప్రాంతాలలో ఉద్యమాలు ఆవిర్భవించడం కోసం 1990 నుండి ప్రాంతంలోని బలగాలకు అధికారం ఇచ్చినపుడు, దశలుగా ఆదివాసులపై అణచివేత రాష్ట్రం చేసింది. కానీ ఆదివాసీ ఉద్యమం ఆ రాష్ట్రం చేసిన నిర్బంధాలను తట్టుకొని, కాకి ఎదురు రాష్ట్రం కూడా పట్టింది. కానీ నేటివరకు కార్పొరేట్లు వెన్నుదన్నుతో, ఆది ప్రాంతం నల్లదొరల కోసం సాయుధ అణచే రాష్ట్రం పనిచేస్తుందంటే బాగా మాయావిద్యలు ఆడుతుందో తెల్వ జరుగు ప్రక్రియలు. కానీ నల్లదొరలకోసం 4000 మంది బలగాలు ఆ తర్వాత, అంతకు రెండింతలు కానీ రెట్లు అధికంగా ఇచ్చిన బందూకులు కూడా ఉంటాయి. ఈ బందూకులతో ఆదివాసులు ఆడిపోయే మంచి వెల్లగొట్టాలని ఆదివాసీ నల్లదొరలు సుమారు 644 నల్లదొరలను నిరంతరం దూరం చేస్తూ, కాల్పుల్లో ఎన్నోమంది నాశనమైన అత్యంత క్రూరత్వంతో నిరిక్ష పంపుతూ, అక్కాడావాలు అట్లే లేకుండా వితకలను పడ్డాయని కొనసాగింది. వివేకి తగ్గుతూ ఆట్లే ప్రతిఘటనకు ఆదివాసులు జీవితంతోనూ కానీ సమానంగా దూరం చేస్తూ, వారందరినీ రూపాంతరం పొయి తలకిందులు. ఈ తలకిందుల్లో బాగానే రాజులు నల్లదొరలు టెన్ కొలాపులను కుంచి, ఎలలోపల, దగ్గర్లో రాంలో చేర్చి ఏర్పాటు చేసి ఉన్నారు. కాల్పుల్లో 50మంది గా ఆదివాసులను బహిరంగంగా నిరంకుశంగా ఉంచేవారు. ఎప్పుడా కాల్పుల్లో అనంతం దాడి పాతపడాలనికి తిన్ని చిరిగేసేవారు. మనుషులను అత్యంత పాశవికంగా అక్కాడావాలు తిని చేసి పాత్తు చేసేవారు. ఇలాంటి స్థితి ఒక్కసారి ప్రమాదం ఉండకుండా ఉండటానికి 2009 వస్తే నతి ఆదివాసీల అక్కాడావాలు సంఘటనకు రాష్ట్రం అన్నింటినీ నీరేరిది ప్రమాణం గాంధీయ కానీ హామీని కుమార్ సుప్రీం కోర్టులో 519 కేసులను సమాధానం చేయించారు. కానీ ఏ ఒక్క కేసు మీద ఏరాణి అనకుండా కేసులను నిరాకరించడం వలన ఉద్యమకారులు బలం పెరుగుతుందని సాకులో నమోదు చేసిన హామీలను కుమార్ రోజూ ప్రతిఘటన 5 గా ఉన్నట్లు అనగా. ఎన్.ఐ.ఎ. కోర్టు 10 మంది ఆదివాసులకు 29 మంది కార్మికులను మాత్రం దేవించింది 13 విధంగా జైలు విధించింది గుర్తించాలి. వారికి ఇచ్చిన మరణశిక్షను ఎన్.ఐ.ఎ. కోర్టు విధించింది. దీన్ని ప్రజాస్వామికవాదులందరూ తీస్తాం కాదంటే ఆదివాసీల పట్ల నిలబడి మరణశిక్షను రద్దుచేయాలి వరకు ఉద్యమించాల్సిన అవసరం ఉన్నది. ఒక్కస్సు ఆదివాసీ సమాజం నుంచి వచ్చిన మాయాకళ్లు ఆదివాసీల పట్ల కాకుండా కార్పొరేట్లు పట్లా నిలబడి ఆదివాసీల కోసం నిందనలు ఇచ్చి కార్పొరేట్లు అన్నిరకాలు కోసం ఆదివాసీల పేర్లు పెట్టి మృతులు అవుతూ పాత్సు అడవులకోసం అనేకాని వేదన్నుఉద్యమం ఆదివాసీలను ఆ దుష్కార్యాలు పేరు వెతికి వెతికి వారికి ఇచ్చిన వారిని దూరం చేయడం నిర్మాణంలోని బలిగామీలు బలంగా కొనసాగించాలి. అందులో బాగానే పందల్లో ఆదివాసీ కాల్పులు జరిగాయి. (ఆదివాసీ సమాజంలో దుష్కార్యాలు లేకపోయినప్పటికీ, ఇంతటి అనరాధనం ఆదివాసీల పాత్సులను సేవధ్యం బదులు ఎప్పుడా కూడా దుష్కార్యాలు పునరావృతం మాత్రం కర్మ అనకూడా అడుక్కులు వేయలేకపోయాయి. అప్పుడు పరిస్థితుల్లో ఆదివాసీల తరగతి తీరంగాని పైటపను దేవి దీవించను అంత మాత్రం ఏ విధంగా పాత్సు పను నిర్మాణంలో ఉంది నేడు ఉతిక్ష విధించడాన్ని మనందరం ఒప్పుకోవాల్సిన అవసరం ఉంది.

ప్రాతిపదికగాని హక్కు సంఘాలు కూడా ఉతిక్షను పూర్తిగా వ్యతిరేకించాయి, స్వయంసిద్ధం. సహాయక సమాజంలో రీ తక్క వారికి అవకాశమివ్వకుండా గుర్తింపు పుచ్చుకో సుమారు 2025 నాటికి ప్రపంచ వ్యాప్తంగా 113 దేశాలు మరణశిక్షను రద్దు చేసుకున్నాయి అనంత తక్కువ శోధించాలయినా. మరణ శిక్ష అనేది ప్రజాస్వామ్య వ్యవస్థలోని ప్రాధాన్యత అనాగరికమైన శిక్ష. ఈ శిక్ష ఎప్పుడు నేరాలు అడకుతాయి. కానీ ప్రజా జీవిత హక్కు ప్రాధానం గౌరవం జీవిత హక్కును ఉల్లంఘిస్తుంది. సమాజం ప్రపంచంలో మరణ శిక్ష జీవిత జైలు కాలం శిక్షలకు ప్రాధాన్యతనిచ్చాయి అన్ను ఒకరి జీవిత హక్కును రాజ్యాంగం ఎప్పుడా సరే బలపరచాలి అనునది ఆధిపత్యం

ఎవరికి ఉండదని ప్రజాస్వామ్య మాత్రాలు చెబుతున్నాయి. మన తెలంగాణాలో ఎన్నడైనా కాలంలో భూమయ్య కిశోర్ డియన్ అత్యాచారం జరిగినప్పుడు, కానీ అంతకు మించి రెండింతలు ఆ ఉతిక్షను రద్దు చేయాలని ప్రజాస్వామ్య ఉద్యమాలు నడిచాయి. అందుకోసం ప్రభుత్వం భూమయ్య ఉతిక్షను ఆపడు చేసింది.

అందుకాకుండా 1993 మార్చి 8న కేవలం గుంటూరు జిల్లా విజయవాడల సమీపంలో ఒక లారీ (ప్రావేట్) బస్సు దోపిడీకాలో జతగాంచి గంతెల విజయవర్ధన్ రావు పడిపోయి అతని సహచరుడు ఎలవతిప్పు పెట్రోల్ పోసి పెట్టు వెల్లగొట్టు. ఇది గావు దూరంలో బస్సులో ఉన్న ప్రయాణికులలో 23 మంది సహజ మరణించినయ్యారు. అనేకమంది తీవ్రంగా గాయపడ్డారు. అది అప్పట్లో కేసుపట్టడంగా తీవ్ర సంచలనం సృష్టించింది. 1995 లో స్థానిక పంచాయతీ కోర్టు ఈ కేసును విచారించి, ఈ రాయబారం నేరానికి గాను ఇద్దరు ప్రధాన నిందితులు విజయవర్ధన్ రావు, ఎలవతిప్పులకు మరణశిక్ష విధించింది. కానీ నేడు నేటివరకు పరిగణలోనే తీసుకోకపోయిన తెలుసు ప్రజలు ప్రజా సంఘాలు ఉతిక్షను పూర్తిగా ఉద్యమించుకొనికి ఆ శిక్షను భూమయ్య శిక్షగా మార్చారు.

ఇలా సమాజంలో అనే పటనలు రోజు చేసుకుంటూనే ఉంటాయి, అయితే మాత్రమే కాకుండా హక్కు, జీవిగాలలో పటనలు ప్రధానం చేసుకోని న్యాయస్థానాలు మాత్రమే పనిచేస్తున్నాయి. కానీ, విదేశీ కాలంలో నల్లదొరలు చేసిన అరాచకాలు, పాత్సు గురించి ఏ న్యాయస్థానం లాడుకుని న్యాయం చేయించలేదు. రాష్ట్రం దేశీ యూనివర్సిటీల విరుద్ధా (రె), నందిని మందల ప్రముఖ రచయితలను రామచంద్రి సంగా అడ్డంకించింది. సుప్రీం కోర్టులో కేసులు వేశారు. 2011లో ఇవే నల్లదొరలను చట్టబద్ధంగా నిషేధించింది. ఇలా చట్టబద్ధంపైన ఆదివాసీల జీవితాలను వారికి కాకుండా ఇదే, వారిని భయపడుతూ, పాతివ్రత పిడుగును గురుత్వం విధంగా రాష్ట్రం చేసింది. అందులో బాగానే ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, మహారాష్ట్ర, ఒడిశా, సుమారు 1,50,000 మంది ఆదివాసీలు పిడుగును గుర్తించారు. వారి సంబంధ బాంధవ్యాలు, భూములే ఉన్న గాని సంబంధం, అట్లే కూడా విగతకాలం చేసివేసి కాకుండాయి. కానీ నేడు రాష్ట్రాలే ఆదివాసీల నిత్యం రాజ్యాంగంను ఎదుర్కొంటూ జీవిత అనుభవం పరిస్థితి నిర్మాణం. దీన్నిపై తీవ్ర ప్రభుత్వం గాని, సుప్రీం కోర్టు గాని ఎప్పుడా లాడుకోని పునరావృతంలేదు. కాకపోతే పొల్టి చేసిన రాష్ట్రం పాత్సులను సంఘటనలకొనాడి వారిని నిష్కృతి కానీ నిష్కృతి కాదు అని మరగడిస్తాం, అంచెంచడం చేస్తూ వచ్చారు. దీనివల్లనే నేటివరకు తొలుతపుట్టిన ఆటుపట్టుపలు కోల్పోయిన, రక్షించుకోలేకపోయిన ఆదివాసీలు జీవిగాలలో పటనలు పొల్టి ఉండవచ్చు, అంత మాత్రం వారిని నేనుపట్టులు ఎలా మరగడించాలి, ఎప్పుడా రాజ్యాంగం ఏ నేరం చేస్తున్న ఉన్న నేనుపట్టు పాపకర్మంగా ఆలోచించి తీర్పులు చెప్పాల్సిన అవసరం ఉంది. కానీ నేడు న్యాయ వ్యవస్థ కూడా పాత విధానం చేసి కొండి వెళ్ళేవాళ్లు స్వయం (పరిస్థితి కోర్టులకు). అందుకే పాతకాలు అలోచనలో న్యాయస్థానాలు శిక్షా చర్యలకతిరస్కారం. అమెరికాలో వచ్చిన గావు పాపర్స్ కేసులు. ఇప్పటికీ అలా సరోకాశా మంచి ఉద్యమాలు నిర్మాణించినట్లు బెంగాల్. అందులో బాగానే ఆదివాసీల రాజకీయ భావనలు క్రిమినల్ కేసులు వారందరినీ పునరుద్ధరించి చేయాల్సిన కేసులను రద్దు చేసి అందరిని నిర్దోషులుగా విడుదల చేస్తేనే ఈ మాత

బహిరంగంగా వచ్చింది. అందులో బాగానే చత్తీస్‌గఢ్ గాని, గిరిజన్ గాని, తెలంగాణాలో గాని అనేక మంది ఉద్యమకారులు (ప్రభుత్వం కనుస్సృతిలో గాని వారు విరుద్ధం (ప్రజలలో భావనలు చేస్తున్నారు. ఇప్పటికీ అలా సరైన ఉద్యమం కూడా ప్రజాస్వామ్యం సంభావిస్తూ ఇద్దర ఇద్దర ఆలోచించకుండని విడుదల చేయాలని కేసులను రద్దు చేయాలని పలు సాధనా ప్రభుత్వం ప్రస్తుత తీసుకోవాలి. అందుకే కేంద్ర ప్రభుత్వం ముందుగా చత్తీస్‌గఢ్ రాష్ట్రం నుంచి నమూనా కేసులను సమీక్షించి విడుదల ప్రక్రియను పూర్తిగా నమ్మదించాలని ప్రభుత్వాలు చేస్తున్నాయి. అందులో బాగానే జీవిగాలలో పటనలు కూడా వారి పరిధిలోని మాత్రమే అది ఒక రాజకీయ ప్రక్రియగా గుర్తించాలని ఆదివాసీలందరు

తన స్వాతంత్ర్యం కోసం కాకుండా ఆదివాసీ సమాజాన్ని బలిగా బలపెట్టే అనాగరికమైన ప్రక్రియనని నిలబడకపోవడానికి ప్రభుత్వం నిలబడ్డప్పుడు అప్పుడు పరిస్థితుల్లో ఆటుపట్టు పటనల్లో పొల్టి పాత్సు చర్యలనేది ఆ పటనల నేటివరకు చూస్తే అర్థమవుతుంది.

పశ్చిమబెంగాల్ రాష్ట్రం మాత్రమయ్య ప్రభావం ఉన్న పరిస్థితులు ఆలోచిస్తే అప్పు రాష్ట్రంలో ఆ ఉద్యమం అనవాళ్లు కూడా లేకుండా సాయుధంగానే ప్రభుత్వాలు పాత్సు అంగీకరిస్తున్న సత్యం. ఇది దశాబ్దాలుగా మధ్య ప్రాంతంలో జరుగుతున్న పెద్దఎత్తు సంకటానికి ప్రధానం కేంద్ర ప్రభుత్వం కొనసాగించిన అనాగరికం. ఈ అనాగరికతు లక్షణాల సాయుధ బలగాలతో పాటు అంతర్గత సంక్షోభాన్ని కూడా బలంగా రావడానికి ఆ ఉద్యమమే ఆదివాసీలను అందుగా లేకుండా చేయలేకపోయింది. అలాగని ఆదివాసీ ప్రాంతం మాత్రం వివాదాలకు నీడయ్యే మాత్రాదా అనేది ప్రశ్నార్థకమే. కానీ జీవివాడాల పటన నేటివరకం దీన్ని పూర్తిగా పూర్తి మంచి ప్రధానం బెంగాల్ ప్రభుత్వం కనుస్సృతిలోనే చాలా దగ్గరగా ఉన్నాయి. ఆదివాసీలు వారిని కొనసాగిన వ్యక్త్యాలకు అనాగరికతకు పరిష్కారంగా భావించాలని ఉన్నప్పటికీ. అంత మాత్రం వారికి మరణ శిక్షలు విధించకూడదు, ఆ ఉద్యమం లేకుండా వారితోనే ప్రభుత్వాలు చర్యలు జరుపుతున్న ప్రక్రియను కూడా న్యాయస్థానాలు పరిగణనలోకి తీసుకోవాలి. ఇప్పటిక్కా జైల్లలో అనేక కేసులలో మస్తానులున్న ఉద్యమకారులను గాని ఆదివాసీలను గాని వెంటనే విడుదల చేసి ప్రజాస్వామ్యాన్ని జీవింపజేస్తూ నిందితుల్లోని కత్తులన్నీ ప్రభుత్వం నిర్మూలించాల్సిన అవసరం ఉంది.

గత ఐదు దశాబ్దాలుగా కొనసాగిన మాత్రమయ్య ఉద్యమంపై అనేక రకాల నిర్మాణాలు కాగానే, బెంగాల్ పాత్సు, ప్రభుత్వం సంఘటనగానే అనాగరికం కొనసాగించాయి. అందులో బాగానే ఆదివాసీ నల్లదొరలు ఎన్నికలయ్య ప్రజలందరు ఆ ఎన్నికలలక్ష్య నిబంధనలను చేయడంలాగా సంఘటనలు కూడా గుర్తు చేసే ఆదివాసీ ప్రాంతాల నుంచి అప్పటికీ సంఘటనకు కేసుల ప్రభుత్వం ప్రక్రమించిన నిజాలుగా పీడితులు ప్రతిఘటన వచ్చింది. రాష్ట్రం బాగానే ప్రధానం పీడితులు ప్రతి లోక్ పాత్సు పట్ల తీవ్ర ప్రతిఘటనకు గురైఆ ప్రాంతాలను విడిచిపెట్టాల్సి వచ్చింది. అందులో బాగానే 2015లో జగదల్‌పూర్ న్యాయ సంఘ బలపడం ఆదివాసీలను సహాయం నిలబడకుండని ఆ ప్రాంతం కూడా చత్తీస్‌గఢ్ రాష్ట్రం నుంచి ప్రభుత్వం నెట్టిపోయాయి. దీనిని ప్రభుత్వాలు వివరణగా మనం అర్థం చేసుకోని ఈ కేసులు కూడా ఆదివాసీ సమాజాన్ని కార్పొరేట్లకు పెంటాకు అయిన ఒక ప్రాంతం రాడి చేస్తే ఆ రాడిని ఎదుర్కొనడంలో బాగానే పటనలు గుర్తించి, అరిష్టు చేసిన ఆదివాసీలందరిని దీవెనలుగా విడుదల చేయాలని ఇచ్చే రాజకీయగా గుర్తించాలని పౌర హక్కు సంఘం కోరుతున్నది.



ఎన్. నారాయణ రావు
ప్రధాన కార్యదర్శి
పౌరహక్కుల సంఘం

# పాల్కురికి సోమనాథ విమానాశ్రయం కావాలి

తెలంగాణ సాహిత్య చరిత్రలో పాల్కురికి సోమనాథుడికి ప్రత్యేక స్థానం ఉంది. ప్రజల భాషకు సాహిత్యంలో స్థానం కల్పించిన కవిగా, ద్విపద ప్రక్రియను విస్తృతంగా ఉపయోగించిన రచయితగా ఆయన గుర్తింపు పొందారు. ఆయన రచనలు తెలుగు సాహిత్య వికాసంలో ఒక ముఖ్యమైన దశను సూచిస్తాయి. పాలకుర్తితో ఆయనకు ఉన్న చారిత్రక సాంస్కృతిక అనుబంధం ఈ ప్రాంతానికి ఆయన పేరును మరింత సమీపం చేస్తుంది.

వరంగల్ సమీపంలోని మామునూరు విమానాశ్రయాన్ని అభివృద్ధి చేసే ప్రక్రియ ప్రస్తుతం ముందుకు సాగుతోంది. తెలంగాణ ప్రభుత్వం ఈ విమానాశ్రయాన్ని అంతర్జాతీయ ప్రమాణాలతో అభివృద్ధి చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరింది. ప్రయాణికుల సేవలతో పాటు కార్గో, ఎంఆర్‌ఓ వంటి సదుపాయాలను కూడా అభివృద్ధి చేయాలని ప్రతిపాదించింది. 2026 సెప్టెంబరులో జరిగిన సమావేశంలో టెండర్ల ప్రక్రియను ప్రారంభించి, పనులకు పునాది వేసే దిశగా చర్యలు తీసుకుంటున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం వెల్లడించింది. మామునూరు విమానాశ్రయం అభివృద్ధి ఉత్తర తెలంగాణకు రవాణా, వాణిజ్య, పర్యాటక రంగాల్లో ప్రాధాన్యం కలిగిస్తుంది. వరంగల్ కాకతీయ చరిత్రకు కేంద్రంగా ఉంది. రామప్ప దేవాలయం, వేయిస్తంభాల గుడి, భద్రకాళి ఆలయం, మేడారం సమ్మక్క సారలమ్మ జాతర వంటి చారిత్రక, సాంస్కృతిక ప్రదేశాలకు ఈ ప్రాంతం ప్రధాన కేంద్రం. అందువల్ల విమానాశ్రయానికి పెట్టే పేరు కూడా ఈ ప్రాంత చరిత్ర, సంస్కృతితో సంబంధం కలిగి ఉండటం సముచితం. ఈ నేపథ్యంలో "పాల్కురికి సోమనాథ విమానాశ్రయం" అనే పేరు పరిశీలించాల్సిన అవసరం ఉంది.

పాల్కురికి సోమనాథుడి రచనల్లో బసవ పురాణం, పండితారాధ్య చరిత్ర, వృషాధిప శతకం, అనుభవసారం ముఖ్యమైనవి. తెలుగు సాహిత్య చరిత్రలో ద్విపదకు ఆయన అందించిన ప్రాధాన్యం విశేషమైనది. వృషాధిప శతకం శతక ప్రక్రియ చరిత్రలో ప్రాముఖ్యత కలిగిన రచనగా పరిశోధనల్లో ప్రస్తావించబడింది. బసవ పురాణం మధ్యయుగ తెలుగు సాహిత్యంలో ముఖ్యమైన రచనగా గుర్తించబడింది. సోమనాథుడి సాహిత్య ప్రత్యేకత ఆయన ఉపయోగించిన భాష, రచనా ప్రక్రియలో కూడా కనిపిస్తుంది. ప్రజలకు చేరువైన ద్విపదలో కథనాన్ని అందించడం ద్వారా సాహిత్యాన్ని పండితుల పరిధిని దాటి విస్తృత సమాజానికి చేరువ చేశారు. మధ్యయుగ సమాజంలోని వృత్తులు, జీవన విధానాలు, సామాజిక సంబంధాలకు సంబంధించిన అనేక అంశాలు ఆయన రచనల్లో కనిపిస్తాయి. అందువల్ల ఆయనను కేవలం ఒక మతసంప్రదాయానికి చెందిన కవిగా పరిమితం చేయకుండా తెలుగు సాహిత్య చరిత్రలోని విస్తృత సందర్భంలో చూడాల్సి ఉంటుంది.

పాల్కురికి సోమనాథుడి పేరుతో పాలకుర్తికి ఉన్న అనుబంధం కూడా ఈ ప్రతిపాదనకు ముఖ్యమైన ఆధారం. ప్రస్తుత జనగామ జిల్లాలోని పాలకుర్తి ఆయన పేరుతో చాలాకాలంగా గుర్తింపు పొందిన ప్రాంతం. సోమనాథుడి జీవితం, రచనలు, సాహిత్య వారసత్వానికి సంబంధించిన అనేక స్మృతులు అక్కడ కొనసాగుతున్నాయి. ఆయన జీవితానికి సంబంధించిన కొన్ని వివరాలపై చారిత్రక ఆధారాలు, సాహిత్య సంప్రదాయాల్లో భేదాలు ఉన్నప్పటికీ, పాలకుర్తితో ఆయనకు ఉన్న సాంస్కృతిక అనుబంధం విస్తృతంగా గుర్తించబడింది. పాలకుర్తి – వరంగల్ ప్రాంతాల మధ్య ఉన్న ఈ చారిత్రక సంబంధాన్ని మామునూరు విమానాశ్రయ నామకరణంతో అనుసంధానించవచ్చు. విమానాశ్రయం వరంగల్ ప్రాంతానికి అంతర్జాతీయ అనుసంధానాన్ని కల్పించే కేంద్రంగా అభివృద్ధి చెందుతున్న సమయంలో, తెలంగాణకు చెందిన ప్రముఖ కవి పేరును దానికి పెట్టడం ద్వారా



ప్రాంతీయ సాహిత్య వారసత్వానికి ప్రజా గుర్తింపు లభిస్తుంది.

విమానాశ్రయానికి పేరు పెట్టడం పరిపాలనా గుర్తింపు మాత్రమే కాదు. ప్రజా ప్రదేశాల పేర్లు చరిత్రను నిరంతరం గుర్తు చేస్తాయి. ఒక ప్రాంతానికి చెందిన చారిత్రక వ్యక్తి పేరు విమానాశ్రయానికి పెట్టినప్పుడు ఆ పేరు దేశంలోని ఇతర ప్రాంతాలకు, ప్రపంచానికి కూడా పరిచయమవుతుంది. వరంగల్‌కు వచ్చే ప్రయాణికులు ఆ పేరు ద్వారా తెలంగాణ సాహిత్య చరిత్రలోని ఒక ముఖ్యమైన వ్యక్తిత్వాన్ని తెలుసుకునే అవకాశం ఉంటుంది. తెలంగాణ ప్రభుత్వం మామునూరు విమానాశ్రయ రూపకల్పనలో కాకతీయ వారసత్వం, తెలంగాణ సంస్కృతిని ప్రతిబింబించే అంశాలను పరిగణనలోకి తీసుకోవాలని కోరినట్లు ప్రకటించింది. ఈ సాంస్కృతిక నేపథ్యానికి పాల్కురికి సోమనాథుడి సాహిత్య వారసత్వాన్ని కూడా జోడించవచ్చు. విమానాశ్రయంలో ఆయన రచనలు, ద్విపద ప్రక్రియ, పాలకుర్తి--వరంగల్ సాహిత్య చరిత్రకు సంబంధించిన సమాచారాన్ని డిజిటల్ ప్రదర్శనల రూపంలో అందించవచ్చు. ఇది ఒక కవికి పేరు పెట్టడం మాత్రమే కాదు. తెలంగాణ భాషా సాహిత్య చరిత్రకు ఒక శాశ్వత ప్రజా గుర్తింపును ఇవ్వడం. ముఖ్యంగా ప్రాంతీయ చరిత్రలో విస్మరణకు గురైన సాహిత్య వ్యక్తిత్వాలను కొత్త తరాలకు పరిచయం చేసే అవకాశం కూడా ఇది కల్పిస్తుంది.

అందువల్ల మామునూరు విమానాశ్రయానికి "పాల్కురికి సోమనాథ విమానాశ్రయం" అనే పేరు పెట్టే ప్రతిపాదనను తెలంగాణ ప్రభుత్వం పరిశీలించాలి. సాహితీవేత్తలు, చరిత్రకారులు, విశ్వవిద్యాలయాలు, సాంస్కృతిక సంస్థలు, పాలకుర్తి – వరంగల్ ప్రాంతాల ప్రజాప్రతినిధులతో సంప్రదింపులు జరిపి ఈ ప్రతిపాదనపై నిర్ణయం తీసుకోవచ్చు. అవసరమైతే కేంద్ర పౌర విమానయాన శాఖకు అధికారికంగా ప్రతిపాదన పంపవచ్చు. మామునూరు విమానాశ్రయం భవిష్యత్తులో దేశంలోని ఇతర ప్రాంతాలతో, అంతర్జాతీయ గమ్యస్థానాలతో వరంగల్‌ను అనుసంధానించే కేంద్రంగా ఎదగనుంది. అలాంటి విమానాశ్రయానికి తెలంగాణ సాహిత్య చరిత్రలో ప్రత్యేక స్థానమున్న పాల్కురికి సోమనాథుడి పేరు పెట్టడం ద్వారా ప్రాంత అభివృద్ధికి, సాంస్కృతిక గుర్తింపుకు ఒకేసారి ప్రాధాన్యం ఇవ్వవచ్చు. మామునూరు విమానాశ్రయానికి "పాల్కురికి సోమనాథ విమానాశ్రయం" అనే పేరు పెట్టాలి. తెలంగాణ సాహిత్య వారసత్వానికి ఈ పేరు శాశ్వత గుర్తింపుగా నిలవాలి.

- జెన్నీ మార్క్స్

# పెన్షన్‌కు పరీక్ష

ఉద్యోగ జీవితంలో మూడు దశాబ్దాలు, నాలుగు దశాబ్దాలు ప్రభుత్వానికి సేవ చేసిన వ్యక్తికి పదవీ విరమణతో సేవ ముగుస్తుంది కానీ ప్రభుత్వంతో అతని సంబంధం ముగియదు. అతను పొందే పెన్షన్ గతంలో చేసిన సేవకు వాయిదా వేసిన ప్రతిఫలం. అందుకే పెన్షన్‌ను ప్రభుత్వ దయగా కాకుండా ఉద్యోగి సంపాదించుకున్న హక్కుగా చూడాలనే భావన భారత న్యాయవ్యవస్థలో బలంగా స్థిరపడింది. అలాంటి హక్కుకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం 2025 ఆర్థిక చట్టం ద్వారా తీసుకొచ్చిన కొత్త నిబంధనలు ఇప్పుడు లక్షలాది పెన్షనర్లలో ఆందోళన కలిగిస్తున్నాయి.

వాస్తవానికి 2025 ఆర్థిక చట్టంలోని నాలుగో భాగం ద్వారా కేంద్ర ప్రభుత్వానికి పెన్షనర్ల మధ్య తేడాలు సృష్టించే అధికారాన్ని స్పష్టంగా పేర్కొన్నారు. ముఖ్యంగా కేంద్ర వేతన సంఘాల సిఫారసులను అమలు చేసే సందర్భంలో రిటైర్మెంట్ తేదీని పెన్షన్ వర్గీకరణకు ఆధారంగా చేసుకోవచ్చని చట్టం చెబుతోంది. ఈ నిబంధనకు 1 జూన్ 1972 నుంచి వెనుకటి తేదీతో అమలును కల్పించడం మరో ముఖ్యమైన అంశం. 1972లోని కేంద్ర సివిల్ సర్వీసెస్ పెన్షన్ నిబంధనలు, 2021 నిబంధనలు, 2023లోని అసాధారణ పెన్షన్ నిబంధనలకు సంబంధించిన చట్టపరమైన స్థితిని ఈ భాగం ధ్రువీకరిస్తోంది.

ప్రభుత్వం మాత్రం ఈ చట్టం వల్ల ప్రస్తుతం ఎవరికీ చెల్లిస్తున్న పెన్షన్‌ను తగ్గించడం లేదని, ఇప్పటికే ఉన్న సివిల్ లేదా రక్షణ పెన్షన్లను ఇది నేరుగా మార్చడం లేదని పార్లమెంటులో స్పష్టం చేసింది. 2026లో రాజ్యసభలో ఇచ్చిన సమాధానంలో కూడా ఆర్థిక మంత్రిత్వ శాఖ ఇదే విషయాన్ని పేర్కొంది. అదే సమయంలో, పెన్షన్ సవరణలు సాధారణంగా కేంద్ర వేతన సంఘాల ఆమోదిత సిఫారసులను అమలు చేసే ప్రభుత్వ ఉత్తర్వుల ద్వారా జరుగుతాయని తెలిపింది. అయితే పెన్షనర్ల అసలు ఆందోళన ఇక్కడే ఉంది. ఈ రోజు పెన్షన్ తగ్గుతుందా లేదా అన్నది ఒక్కటే ప్రశ్న కాదు; రేపటి పెన్షన్ సవరణకు ఎవరు అర్హులు, ఏ ఫార్ములా వర్తిస్తుంది అన్నదే అసలు ప్రశ్న. ఒకే హోదాలో, ఒకే విధమైన బాధ్యతలు నిర్వర్తించి, ఒకే విధమైన సర్వీస్ రికార్డుతో పనిచేసిన ఇద్దరు ఉద్యోగుల్లో ఒకరు డిసెంబర్‌లో, మరొకరు జనవరిలో పదవీ విరమణ చేశారనే కారణంతో భవిష్యత్తులో వేర్వేరు పెన్షన్ సవరణలు వస్తే అది తీవ్ర అసమానతకు దారితీయవచ్చని పెన్షనర్ సంఘాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.

ఈ భయానికి మరో కారణం ఎనిమిదో కేంద్ర వేతన సంఘం నిబంధనలు. 2025 నవంబర్ 3న ప్రకటించిన ఎనిమిదో వేతన సంఘానికి వేతనాలు, అలవెన్సులతో పాటు పెన్షన్, రిటైర్మెంట్ ప్రయోజనాలపై సిఫారసులు చేసే బాధ్యత ఉంది. అయితే గత కొన్ని వేతన సంఘాల నిబంధనల్లో కనిపించిన "ఇప్పటికే పదవీ విరమణ చేసినవారి పెన్షన్ సవరణ"పై స్పష్టమైన భాష ఈసారి లేకపోవడం పెన్షనర్ సంఘాల ఆందోళనకు కారణమైంది. అధికారికంగా ఎనిమిదో వేతన సంఘానికి పెన్షన్‌పై సిఫారసులు చేసే అధికారం ఉన్నప్పటికీ, ప్రీ-2026 పెన్షనర్లందరికీ సవరణ తప్పనిసరిగా వర్తిస్తుందని ఇప్పటివరకు స్పష్టమైన హామీ లేదు.

ఈ విషయంలో సుప్రీంకోర్టు పాత తీర్పులను విస్మరించలేం. 1982లోని డి.ఎస్. నకారా వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా తీర్పులో కోర్టు పెన్షనర్లను ఒక సమూహంగా పరిగణించి, కేవలం రిటైర్మెంట్ తేదీ ఆధారంగా ఒకే తరహా పెన్షన్ సవరణ ప్రయోజనాన్ని కొందరికి ఇచ్చి మరికొందరికి నిరాకరించడం ఆర్టికల్ 14 సమానత్వ సూత్రానికి విరుద్ధమని పేర్కొంది. తర్వాతి తీర్పుల్లో కూడా ఈ న్యాయ సూత్రానికి ప్రాధాన్యం కనిపించింది.

2023లో సుప్రీంకోర్టు ఒక కేసులో డి.ఎస్. నకారా తీర్పును వర్తింపజేస్తూ, రిటైర్మెంట్ తేదీ ఆధారంగా పెన్షన్ సవరణలో భేదం చూపలేమని స్పష్టం చేసింది. అయితే అదే సమయంలో కోర్టు తీర్పులు ప్రతి సందర్భంలోని నిబంధనలు, ప్రయోజనం, వర్గీకరణకు ఉన్న తార్కిక ఆధారం వంటి అంశాలను పరిశీలిస్తాయి. అందువల్ల "ప్రతి రిటైర్మెంట్ తేదీ ఆధారిత వర్గీకరణ స్వయంచాలకంగా రాజ్యాంగ విరుద్ధమే" అని సరళీకరించడం కంటే, కొత్త చట్టం రాజ్యాంగ సమానత్వ సూత్రాలతో ఎలా సరిపోతుందో న్యాయస్థానమే తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది.

ఇక్కడే ప్రభుత్వానికి ఒక కీలక బాధ్యత ఉంది. పార్లమెంటు చట్టం చేసినంత మాత్రాన రాజ్యాంగ హక్కులపై చర్చ ముగిసిపోదు. శాసనం కూడా రాజ్యాంగానికి లోబడి ఉంటుంది. ఒక చట్టం గతంలో కోర్టు గుర్తించిన హక్కులకు భిన్నమైన వ్యవస్థను తీసుకురావాలంటే, దానికి స్పష్టమైన చట్టపరమైన ఆధారం, తార్కికమైన వర్గీకరణ, సమానత్వ సూత్రాలకు అనుగుణమైన ప్రయోజనం ఉండాలి. "వేతన సంఘం సిఫారసులను అమలు చేయడానికి ప్రభుత్వం భేదం చూపవచ్చు" అనే సాధారణ అధికారం భవిష్యత్తులో ఎలాంటి భేదానికైనా స్వయంచాలక అనుమతి ఇచ్చినట్టుగా భావించడం సరైంది కాదు.

పెన్షనర్ల ఆందోళనను ఈ నేపథ్యంలో గౌరవంగా పరిగణించాల్సిన అవసరం ఉంది. దేశంలోని కోట్లాది వృద్ధుల జీవనంలో పెన్షన్ కేవలం నెలవారీ ఆదాయం కాదు. మందులు, వైద్యం, ఇంటి అద్దె, ఆహారం, విద్యుత్ బిల్లులు, కుటుంబ అవసరాలు అన్నీ దానిపైనే ఆధారపడి ఉండే సందర్భాలు ఉన్నాయి. కేంద్ర ప్రభుత్వ గణాంకాల ప్రకారం సుమారు 69 లక్షల మంది కేంద్ర ప్రభుత్వ పెన్షనర్లు, కుటుంబ పెన్షనర్లు ఉన్నారు. అందువల్ల పెన్షన్ విధానంలో చిన్న మార్పు కూడా విస్తృతమైన సామాజిక ప్రభావాన్ని కలిగిస్తుంది.రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల పరిస్థితి కొంత భిన్నం. వారికి ఆయా రాష్ట్రాల పెన్షన్ నిబంధనలు వర్తిస్తాయి. అయినప్పటికీ కేంద్ర వేతన సంఘాల విధానాలు అనేక రాష్ట్రాలకు మార్గదర్శకంగా ఉంటాయి. కాబట్టి కేంద్ర స్థాయిలో రిటైర్మెంట్ తేదీ ఆధారిత వర్గీకరణ ఒక సాధారణ విధానంగా మారితే, భవిష్యత్తులో దాని ప్రభావం ఇతర ప్రభుత్వ రంగాలపైనా చర్చకు రావచ్చు. అయితే ప్రతి రాష్ట్రంలో చట్టపరమైన పరిస్థితి ఒకేలా ఉండదనే విషయాన్ని కూడా గుర్తించాలి.ప్రస్తుతం అవసరమైనది ఆందోళనలను అణచివేయడం కాదు; స్పష్టత ఇవ్వడం. ఎనిమిదో వేతన సంఘం పరిధిలో 2026 జనవరి 1కు ముందు పదవీ విరమణ చేసిన పెన్షనర్లందరి పెన్షన్ సవరణపై స్పష్టమైన హామీ ఇవ్వాలి. ఏ తేదీకి ముందు, ఏ తేదీ తర్వాత అనే కృత్రిమ విభజన వల్ల ఒకే హోదాలో పనిచేసిన వృద్ధ ఉద్యోగుల మధ్య అన్యాయం జరగకుండా స్పష్టమైన సూత్రాన్ని ప్రకటించాలి. సుదీర్ఘకాలం ప్రభుత్వ సేవ చేసినవారికి పదవీ విరమణ తర్వాత "మీరు ఏ తేదీన రిటైర్ అయ్యారు?" అనే ప్రశ్నకంటే "మీరు ఏ సేవ చేశారు?" అన్నదే ప్రజాస్వామ్య సంక్షేమ రాజ్యానికి మరింత తగిన ప్రశ్న. పెన్షన్ అనేది గత సేవకు భవిష్యత్తులో చెల్లించే సామాజిక భద్రత. అందుకే వృద్ధాప్యంలో ఆర్థిక భద్రత కోసం జీవితాంతం పనిచేసిన వారి హక్కుల విషయంలో ప్రభుత్వం మరింత ఉదారంగా, పారదర్శకంగా, రాజ్యాంగ విలువలకు అనుగుణంగా వ్యవహరించాలి. పెన్షనర్లలో నెలకొన్న అనిశ్చితిని తొలగించడానికి కేంద్ర ప్రభుత్వం రిటైర్మెంట్ తేదీ ఆధారంగా అన్యాయమైన భేదాలకు అవకాశం లేకుండా చట్టాన్ని పునఃపరిశీలించి, అవసరమైన మార్పులు చేయడం సముచితమైన మార్గం.



డాక్టర్ కోలాహలం
రామ్ కిశోర్
9849328496.

# గిరిజనులను విస్మరిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం

- కాంగ్రెస్ ప్రభుత్వం వాహనాల సబ్సిడీ బకాయిలను వెంటనే విడుదల చేయాలి
- అలియాబాద్ మున్సిపాలిటీ బీజేపీ ఎస్టీ మోర్చా అధ్యక్షుడు ధీరావత్ భీమా నాయక్



**శామీర్‌పేట్, సెప్టెంబర్ 21 (జనంసాక్షి) :** తెలంగాణ గిరిజన సంక్షేమ శాఖ (ట్రైబల్ వెల్ఫేర్ డిపార్ట్మెంట్) ద్వారా గతంలో మంజూరైన ఆదివాసీ లబ్ధిదారుల వాహనాల సబ్సిడీ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ అలియాబాద్ మున్సిపాలిటీ బీజేపీ ఎస్టీ మోర్చా అధ్యక్షుడు ధీరావత్ భీమా నాయక్ ఆధ్వర్యంలో రాష్ట్ర అధ్యక్షుడు నేనావత్ రవి నాయక్, జిల్లా ఎస్టీ మోర్చా అధ్యక్షుడు లాడియా రామ్ నాయక్ తో కలిసి హైదరాబాద్‌లోని గిరిజన సంక్షేమ కమిషనర్ కార్యాలయం (డిఎస్ఎస్ భవన్, మాసబ్ ట్యాంక్) ముట్టడి చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడు తూ.. రేవంత్ రెడ్డి ప్రభుత్వ మొండి వైఖరితో గిరిజన లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన చెందారు. సబ్సిడీ నిధుల నిలిపివేతతో గిరిజన సహకార ఆర్థిక కార్పొరేషన్ (టిఆర్ఐసిఓఆర్) ద్వారా ఆదివాసీ నిరుద్యోగ యువతకు గతంలో ట్రాక్టర్లు, కార్లు, గూడ్స్ వాహనాల కొనుగోలుకు సబ్సిడీలు మంజూరయ్యాయని పేర్కొన్నారు. అయితే, ప్రభుత్వం నుండి నిధులు సకాలంలో విడుదల కాకపోవడంతో బ్యాంకులు మరియు షోరూమ్‌ల వద్ద లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే సబ్సిడీ నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం గిరిజనులకు బకాయి ఉన్న 1700 రూపాయల కోట్లు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సబ్సిడీ మంజూరై ఏళ్లు గడుస్తున్నా బకాయిలు చెల్లించక పోవడంతో తీవ్ర నష్టాలు వస్తున్నాయని, చాలా మంది లబ్ధిదారులు వాహనాల ఫైనాన్స్ కట్టలేక ఇబ్బందులు పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. 'గిరిజనులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఏమిచ్చింది.. గాడిద గుడ్డు ఇచ్చింది!' అంటూ ప్లకార్డుల ప్రదర్శనతో పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. గిరిజన సంఘాల నేతలు, రాష్ట్రవ్యాప్తంగా లబ్ధిదారులు కమిషనరేట్ ముట్టడిని పోలీసులు అడ్డుకొని వారిని పోలీస్ స్టేషన్ కు తరలించారు.

# పెండింగ్ హియరింగ్స్‌ను త్వరితగతిన పూర్తి చేయాలి

- ఎస్ఐఆర్ ప్రక్రియపై అధికారులతో కలెక్టర్ సమీక్ష




**వనపర్తి, సెప్టెంబర్ 21 (జనం సాక్షి) :** ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో భాగంగా నో మ్యాపింగ్, అనామలీస్‌కు సంబంధించి జారీ చేసిన నోటీసులపై పెండింగ్‌లో ఉన్న హియరింగ్స్‌ను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి అధికారులను ఆదేశించారు. అర్హత కలిగిన ఓటర్ల వివరాలను పరిశీలించి తుది ముసాయిదా ఓటరు జాబితా ప్రచురణకు సిద్ధం చేయాలని సూచించారు. సోమవారం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి పి. సుదర్శన్ రెడ్డి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి ఎస్ఐఆర్ ప్రక్రియ పురోగతిపై సమీక్షించారు. వనపర్తి కలెక్టరేట్ నుంచి కలెక్టర్ ఆదర్శ్ సురభి ఈ సమావేశంలో పాల్గొన్నారు. జిల్లాలో నోటీసులకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న హియరింగ్స్ వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. నోటీసులు అందుకున్న ప్రతి ఓటరుకు సంబంధించిన విచారణను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు. విచారణకు హాజరైన ఓటర్ల నుంచి అవసరమైన పత్రాలను స్వీకరించి, వాటిని క్షుణ్ణంగా పరిశీలించిన అనంతరం వివరాలను సంబంధిత రికార్డుల్లో నమోదు చేయాలని ఆదేశించారు. వివరాలు సక్రమంగా ఉన్న ఓటర్ల దరఖాస్తులను పూర్తిస్థాయిలో పరిశీలించి తదుపరి ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు. ఇటీవల నిర్వహించిన ప్రత్యేక ఓటరు నమోదు శిబిరాల్లో స్వీకరించిన ఫారం-6, ఫారం-7, ఫారం-8 దరఖాస్తులను కూడా నిబంధనల ప్రకారం పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు. కొత్త ఓటర్ల నమోదుకు ఫారం-6, ఓటరు జాబితా నుంచి పేర్ల తొలగింపునకు ఫారం-7, వివరాలు, చిరునామా మార్పులకు ఫారం-8 దరఖాస్తులను ఎలాంటి పెండింగ్ లేకుండా పరిష్కరించాలని తెలిపారు. సమావేశంలో ఆర్డీవో సుబ్రహ్మణ్యం, ఎన్నికల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## వినాయక మండపాన్ని సందర్శించిన మన్నె గోవర్ధన్ రెడ్డి



**ఖైరతాబాద్, సెప్టెంబర్ 21 (జనం సాక్షి) :** వినా యక చవితి ఉత్సవాల సందర్భంగా ఖైరతాబాద్ నియోజకవర్గం బంజారాహిల్స్ రోడ్ నం.13లో శ్రీ విఘ్నేశ్వర యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక మండపాన్ని ఖైరతాబా ద్ నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ మన్నె గోవర్ధన్ రెడ్డి(ఎంజిఆర్) సందర్శించారు. ఈ సంద ర్భంగా విఘ్నేశ్వరుని దర్శించుకుని ప్రత్యేక పూజ ల్లో పాల్గొన్నారు. అనంతరం ఉత్సవ నిర్వాహకుల కు వినాయక చవితి శు భాకాంక్షలు తెలిపారు. భక్తిశ్రద్ధలతో వినాయక చవితి వేడుకలను నిర్వ హించడం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గోగుల సతీష్, బిట్ల శ్రీనివాస్ రాజు, జోజోళ్ల రాజు శ్రీకాంత్, రాజు, బాసువా రాజు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం



**ఇబ్రహీంపట్నం, సెప్టెంబర్ 21 (జనం సాక్షి) :** కాంగ్రెస్ ఆధ్వర్యంలోని ప్రజా ప్రభుత్వం ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తుందని కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు కొంగర విష్ణువర్ధన్ రెడ్డి అన్నారు. సోమవారం ఆరుట్ల గ్రామంలో గ్రామ శాఖ అధ్యక్ష, కార్యదర్శులు నూకం బాలరాజు, చిందం శ్రీశైలం ఆధ్వర్యంలో ఇబ్రహీంపట్నం శాసనసభ్యులు మల్ రెడ్డి రంగారెడ్డి సహకారంతో మంజూరైన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను లబ్ధిదారులకు ఇంటింటికి తిరిగి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం పేదల సంక్షేమం కోసం అనేక పథకాలు తీసుకొచ్చిందని, శాసనసభ్యులు మల్ రెడ్డి రంగారెడ్డి సహకారంతో నియోజకవర్గం అభివృద్ధిలో ముందంజలో ఉందని అన్నారు. అనారోగ్యంతో బాధపడే పేదలు ముఖ్యమంత్రి సహాయ నిధిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం మార్కెట్ కమిటీ సంచాలకులు సాతిరి ఎల్లేష్, వార్డు సభ్యులు అనంగల్ల జగన్నాథం, ఎండి ఇమ్రాన్, కాంగ్రెస్ నాయకులు గుడిమల్ల చంద్రయ్య, మార సురేష్, అంతటి రాజు గౌడ్, దాసరమోని రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# యువత ప్రపంచంతో మమేకం కావాలి

- ఆగా ఖాన్ అకాడమీలో ఐబీ మంథన్ 2026
- ఇంటర్నేషనల్ బాక్యులరేట్ డైరెక్టర్ జనరల్ ఓల్లీ పెక్కా హైనో నేన్



**మహేశ్వరం, సెప్టెంబర్ 21 (జనంసాక్షి) :** యువత ప్రపంచంతో మమేకం కావాలన్నారు. బాధ్యతయుత దృక్పథాన్ని భారత దేశ యువతలో నింపేందుకు అపారమైన అవకాశాలు ఉన్నాయని ఇంటర్నేషనల్ బాక్యులరేట్ (ఐబీ) డైరెక్టర్ జనరల్ ఓల్లీ పెక్కా హైనో నేన్ అన్నారు. సోమవారం మహేశ్వరం నియోజకవర్గంలోని ఆగా ఖాన్ అకాడమీలో హద్దులు దాటిన అభ్యాసనం, పరస్పర అనుసంధానిత, ప్రపంచం కోసం విద్య, అనే ఇతి వృత్తంతో ఐబీ మంథన్ 2026 ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటర్నేషనల్ బాక్యులరేట్ డైరెక్టర్ జనరల్ ఓల్లీ పెక్కా హైనో నేన్ మాట్లాడుతూ...మెరుగైన సమాజాన్ని తీర్చిదిద్దేందుకు అవసరమైన విద్య పునాదులను వెయ్యాలన్నారు. జిజ్ఞాస,విచక్షణ పరిస్థితులకు అనుగుణంగా మారేతత్వం ఉండాలన్నారు. సమాజం,ప్రాంతం, దేశం గురించి ఎంతో తెలుసుకోవాలన్నారు. విద్యాపరమైన ప్రమాణాలతో పాటు పరిశోధనాత్మక దృక్పథం విమర్శనాత్మక ఆలోచన నేర్చుకున్న అంశాలను సరికొత్త పరిస్థితుల్లో అన్వయించే సామర్థ్యాన్ని మిళితం చేస్తాయన్నారు. వేగంగా మారుతున్న ప్రపంచంలో అవసరమైన నైపుణ్యాలు ఆత్మవిశ్వాసం అనుకూలతలను పెంపొందించుకోవడంలో యువతకు ఎంతో గాను తోడ్పడతాయన్నారు. ఆగా ఖాన్ అకాడమీలో విద్యార్థులకు నాయకత్వం, సేవా గుణాలతో కూడిన జీవితాలను అందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఇంటర్నేషనల్ బాక్యులరేట్ సౌత్ ఆసియా, జపాన్ విభాగం హెడ్ డాక్టర్ ఆశిష్ త్రివేది, అకాడమీ హెడ్ డాక్టర్ బోనాథన్ లాంగ్,ఆగా ఖాన్ అకాడమీ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## చౌదర్ పల్లి ఆంజనేయ స్వామి ఆలయ నక్షా దారి కబ్జా



**యాచారం, సెప్టెంబర్ 21 (జనం సాక్షి) :** యాచారం మండలం చౌదర్ పల్లి గ్రామంలో శ్రీ ఆంజనేయ స్వామి ఆలయానికి వెళ్లే పురాతన నక్షా దారిని కొందరు పక్క సర్వే నెంబర్ల వ్యక్తులు కబ్జా చేశారని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. సాగర్ హైవే నుండి యాచారం రెవెన్యూ సర్వే నెం. 53, 54 మరియు చౌదర్ పల్లి రెవెన్యూ సర్వే నెం. 63, 64 ల మధ్య నుండి ఆలయానికి, గ్రామానికి వెళ్లే ఈ దారి కొన్ని సంవత్సరాలుగా వాడుకలో ఉందని, గత సంవత్సరం నుండి కబ్జాకు గురైందని తెలిపారు. ఈ విషయంపై ఇప్పటికే కలెక్టర్ , ఆర్.డి.ఓ , తహశీల్దార్ లకు వినతిపత్రం ఇచ్చినట్లు గ్రామస్తులు తెలిపారు. అధికారులు తక్షణమే స్పందించి, కబ్జాకు గురైన నక్షా దారిని కాపాడి, భక్తులకు, గ్రామ ప్రజలకు ఆలయ దారిని పునరుద్ధరించి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

# రైతులకు మెరుగైన సేవలు అందించేలా సమన్వయంతో పనిచేయాలి

- ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి



**తాండూరు, సెప్టెంబర్ 21 (జనంసాక్షి) :** రైతులకు మెరుగైన సేవలు అందించేలా సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి పేర్కొన్నారు. నూతనంగా నియమితులైన పిఎసిస్ చైర్మన్లు, ఎయంసి చైర్మన్, వైస్ చైర్మన్లు, డైరెక్టర్లు తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. నూతనంగా నియమితులైన ఎల్మకన్న (తాండూరు) పిఎసిస్ చైర్మన్ జనార్ధన్ రెడ్డి, తట్టేపల్లి (పెద్దేముల్) పిఎసిస్ చైర్మన్ మహిపాల్ రెడ్డి, నావంద్గీ (బషీరాబాద్) పిఎసిస్ చైర్మన్ కరుణ అజయ్ ప్రసాద్, బషీరాబాద్ ఎయంసి చైర్మన్ శంకరప్ప, యాలాల్ పిఎసిస్ చైర్మన్ అనిల్ కుమార్ మరియు వైస్ చైర్మన్లు, డైరెక్టర్లను ఎమ్మెల్యే బీఎంఆర్ అభినందించారు. ఈ సందర్భంగా చైర్మన్లు, వైస్ చైర్మన్లు, డైరెక్టర్లు మాట్లాడుతూ తమకు అందించిన ప్రోత్సాహానికి, తమ నియామకంలో సహకరించినందుకు ఎమ్మెల్యే బీఎంఆర్ కి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే బీఎంఆర్ మాట్లాడుతూ మీపై నమ్మకంతో మీకు ఈ బాధ్యతలు అప్పగించడం జరిగింది. ప్రజలకు, ముఖ్యంగా రైతులకు మరింత మెరుగైన సేవలు అందించేలా సమన్వయంతో, నిజాయితీతో పనిచేయాలి. సహకార సంఘాలను బలోపేతం చేయడమే లక్ష్యంగా పనిచేయాలని" సూచించారు.

## హైకోర్టు ఉత్తర్వుల ప్రకారం పేదలకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు కేటాయించాలి



**గద్వాల నడిగడ్డ, సెప్టెంబర్ 21(జనం సాక్షి) :** ఆర్థికంగా వెనుకబడిన ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనార్టీ, ఈడబ్ల్యూఎస్ వర్గాల లబ్ధిదారులకు హైకోర్టు తీర్పు మేరకు తక్షణమే డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను కేటాయించాలని సీనియర్ సిటిజన్స్ సంక్షేమ సంఘం జోగులాంబ గద్వాల జిల్లా అధ్యక్షులు, లబ్ధిదారుల ప్రతినిధి కె. మోహన్ రావు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆయన సోమవారం ప్రజావాణిలో అదనపు కలెక్టర్ మదన్ మోహన్ కి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గద్వాల పట్టణం, దౌదర్‌పల్లి గ్రామ శివారులోని సర్వే నెంబర్లు 968, 969, 979, 980, 983, 984, 985లలో 2013లో ఇందిరమ్మ ఇండ్ల పథకం కింద పేదలకు పట్టా సర్టిఫికెట్లు మంజూరయ్యాయని తెలిపారు. అయితే గత ప్రభుత్వం ఆ స్థలంలో నర్సింగ్ కళాశాల మరియు, ఆసుపత్రి నిర్మాణాల కొరకు కేటాయించడంతో బాధితులు 2022లో రాష్ట్ర హైకోర్టును ఆశ్రయించారని పేర్కొన్నారు. బాధితుల పక్షాన విచారణ జరిపిన హైకోర్టు, పేదలకు అనుకూలంగా తీర్పునిస్తూ మొదటి విడతగా 24-04-2026 నాటి తీర్పు (W.P. No. 28124/2022) ప్రకారం లబ్ధిదారులకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను కేటాయించాలని ఉత్తర్వులు జారీ చేసిందని,రెండవ ఉత్తర్వు 31-07-2026 ప్రకారం మిగిలిన 648 మంది లబ్ధిదారులకు కూడా న్యాయం చేయాలని ఆదేశించిందని తెలిపారు. హైకోర్టు ఇచ్చిన తీర్పు కాపీలను జిల్లా ఆడిసనల్ కలెక్టర్‌కి సమర్పించినట్లు తెలిపిన ఆయన జిల్లా యంత్రాంగం, అధికారులు స్పందించి హైకోర్టు ఉత్తర్వులను త్వరితగతిన పరిశీలించి, అర్హులైన లబ్ధిదారులందరికీ డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను కేటాయించి న్యాయం చేయాలని ఆయన కోరారు.

## కొండా లక్ష్మణ్ బాపూజీ సేవలు స్ఫూర్తిదాయకం

- పద్మశాలి సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఆడెపు చంద్రయ్య



**చేర్యాల, సెప్టెంబర్ 21 (జనంసాక్షి) :** ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ సేవలు స్ఫూర్తిదాయకమని పద్మశాలి సంఘం సిద్దిపేట జిల్లా ఉపాధ్యక్షుడు, మాజీ కొమురవెల్లి దేవస్థాన చైర్మన్ ఆడెపు చంద్రయ్య అన్నారు. చేర్యాల పట్టణంలో పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో సోమవారం కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బాపూజీ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం ఆడెపు చంద్రయ్య మాట్లాడుతూ.. నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాటం చేశారని, నిఖార్సయిన తెలంగాణ వాదిగా తెలంగాణ కోసం 1969లో మంత్రి పదవిని కూడా తృణప్రాయంగా వదిలిలేసిన నిబద్ధత కలిగిన రాజకీయవేత్త అని అన్నారు. 1969, 2009-12 తెలంగాణ ఉద్యమాలలో పాల్గొన్నాడని గుర్తు చేశారు. రాష్ట్ర చేనేత సహకార రంగానికి కూడా ఎంతగానో కృషి చేశాడని సమాజానికి కొండా లక్ష్మణ్ బాపూజీ చేసిన సేవలు ఎంతో స్ఫూర్తిదాయకమని ఆయన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి సంఘం పట్టణ అధ్యక్షులు కొక్కుల సురేందర్, దూడం వెంకట్, సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఆరోగ్య మిత్ర సిల్వర్ జూబ్లీ సెలబ్రేషన్స్ అభినందనీయం

- జాతీయ అవార్డు గ్రహీత, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ మెంబర్ డాక్టర్ పరికిపండ్ల అశోక్




**తాండూరు, సెప్టెంబర్ 21 (జనంసాక్షి) :** ఆరోగ్యవంతమైన సమ సమాజ స్థాపన కై 2000 లో ప్రారంభించబడిన ఆరోగ్య మిత్ర స్వచ్ఛంద సంస్థ సిల్వర్ జూబ్లీ సెలబ్రేషన్స్ అభినందనీయమని చైల్డ్ వెల్ఫేర్ కమిటీ మెంబర్ డాక్టర్ పరికిపండ్ల అశోక్ అన్నారు. ఆరోగ్య మిత్ర స్వచ్ఛంద సంస్థ ప్రారంభించి 25 వసంతాలు అవుతున్న సందర్భంగా చేపట్టబోయే సిల్వర్ జూబ్లీ సెలబ్రేషన్స్ సంబంధిత బ్రోచర్స్, కరపత్రాలను సోమవారం తాండూరు రైల్వే స్టేషన్ ఆవరణలో ఆరోగ్య మిత్రసంస్థ తాండూరు ప్రతినిధి రఘునందన్ తో కలిసి ఆవిష్కరించి మాట్లాడుతూ రెండు తెలుగు రాష్ట్రాల్లో గత 25 సంవత్సరాలుగా విద్యా, వైద్యం ఆరోగ్యం స్వావలంబన తదితర అంశాలపై నిరంతరం సామాజిక సేవా కార్యక్రమాలు చేస్తున్న ఆరోగ్య మిత్ర స్వచ్ఛంద సేవలు అభినందనీయమని తెలిపారు. ఈ రోజుల్లో ఆర్థిక వనరులు లేకపోయినా, మడమ తిప్పకుండా నిరంతరం సేవా కార్యక్రమాలు చేయడం సంస్థ నిబద్ధత కు కారణమని, సిల్వర్ జూబ్లీ సెలబ్రేషన్స్ సందర్భంగా ఆరోగ్యమిత్ర స్వచ్ఛంద సంస్థ సాధారణ కార్యక్రమాలకు వినూత్నంగా 25 వసంతాలను పురస్కరించుకొని 25 జిల్లాల్లో కార్యక్రమాలు, 25 నెలలపాటు కార్యక్రమాలు, 25 రకాల కార్యక్రమాలు, 25 సంస్థలతో కలిసి పని చేస్తూ 25 మందికి అవార్డులు సంస్థ పక్షాన అందజేయ నున్నామని తెలిపారు. ఈ సందర్భంగా ఆరోగ్య మిత్ర స్వచ్ఛంద సంస్థ సిల్వర్ జూబ్లీ సందర్భంగా చేపట్టబోయే కార్యక్రమాల బ్రోచర్ మరియు కరపత్రాలను ఆవిష్కరించిన అనంతరం సంస్థ తాండూరు ప్రతినిధి రఘునందన్ మాట్లాడుతూ త్వరలోనే తాండూరు ప్రాంతంలో ఆరోగ్య మిత్ర స్వచ్ఛంద సంస్థ పక్షాన భారీ సేవా కార్యక్రమాన్ని చేపట్టబోతున్నట్టు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి సంఘం సీనియర్ నాయకులు వలుపదాసు భద్రయ్య, సాక్షి వెంకట్, సయ్యద్ మహబూబ్ అలీ, సిస్టర్ సెలీనా తదితరులు పాల్గొన్నారు.

# చీకూర్తి -హుస్సేన్‌నగర్‌కు ఆర్టీసీ సేవలను కొనసాగించండి

- డిపో మేనేజర్, ప్రజావాణికి దరఖాస్తు చేసిన సర్పంచ్ రమేష్



**న్యాల్‌కల్, సెప్టెంబర్ 21 (జనం సాక్షి) :** దాదాపు రెండు దశాబ్దాలకు పైగా నిరంతరం కొనసాగిన చీకూర్తి - హుస్సేన్ నగర్ గ్రామాలకు ఆర్టీసీ సేవలను తిరిగి ప్రారంభించాలని మండలంలోని చీకూర్తి గ్రామ సర్పంచ్ రమేష్ కోరారు. సోమవారం మండల పరిషత్ సమావేశ మందిరంలో జరిగిన ప్రజావాణి, జహీరాబాద్ డిపో మేనేజర్ కు లిఖిత పూర్వకంగా దరఖాస్తు చేశారు. జహీరాబాద్ ఆర్టీసీ డిపోకు చెందిన హుస్సేన్ నగర్ బస్సు ఉదయం 8:30 గంటలకు జహీరాబాద్ నుండి ప్రారంభమై ఉదయం 9:30 గంటలకు హుస్సేనగర్ గ్రామానికి చేరుకునేదని, ఇలా రెండున్నర దశాబ్దాలకు పైగా ఆర్టీసీ సేవలు నిరంతరం కొనసాగాయని వినతి పత్రంలో తెలిపారు. బస్సు రాకతో హుస్సేన్ నగర్, చీకూర్తి, కాకిజనవాడ, అమీరాబాద్, హుస్సేన్ నగర్, ముర్తుజాపూర్, చాల్కి, తదితర గ్రామాలకు చెందిన ప్రయాణికులు, ప్రధానంగా న్యాల్ కల్, హద్నూర్, నారాయణఖేడ్, జహీరాబాద్ తదితర ప్రాంతాలకు ఉన్నత విద్యను అభ్యసించేందుకు పదుల సంఖ్యలో విద్యార్థులకు ఎంతో సౌకర్యంగా ఉండేదని వివరించారు. ఉన్నట్టుండి రోడ్డు బాగోలేదని, ఆదాయం రావడంలేదని, బస్సుల కొరత ఉందని, తదితర సమస్యలను సాకుగా చెబుతూ.. దాదాపు దశాబ్దానికి పైగా సేవలను ఉన్నట్టుండి నిలిపివేశారని, వెంటనే తిరిగి ప్రారంభించాలని కోరారు. ఈ విషయమై ఈపాటికే స్థానిక ఎంపీ సురేష్ కుమార్ షట్కార్ దృష్టికి తీసుకు వెళ్లడం జరిగిందని, ఆర్టీసీ అధికారులు, ఉన్నతాధికారులు దృష్టి సారించి ప్రయాణికులు, విద్యార్థునుల సమస్యను దృష్టిలో ఉంచుకొని బస్సును తిరిగి కొనసాగించాలని కోరారు.

జనంసాక్షి
www.janamsakshi.org
మంగళవారం
22 సెప్టెంబర్ 2026

# మాదిగల హక్కుల సాధనకు ఐక్యంగా ముందుకు సాగాలి

- **ఎమ్మార్పీఎస్, ఎంఎస్ఎఫ్ నూతన కమిటీలు ఏకగ్రీవం**
- **ఎమ్మార్పీఎస్ జిల్లా మాజీ అధ్యక్షుడు బుచ్చంద్ర మాదిగ**



**కొండాపూర్, సెప్టెంబర్ 21 (జనంసాక్షి) :** మాదిగల హక్కుల సాధన కోసం ఐక్యంగా ఎందుకు సాగాలని ఎమ్మార్పీఎస్ జిల్లా మాజీ అధ్యక్షులు ,బుచ్చంద్ర మాదిగ,జిల్లా అధికార ప్రతినిధి నల్లోల ప్రవీణ్‌కుమార్ పేర్కొన్నారు. కొండాపూర్ మండలం మల్లేపల్లి గ్రామంలో మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎంఆర్‌పీఎస్), మాదిగ స్టూడెంట్ ఫోరం (ఎంఎస్ఎఫ్) నూతన గ్రామ కమిటీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. దేవరంపల్లి అశోక్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో నూతన కమిటీలను ప్రకటించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులుగా హాజరైన ఎంఆర్‌పీఎస్ జిల్లా మాజీ అధ్యక్షుడు బుచ్చంద్ర మాదిగ, జిల్లా అధికార ప్రతినిధి నల్లోల ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ... గ్రామస్థాయిలో సంఘాలను బలోపేతం చేయడం ద్వారా మాదిగల సమస్యలను మరింత బలంగా ముందుకు తీసుకెళ్లవచ్చన్నారు. మాదిగ సమాజం ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ఐక్యంగా పనిచేయాలని సూచించారు. విద్యార్థులు, యువత సామాజిక చైతన్యంతో ముందుకు సాగాలని, విద్యారంగ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. నూతన కమిటీ సభ్యులు బాధ్యతాయుతంగా పనిచేస్తూ ఎంఆర్‌పీఎస్, ఎంఎస్ఎఫ్ కార్యకలాపాలను గ్రామస్థాయిలో విస్తరించాలని సూచించారు.

**ఎమ్మార్పీఎస్ నూతన కమిటీ**

అధ్యక్షుడిగా పల్లె శ్రవణ్‌కుమార్, ఉపాధ్యక్షులుగా సమ్మని అదిత్య, కలివేముల సునీల్‌కుమార్, గూడెం సతీష్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా సమ్మని సాయికుమార్, కార్యదర్శిగా కలివేముల అరవింద్, కోశాధికారిగా పులిమామిడి భానుప్రసాద్, సామాజిక మాధ్యమాల బాధ్యుడిగా జోగు రమేష్ ఎన్నికయ్యారు. సలహాదారులుగా డి. నరేష్, ఎం. రాజేందర్, జోగు సురేష్, ఎస్. శ్రీకాంత్‌లను ఎన్నుకున్నారు.

**ఎంఎస్ఎఫ్ నూతన కమిటీ**

అధ్యక్షుడిగా రాగులపల్లి సతీష్‌కుమార్, ఉపాధ్యక్షుడిగా కలివేముల జశ్వంత్, ప్రధాన కార్యదర్శిగా కలివేముల పవన్‌కుమార్, కార్యదర్శిగా సమ్మని ప్రశాంత్, సామాజిక మాధ్యమాల కార్యదర్శిగా జోగు రమేష్ ఎన్నికయ్యారు.

నూతన కమిటీ సభ్యులను ముఖ్య అతిథులు అభినందించి శు భాకాంక్షలు తెలిపారు. మాదిగల హక్కులు, విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామని నూతన కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, విద్యార్థులు, యువత పాల్గొన్నారు.

# అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇండ్లు

- **ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి**



**నిజాంపేట్, సెప్టెంబర్ 21 (జనం సాక్షి) :** నిజాంపేట్ మండల పరిధిలోని ర్యాలమడుగు గ్రామానికి చెందిన దొంతిగారి సుజాత మల్లేష్ దంపతులకు ప్రభుత్వం మంజూరు చేసిన ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ కార్యక్రమంలో నారాయణఖేడ్ శాసనసభ్యులు డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డిపాల్గొని నూతన గృహాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే సంజీవరెడ్డి మాట్లాడుతూపేదల సొంతింటి కలను సాకారం చేయడమే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. అర్హులైన ప్రతి కుటుంబానికి దశలవారీగా ఇందిరమ్మ ఇళ్లను అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు.సొంత ఇల్లు లభించడంతో దొంతిగారి సుజాత మల్లేష్ కుటుంబంలో ఆనందం వెల్లివిరిసిందని, వారి కొత్త జీవితం సుఖసంతోషాలతో సాగాలని ఆకాంక్షించారు.ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా పేద కుటుంబాలకు గౌరవప్రదమైన నివాసం కల్పించడంతో పాటువారి జీవన ప్రమాణాలను మెరుగుపరచడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని పేర్కొన్నారు. నియోజకవర్గంలో అర్హులైన లబ్ధిదారులకు ఇళ్ల మంజూరు, నిర్మాణం, బిల్లుల చెల్లింపు ప్రక్రియలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో నారాయణఖేడ్ మున్సిపాలిటీ చైర్మన్ నగేష్ సెట్కర్,నిజాంపేట్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు లింగారెడ్డి, నారాయణఖేడ్ మున్సిపల్ పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పండరి రెడ్డి, ర్యాలమడుగు గ్రామ సర్పంచ్ సాయిలు, ఉప సర్పంచ్ నాగయ్య, కాంగ్రెస్ ముఖ్య నాయకులు, రాధాకిషన్ సేట్, సుబూర్ మల్లేష్, సాయిలు, వెంకటరములు, కిష్టయ్య, లక్ష్మయ్య, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# పిడుగుపాటుకు బాలుడు మృతి



**కెటి దొడ్డి, సెప్టెంబర్ 21 (జనంసాక్షి) :** పొలం పనులు ముగించుకుని ఇంటికి వస్తున్న ఓ యువకుడిని పిడుగు రూపంలో మృత్యువు కబళించిన హృదయవిదారక సంఘటన కేటీ దొడ్డి మండలం యర్సన్‌దొడ్డి గ్రామంలో సోమవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన కుర్వ వెంకటేష్ కుమారుడు కుర్వ మల్లేష్ (16) సోమవారం తన పొలం పనులు ముగించుకుని ఇంటికి బయలుదేరాడు. మార్గమధ్యలో ఒక్కసారిగా ఈదురుగాలులతో కూడిన వర్షం ప్రారంభం కావడంతో, వర్షం నుండి తలదాచుకునేందుకు సమీపంలోని కృష్ణస్వామి దేవాలయం వద్ద ఉన్న ఓ చెట్టు కిందకు వెళ్లి నిల్చున్నాడు. ఆ సమయంలో ప్రమాదవశాత్తు చెట్టుపై బలంగా పిడుగు పడటంతో మల్లేష్ తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. చేతికి అందివచ్చిన కుమారుడు పిడుగుపాటుకు గురై మృతి చెందడంతో తండ్రి వెంకటేష్, కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. ఈ దారుణ ఘటనతో యర్సన్‌దొడ్డి గ్రామంలో తీవ్ర విషాదఛాయలు అలుముకున్నాయి.

# మున్నూరు రవీందర్‌కు ఎమ్మెల్సీ టికెట్ ఇవ్వాలి

**వనపర్తి బ్యూరో, సెప్టెంబర్ 21 (జనంసాక్షి) :** హైదరాబాద్-రంగారెడ్డి-మహబూబ్‌నగర్ పట్టభద్రుల నియోజకవర్గం నుంచి రానున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో అడ్వకేట్ మున్నూరు రవీందర్‌కు బీజేపీ తరఫున టికెట్ కేటాయించాలని వనపర్తి జిల్లా బీజేపీ నాయకులు రాష్ట్ర నాయకత్వాన్ని కోరారు. వనపర్తి జిల్లా కేంద్రంలోని మున్నూరు రవీందర్ నివాసంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో నాయకులు ఈ మేరకు విజ్ఞప్తి చేశారు.మున్నూరు రవీందర్‌కు బీజేపీతో సుదీర్ఘ అనుబంధం ఉందని, పార్టీ బలోపేతానికి ఆయన చేసిన సేవలను పరిగణనలోకి తీసుకుని ఎమ్మెల్సీ అభ్యర్థిత్వానికి అవకాశం కల్పించాలని నాయకులు కోరారు. 1969 నుంచి బాల స్వయం సేవక్‌గా పనిచేసిన ఆయన, 1980 నుంచి బీజేపీ కార్యకర్తగా క్రియాశీలకంగా పనిచేస్తున్నట్లు తెలిపారు. గట్కేసర్‌లో పార్టీ బాధ్యతలు నిర్వహించడంతో పాటు 1975 ఎమర్జెన్సీ సమయంలో అరెస్టయ్యారని పేర్కొన్నారు.రెండు పర్యాయాలు స్టేట్ కౌన్సిల్ మెంబర్‌గా, 2002లో బీజేపీ స్టేట్ ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా బాధ్యతలు నిర్వహించారని తెలిపారు. 1987 నుంచి 2003 వరకు వనపర్తి నియోజకవర్గ ఇన్‌చార్జిగా పనిచేశారని, 1994లో వనపర్తి నుంచి బీజేపీ అభ్యర్థిగా అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేశారని వివరించారు. పాదయాత్రలు, పల్లెపల్లె నిద్ర కార్యక్రమాలు, కేడెద్దుల ప్రదర్శనలు, బుల్లాక్ కార్ట్ ర్యాలీలతో పాటు పార్టీ నిర్వహించిన పలు కార్యక్రమాల్లో ఆయన చురుకుగా పాల్గొన్నారని తెలిపారు.ఈ సందర్భంగా మున్నూరు రవీందర్ మాట్లాడుతూ పాత మహబూబ్‌నగర్ జిల్లాలో తమ కుటుంబానికి మంచి గుర్తింపు ఉందన్నారు. తన తండ్రి మున్నూరు కృష్ణయ్య



డిగ్రీ కళాశాలను స్థాపించి బోధనా, బోధనేతర సిబ్బందికి ఉపాధి కల్పించారని తెలిపారు. తాను బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా మూడు పర్యాయాలు ఎన్నికయ్యానని, పలు బ్యాంకులకు ప్యానెల్ అడ్వకేట్‌గా సేవలందిస్తున్నట్లు వివరించారు.పార్టీ కోసం ఇన్నేళు ్లగా చేసిన సేవలను పరిగణనలోకి తీసుకుని హైదరాబాద్--రంగారెడ్డి--మహబూబ్‌నగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గం నుంచి బీజేపీ టికెట్ ఇవ్వాలని రాష్ట్ర నాయకత్వానికి విజ్ఞప్తి చేసినట్లు చెప్పారు. ఈ అభ్యర్థిత్వానికి వనపర్తి జిల్లా నాయకులు మద్దతు ప్రకటించి, రాష్ట్ర బీజేపీ అధ్యక్షులు ఎన్. రామచందర్ రావును హైదరాబాద్‌లో కలిసి విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు.వనపర్తి జిల్లాకు చెందిన పార్టీ నాయకులకు ఎమ్మెల్సీ అభ్యర్థిత్వంలో అవకాశం కల్పించాలని జిల్లా నాయకులు రాష్ట్ర నాయకత్వాన్ని కోరారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శ్రీశైలం, కేతూరి బుడ్డన్న, రామన్నగారి వెంకటేశ్వర్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దిరాజు, జిల్లా మీడియా కన్వీనర్ గజరాజుల తిరుమలేష్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణి ఫిర్యాదులు వెంటనే పరిష్కరించాలి

- **ఎస్పీ పరితోష్ పంకజ్**



**సంగారెడ్డి బ్యూరో, సెప్టెంబర్ 21 (జనం సాక్షి) :** ప్రజావాణి లో అందిన ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఎస్పీ ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు . ప్రజావాణిలో ఫిర్యాదుదారుల నుంచి ఎస్పీ నేరుగా ఫిర్యాదులు స్వీకరించి, వారి సమస్యలను ఓపికగా విన్నారు. ఫిర్యాదులపై సంబంధిత పోలీసు అధికారులతో ఫోన్‌లో మాట్లాడి సమస్యల పరిష్కారంలో జాప్యానికి కారణాలను తెలుసుకున్నారు. ప్రతి ఫిర్యాదుపై నిష్పక్షపాతంగా విచారణ జరిపి, బాధితులకు సత్వర న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. స్థానిక పోలీసు స్టేషన్‌లో సమస్య పరిష్కారం కాకపోతే ప్రజలు భయపడాల్సిన అవసరం లేదని ఎస్పీ తెలిపారు. మధ్యవర్తుల ప్రమేయం లేకుండా జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణికి నేరుగా హాజరై తమ సమస్యలను తెలియజేయాలని సూచించారు. ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని, చట్టపరమైన పరిష్కారం అందించడమే ప్రజావాణి ప్రధాన ఉద్దేశ్యమని ఎస్పీ స్పష్టం చేశారు.

# ఉద్యాన పంటలతో రైతులకు అధిక ఆదాయం

- **పూల తోటల సాగుకు ఎకరాకు రూ.8 వేల రాయితీ**
- **ప్రభుత్వ రాయితీలను సద్వినియోగం చేసుకోవాలి**
- **జిల్లా ఉద్యాన శాఖ అధికారి సోమేశ్వరరావు**



**సంగారెడ్డి బ్యూరో, సెప్టెంబర్ 21 (జనం సాక్షి) :** ఉద్యాన పంటల సాగుతో రైతులు అధిక ఆదాయం పొందవచ్చని, ప్రభుత్వం అందిస్తున్న వివిధ రాయితీలు, ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమల శాఖ అధికారి సోమేశ్వరరావు సూచించారు.సోమవారం ఆందోల్ మండలం నేరడిగుంట గ్రామంలో నిమ్మ, జామ, కూరగాయలు, పూల తోటలను ఆయన పరిశీలించి రైతులతో మాట్లాడారు. ఉద్యాన పంటల సాగులో పాటించాల్సిన మెళకువలు, పంటల యాజమాన్య పద్ధతులు, దిగుబడి పెంపునకు తీసుకోవాల్సిన చర్యలపై రైతులకు సూచనలు చేశారు. సమీకృత ఉద్యాన అభివృద్ధి మిషన్‌లో భాగంగా రైతు స్వర్ణలత నిర్మించుకున్న ప్యాక్‌హౌస్‌ను పరిశీలించారు. ప్యాక్‌హౌస్ నిర్మాణానికి ప్రభుత్వం రూ.2.40 లక్షల వరకు రాయితీ అందిస్తున్నట్లు తెలిపారు. రైతు వెంకటేశం ఏర్పాటు చేసుకున్న ఫార్మ్ పాండ్‌ను కూడా పరిశీలించారు. 20 మీటర్ల పొడవు, 20 మీటర్ల వెడల్పు, 3 మీటర్ల లోతుతో ఫార్మ్ పాండ్ నిర్మించుకునే రైతులకు రూ.90 వేల వరకు రాయితీ అందిస్తున్నట్లు వివరించారు. కొత్తగా పూల తోటలు సాగు చేస్తున్న రైతులకు ఎకరాకు రూ.8 వేల వరకు రాయితీ అందిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం కల్పిస్తున్న రాయితీలు, ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకుని ఉద్యాన పంటల సాగు ద్వారా ఆదాయాన్ని పెంచుకోవాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో మండల ఉద్యాన శాఖ అధికారి సమత, ఉద్యాన విస్తరణ అధికారి సంగయ్య స్వామి, రైతులు వెంకటేశం, స్వర్ణలత తదితరులు పాల్గొన్నారు.

# టీబీ రహిత జిల్లాగా నారాయణపేటను తీర్చిదిద్దాలి

- **జిల్లా కలెక్టర్ ప్రియాంక**



**నారాయణపేట జిల్లా బ్యూరో, సెప్టెంబర్ 21 (జనం సాక్షి) :** నారాయణపేట జిల్లా ను టీబీ రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు అధికారు లు సమన్వయంతో పని చేయాలని జిల్లా కలెక్టర్ ప్రియాంక సూచించారు. సోమవారం జిల్లా కలెక్ట రేట్‌లోని వీడియో కాన్ఫ రెన్స్ హాల్‌లో టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్య క్రమం అమలుపై సంబంధి త అధికారులతో కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వ హించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, టీబీ లక్షణాలు ఉన్న వారిని గుర్తించి, వారికి సకాలంలో పరీక్షలు నిర్వహించి, సరైన వైద్య చికిత్స అందించడం ద్వారా వ్యాధిని పూర్తిగా నయం చేయడమే టీబీ ముక్త్ భారత్ అభియాన్ ప్రధాన లక్ష్యమన్నారు.ఆయుష్మాన్ భారత్ కార్య క్రమం ఆధ్వర్యంలో పీహెచ్ సీలు, ఎంపీహెచ్‌సీలు, ప్రభుత్వ ఆసుపత్రులు, మెడికల్ కాలేజీలలో టీబీ నిర్ధారణ పరీక్షలు నిర్వహి స్తున్నట్లు తెలిపారు.మండల స్థాయిలోనూ పరీక్షలు విస్తృతంగా నిర్వ హించేందుకు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో ఇప్ప టివరకు 54,684 మందికి ఛాతీ పరీక్షలు, ఎక్స్‌రే స్క్రీ నింగ్ నిర్వహించినట్లు తెలిపారు.ప్రత్యేకంగా ఇటు క బట్టీలలో పనిచేస్తున్న కార్మికులను గుర్తించి, వారికి తప్పనిసరిగా టీబీ పరీక్షలు నిర్వహించాలని కలెక్టర్ సూచించారు.జిల్లాలో వంద శాతం స్క్రీనింగ్ పూర్తి చేసి, టీబీ వ్యాధి వ్యాప్తిని అరిక ట్టేందుకు సమగ్ర చర్యలు చేపట్టాలన్నారు. ప్రతి మండలంలో అవసరమైన వాలంటీర్లను ఏర్పాటు చేసి, ప్రజలకు టీబీపై అవ గాహన కల్పించడంతో పాటు అనుమానితులను గుర్తించి వైద్య పరీక్షలకు పంపించాలని సూచించా రు.ఈ కార్యక్రమాన్ని విజ యవంతంగా అమలు చేసేందుకు వైద్య, పంచా యతీరాజ్, విద్య, కార్మిక తదితర శాఖల అధికారు లు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ ఆదేశించారు.ఈ సమావే శంలో డీఎంహెచ్ఓ డాక్టర్ చంద్ర మోహన్, జిల్లా టీబీ అధికారి, డీవైఎస్ఓ, డీఈ ఓ, డీపీఓ, జిల్లా కార్మిక అధికారి తదితర సంబం ధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.


# దోమలపెంటలో ఘోర రోడ్డు ప్రమాదం

- **ఆక్టోపస్ వ్యూపాయింట్ వద్ద తుఫాన్ - ద్విచక్ర వాహనం ఢీ**
- **ఒకరు మృతి..**
- **పలువురికి గాయాలు..**
- **క్షతగాత్రులను ఆసుపత్రులకు తరలించిన అటవీ సిబ్బంది**

**అచ్చంపేట, సెప్టెంబర్ 21 (జనం సాక్షి) :** నియోజకవర్గ పరిధిలోని దోమలపెంట ఆక్టోపస్ వ్యూపాయింట్ సమీపంలో సోమవారం రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఉత్తరప్రదేశ్‌కు చెందిన యాత్రికులు ప్రయాణిస్తున్న తుపాన్ వాహనం, ద్విచక్ర వాహనం ఢీకొన్నట్లు ప్రాథమిక సమాచారం. ఈ ప్రమాదంలో ఒకరు సంఘటనా స్థలంలోనే మృతి చెందినట్లు తెలుస్తోంది. పలువురికి గాయాలైనట్లు సమాచారం. ప్రమాదం జరిగిన సమయంలో ఆ ప్రాంతంలో పట్రోలింగ్ విధుల్లో ఉన్న ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ శ్రీ ప్రవీణ్ కుమార్ వెంటనే స్పందించి సంఘటనా స్థలానికి చేరుకున్నారు. పరిస్థితిని పరిశీలించి గాయపడిన వారికి తక్షణ సహాయం అందించారు. అనంతరం అటవీ సిబ్బంది సమన్వయంతో క్షతగాత్రులను అత్యవసర వైద్యం జెన్‌కో ఆసుపత్రికి తరలించే చర్యలు చేపట్టారు. తీవ్రంగా గాయపడిన కొంతమందిని అచ్చంపేట ఏరియా ఆసుపత్రికి తరలించి వైద్య చికిత్స అందిస్తున్నట్లు సమాచారం. ప్రమాదం జరిగిన వెంటనే అటవీ సిబ్బంది స్పందించి క్షతగాత్రులను సకాలంలో ఆసుపత్రులకు తరలించేందుకు చర్యలు చేపట్టడంతో బాధితులకు తక్షణ వైద్య సహాయం అందింది. అటవీ ప్రాంతంలో పర్యాటకులు, యాత్రికుల భద్రతకు ప్రాధాన్యతనిస్తూ విధులు నిర్వహిస్తున్న అటవీ సిబ్బంది, ప్రమాద సమాచారం అందిన వెంటనే సహాయక చర్యల్లో పాల్గొన్నారు. ప్రమాదానికి సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# భూసేకరణ వేగవంతం చేసి ప్రాజెక్టులు పూర్తి చేయాలి

- **కలెక్టర్ల ఖాతాల్లోని నిధులను యుద్ధప్రాతిపదికన ఖర్చు చేయాలి**
- **మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి**



**వనపర్తి బ్యూరో, సెప్టెంబర్ 21 (జనం సాక్షి) :** ఇరిగేషన్ ప్రాజెక్టులకు సంబంధించి భూసేకరణ, భూనిర్వాసితులకు పునరావాస కేంద్రాల ఏర్పాటు, భూములు కోల్పోయిన రైతులకు పరిహారం చెల్లింపు ప్రక్రియను వేగవంతం చేసి ప్రాజెక్టు పనులను త్వరితగతిన పూర్తి చేయాలని రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అధికారులను ఆదేశించారు.

సోమవారం బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజుతో కలిసి జిల్లా కలెక్టర్లతో ఇరిగేషన్ ప్రాజెక్టుల భూసేకరణ, పునరావాస కేంద్రాలు, అటవీ భూముల సమస్యలపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రాజెక్టులను త్వరితగతిన పూర్తి చేసేందుకు ప్రభుత్వం విడతలవారీగా నిధులు విడుదల చేస్తోందన్నారు. విడుదలైన నిధుల్లో కొంతమేర మాత్రమే ఖర్చు చేసి, మిగిలిన నిధులు కలెక్టర్ల ఖాతాల్లో ఉండటంపై కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఖాతాల్లో ఉన్న నిధులను వెంటనే భూములు కోల్పోయిన రైతులకు పరిహారంగా చెల్లించి భూసేకరణ పూర్తి చేయాలని, భూనిర్వాసితులకు పునరావాస కేంద్రాల ఏర్పాటుకు నిధులు వినియోగించాలని సూచించారు.

రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు మాట్లాడుతూ కలెక్టర్లు రైతులతో నేరుగా మాట్లాడి భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. రాబోయే యాసంగిలో సాగునీటి సమస్యలు తలెత్తే అవకాశం ఉన్నందున రైతులు వరికి బదులుగా ఆరుతడి పంటలు సాగు చేసేలా అవగాహన కల్పించాలని తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి మాట్లాడుతూ పాలమూరు--రంగారెడ్డి ప్రాజెక్టు భూసేకరణ, పునరావాసం కోసం వనపర్తి జిల్లాకు రూ.30 కోట్ల నిధులు విడుదలయ్యాయని తెలిపారు. ఇందులో బంద్రాయిపాకుల వీరాంజనేయ బ్యాలెన్స్ రిజర్వాయర్ భూసేకరణకు ఇప్పటికే రూ.19.25 కోట్లు ఖర్చు చేసినట్లు వివరించారు. మిగిలిన రూ.11.39 కోట్లతో రైతులతో చర్చించి అవార్డులు పాస్ చేసి భూసేకరణకు నిధులు ఖర్చు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో అటవీశాఖ జిల్లా ఇన్‌చార్జి అధికారి నవీన్‌కుమార్‌రెడ్డి, ఆర్డీవో సుబ్రహ్మణ్యం, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ (భూసేకరణ) ఎన్.తిరుపతయ్య, పాలమూరు--రంగారెడ్డి ఇరిగేషన్ ఎస్ఈలు విజయభాస్కర్‌రెడ్డి, చంద్రశేఖర్, సెక్షన్ సూపరింటెండెంట్ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణి ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి



**వనపర్తి, సెప్టెంబర్ 21 (జనం సాక్షి) :** ప్రజావాణిలో అందిన ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించి, సంబంధిత ఫిర్యాదుదారులకు సమాచారం అందించాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి అధికారులను ఆదేశించారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన జిల్లాస్థాయి ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు కీమ్యా నాయక్, వినోద్‌కుమార్‌తో కలిసి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ప్రజావాణి ఫిర్యాదులను పరిష్కరించిన వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని కలెక్టర్ సూచించారు. తమ శాఖ పరిధిలో లేని సమస్యలను సంబంధిత శాఖలకు పంపించాలని, నిబంధనల ప్రకారం పరిష్కరించలేని అంశాలను కారణాలతో ఫిర్యాదుదారులకు తెలియజేయాలని చెప్పారు. ఎలాంటి అర్జీని పెండింగ్‌లో ఉంచకుండా, ఇప్పటికే పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను పరిశీలించి వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. సీఎం, జిల్లా మంత్రి ప్రజావాణి నుంచి వచ్చిన పెండింగ్ అర్జీలను కూడా సత్వరమే పరిష్కరించాలని అధికారులకు సూచించారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో మొత్తం 31 దరఖాస్తులు అందగా, ఆర్డీవో కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో 2 దరఖాస్తులు వచ్చాయి. ఈ-ఆఫీస్ ద్వారానే ఫైళ్ల నిర్వహణ ప్రభుత్వ శాఖల్లో ఫైళ్లను ఆఫ్‌లైన్‌లో కాకుండా ఈ-ఆఫీస్ ఆన్‌లైన్ విధానం ద్వారానే నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. కొన్ని శాఖల్లో ఈ-ఆఫీస్ విధానం పూర్తిస్థాయిలో అమల్లోకి రాలేదని, ఆయా శాఖల అధికారులు వెంటనే అమలు చేసి ఇకపై అన్ని ఫైళ్లను ఈ-ఆఫీస్ ద్వారానే నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈవో యాదయ్య, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ శ్రావ్య, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణి అర్జీలను వేగవంతంగా పరిష్కరించాలి

- జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి..



హనుమకొండ ప్రతినిధి, సెప్టెంబర్ 21 (జనంసాక్షి) : ప్రజావాణి అర్జీలను వేగవంతంగా పరిష్కరించాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. సోమవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాలులో వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులతో కలిసి ప్రజా సమస్యల పరిష్కారానికి చేపట్టిన ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజావాణి అర్జీలను జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి, అదనపు కలెక్టర్ ఎన్. రవి స్వీకరించారు. ప్రజల నుండి అందిన ప్రజావాణి అర్జీలను సంబంధిత శాఖల అధికారులను పరిష్కారానికి చర్యలు చేపట్టాలని అక్కడికక్కడే ఆదేశించారు. అదేవిధంగా వర్చువల్ విధానంలో ఆర్డీఓ, తహసిల్దార్, ఎంపీడీవోలతో ప్రజావాణి అర్జీల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని కలెక్టర్ మాట్లాడారు. వివిధ సమస్యల పరిష్కారం కోసం జిల్లా, రెవెన్యూ డివిజనల్, మండల స్థాయి లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 298 అర్జీలనుసమర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలనుండి అందిన అర్జీలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల ఇన్చార్జి అదనపు కలెక్టర్ శేషాద్రి, జిల్లా రెవెన్యూ అధికారి శ్రీనివాస్, డిఆర్డివో మేన శీను, సీపీవో సత్యనారాయణ రెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## జిల్లాను టీబీ రహితంగా తీర్చిదిద్దాలి

- అదనపు కలెక్టర్ అశోక్ కుమార్



జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి) : జిల్లాను క్షయ వ్యాధి రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు నిర్వహిస్తున్న ఉచిత స్క్రీనింగ్ శిబిరాల్లో ప్రతి ఒక్కరూ పరీక్షలు చేపించుకోవాలని రెవెన్యూ అదనపు కలెక్టర్ పి.అశోక్ కుమార్ పిలుపునిచ్చారు. సోమవారం ఐడీఓసీ కార్యాలయంలో వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో టీబీ పరీక్షల నిర్వహణపై అన్ని శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రెండు వారాలకు పైగా దగ్గు, సాయంత్రం జ్వరం, బరువు తగ్గడం వంటి లక్షణాలను నిర్లక్ష్యం చేయవద్దని, వెంటనే ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఉచితంగా ఎక్స్-రే, తెమడ పరీక్షలు చేపించుకోవాలన్నారు. మొబైల్ ఎక్స్-రే వాహనాల ద్వారా పరీక్షలు చేస్తున్నామని, మందులు మధ్యలో ఆపితే డ్రగ్ రెసిస్టెంట్ టీబీ వస్తుందని హెచ్చరించారు.

### ప్రజావాణి ఫిర్యాదులకు త్వరిత పరిష్కారం..

ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులకు అధికారులు వెంటనే స్పందించి పరిష్కారం చూపాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు. సోమవారం 68 దరఖాస్తులు స్వీకరించామని, వారంలోగా పరిష్కరించి పోర్టల్ లో నమోదు చేయాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమాల్లో అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, డీఆర్వో వసంత కుమారి, ఆర్డీఓ హరికృష్ణ, డీఎంహెచ్ఓ డా.మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

## కుటుంబ సభ్యుల ముందే లైవ్‌లో ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య



పర్వతగిరి, సెప్టెంబర్ 21 (జనం సాక్షి) : కుటుంబ కలహాలు ఓ వ్యక్తి ప్రాణాలను బలితీసుకున్నాయి. తల్లి, మొదటి భార్య కళ్లముందే ఓ వ్యక్తి లైవ్‌లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన విషాద సంఘటన పర్వతగిరి మండలంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... పర్వతగిరి మండలం ముంజాలకుంట తండా పరిధిలోని నర్రెంగతండాకు చెందిన బానోత్ జవహర్‌లాల్ కుటుంబంలో కొంతకాలంగా వివాదాలు నడుస్తున్నాయి. ఈ క్రమంలో సోమవారం రోజున తల్లి,మొదటి భార్య సమక్షంలో కుటుంబ గొడవలు తీవ్రస్థాయికి చేరాయి. ఈ ఘర్షణ జరుగుతుండగానే జవహర్‌లాల్ కోడలు తన సెల్‌ఫోన్‌లో వీడియో రికార్డు చేయడం ప్రారంభించింది. తీవ్ర మనస్తాపానికి గురైన జవహర్‌లాల్ వారు చూస్తుండగానే, ఫోన్ రికార్డవుతున్న సమయంలోనే ఉరేసుకుని ప్రాణాలు విడిచాడు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం వరంగల్‌లోని ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నారు.

## విమానాశ్రయానికి అంబేద్కర్ పేరు పెట్టాలి

- రాష్ట్ర ప్రభుత్వానికి ఆర్ఎస్‌పి విజ్ఞప్తి



పర్వతగిరి. సెప్టెంబర్ 21 (జనం సాక్షి) : మామునూరు లో నిర్మించనున్న విమానా శ్రయానికి భారతరత్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ పేరు పెట్టాలని. రెవల్యూషనరీ సోషలిస్ట్ పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు వరంగల్ జిల్లా కార్యదర్శి. వల్లందాస్ కుమార్ రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.తెలంగాణ రాష్ట్రం ఏర్పడడానికి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ రాసిన భారత రాజ్యాంగంలోని ఆర్టికల్(3) ప్రకారం తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందని అన్నారు. ముఖ్యమైన నగరాలలో వరంగల్ కు. చరిత్ర ఆత్మకంగా ప్రాధాన్యత ఉండడమే కాకుండా కాకతీయ కాలంలో రాజధానిగా ప్రత్యేక గుర్తింపు వరంగల్ కు. ఉందా అని అన్నారు. ప్రపంచవ్యాప్తంగా విద్యావేత్త న్యాయవేత్తగా భారత రాజ్యాంగ రూపకల్పిగా డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కు. ప్రత్యేక గుర్తింపు ఉంది మామునూరులో అంతర్జాతీయ ప్రమాణాలతో అభివృద్ధి చేయనున్న మామునూరు విమానాశ్రయానికి అంబేద్కర్ పేరు పెట్టాలని రాష్ట్ర ప్రభుత్వానికి ఆయన సూచించారు అంతేకాకుండా విమానాశ్రయానికి అంబేద్కర్ పేరు పెట్టే ప్రతిఎ పాదనలకు మేధావులు విద్యావేత్తలు అధికారులు ప్రజాప్రతినిధులు అంబేద్కర్ ను.ఆదర్శంగా తీసుకుంటున్న వారు అన్ని వర్గాల ప్రజలు మద్దతు తెలుప వలసిందిగా ఆయన విజ్ఞప్తి చేశారు ఈ సమావేశంలో జేరుపోతుల శ్రీనివాస్. పసుల కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు

## కొండా లక్ష్మణ్ బాపూజీకి నివాళులర్పించిన న్యాయవాదులు



హనుమకొండ, సెప్టెంబర్ 22 (జనంసాక్షి) : తెలంగాణ ఉద్యమ యోధుడు, స్వాతంత్ర్య సమరయోధుడు, బీసీల హక్కుల కోసం జీవితాంతం పోరాడిన ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ 14వ వర్ధంతి సందర్భంగా హనుమకొండలో బార్అ సోసియేషన్ న్యాయవాదులు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా బాపూజీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఆయన సేవలను స్మరించుకున్నారు. వరంగల్, హనుమకొండ జిల్లాల బార్ అసోసియేషన్ అధ్యక్షులు చకిలం ఉపేందర్, చోళ్ళేటి రామకృష్ణ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం, ఆయన చేసిన త్యాగాలు, కృషి చిరస్మరణీయమని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమం లో బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు సి. ఎహ్.సాంబా శివ రాజు గౌడ్, లలిత కుమారి, కార్యదర్శులు నాగేంద్ర చారీ, ఊరుగొండ నరేందర్, కార్యవర్గ సభ్యులు కూరపాటి అశోక్, ఉమా గౌరీ, తో పాటు న్యాయవాదులు ఆర్. నర్సింగ రావు గౌడ్, పరమేశ్వర్, మేరుగు సుభాష్, రాజేష్, మధుకర్, సుజాత, తదితరులు పాల్గొన్నారు.

# వెంటిలేటర్‌పై వరంగల్ ఎంజీఎం ఆసుపత్రి!

- ఆరోగ్యశ్రీ వార్డులో పైకప్పు కూలి రోగులు గాయపడటం ప్రభుత్వ నిర్లక్ష్యానికి పరాకాష్ట.
- ఘటనా స్థలాన్ని పరిశీలించిన బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్.
- ఆరోగ్యశాఖను గాలికొదిలేసిన మంత్రి రాజనర్సింహ వెంటనే రాజీనామా చేయాలి!



వరంగల్ ఈస్ట్, సెప్టెంబర్ 21 (జనం సాక్షి) : ఉత్తర తెలంగాణకే తలమానికమైన, వరంగల్ నగరంలోని అతిపెద్ద ప్రభుత్వ ఆసుపత్రి అయిన ఎంజీఎం ఆసుపత్రి ఈరోజు కాంగ్రెస్ ప్రభుత్వ చేతకానితనం వల్ల వెంటిలేటర్‌పై కొట్టుమిట్టాడుతోందని బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. నిన్న ఎంజీఎం ఆసుపత్రిలోని ఆరోగ్యశ్రీ వార్డులో అకస్మాత్తుగా ఆస్పత్రి పైకప్పు పెచ్చులు ఊడిపడి, చికిత్స పొందుతున్న రోగులు, వారి సహాయకులు తీవ్రంగా గాయపడిన సంగతి తెలిసిందే. ఈ ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న బాధితులను పరామర్శించేందుకు ఈరోజు బీజేపీ జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్ మరియు బీజేపీ నాయకులు ఎంజీఎం ఆసుపత్రికి చేరగా, ఆసుపత్రి ప్రాంగణంలో తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకుంది. ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లకుండా అడ్డుకోవాలని చూసిన పోలీసులతో బీజేపీ నాయకులకు మొదటగా తీవ్ర వాగ్వాదం జరిగింది. పోలీసుల ఆంక్షలను ధిక్కరిస్తూ బీజేపీ శ్రేణులు ప్రమాదం జరిగిన ఆరోగ్యశ్రీ వార్డు ప్రాంగణాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. అక్కడి వాతావరణంలో రోగులు పడుతున్న ఇబ్బందులను, భవన శిథిలావస్థను చూసి నాయకులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

### పదవులపై, కమిషన్లపై ఉన్న శ్రద్ధ ప్రజా సమస్యలపై లేదు

అనంతరం గంట రవికుమార్ మీడియాతో మాట్లాడుతూ రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వంపై, స్థానిక ప్రజాప్రతినిధులపై నిప్పులు చెరిగారు. "స్థానిక కాంగ్రెస్ మంత్రులకు, ఎమ్మెల్యేలకు కేవలం వారి పదవులపై, కమిషన్ల వసూలు చేసుకోవడంపై ఉన్న శ్రద్ధ ప్రజా సమస్యలపై, ప్రజల ప్రాణాలపై అస్సలు లేదు" అని ఘాటుగా విమర్శించారు. నిరుపేద ప్రజలకు అత్యాధునిక ఉచిత వైద్యం అందించాల్సిన ఆరోగ్యశ్రీ వార్డులోనే పైకప్పు కూలి రోగుల ప్రాణాల మీదకు రావడం అధికారుల, పాలకుల నిర్లక్ష్యానికి నిదర్శనమని మండిపడ్డారు. రోగులను కాపాడలేకపోతున్న ఇటువంటి నిర్లక్ష్యపు అధికారులపై మరియు వైద్య శాఖపై ప్రభుత్వం వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. పేరు గొప్ప ఊరు దిబ్బగా మారిన ఎంజీఎం ఆసుపత్రి భవనాల భద్రతపై తక్షణమే సమగ్ర విచారణ జరిపించాలని, గాయపడిన బాధితులకు ప్రభుత్వం మెరుగైన వైద్యంతో పాటు తగిన నష్టపరిహారం అందించాలని, ఆరోగ్యశాఖను గాలికొదిలేసిన మంత్రి రాజనర్సింహ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై, వైద్య రంగంలో వారి వైఫల్యాలపై బీజేపీ ఆధ్వర్యంలో వరంగల్ జిల్లా వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని గంట రవికుమార్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రత్నం సతీష్ షా, జిల్లా ప్రధాన కార్యదర్శులు బాకం హరిశంకర్, బన్న ప్రభాకర్, జిల్లా కార్యదర్శులు గోకే వెంకటేష్, వెంకట్ రావు, వివిధ మోర్చా జిల్లా అధ్యక్షులు టేకుమట్ల రేణుక, కూచన క్రాంతి కుమార్, ఎర్రగోళ్ల భరత్ వీర్, బిజెపి జిల్లా నాయకులు అంకాల జనార్ధన్, బైరి శ్యాంసుందర్, నోముల రతన్, గోగికార్ అనిల్,చిలువేరు రాజేందర్, మాచర్ల దీన్ దయాల్, గుర్రాల చంద్రమౌళి, గద్దం మహేందర్, కర్నే రవీందర్, మందోటి మహేందర్, షేర్ల అనిల్, కోమాకుల నాగరాజు, మడిపల్లి నాగరాజు, మార్త ఉషారాణి, స్వర్ణ, శైలశ్రీ, సుజాత, మండల అధ్యక్షులు మహమ్మద్ రఫీ, సీతా నాగరాజు, రజనీష్ మరియు తాళ్లపల్లి శ్రీనివాస్, జెట్లింగ్ శివ, బోడకుంట్ల శివ, ఆడేపూ రవి మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

## రామప్పను సందర్శించిన ప్రపంచ బ్యాంకు ప్రతినిధి



వెంకటాపూర్ (రామప్ప ), సెప్టెంబర్ 21(జనం సాక్షి ): ములుగు జిల్లా వెంకటాపూర్ మండలంలోని పాలంపేట గ్రామంలో గల ప్రపంచ ప్రసిద్ధిగాంచిన రామప్ప దేవాలయాన్ని సోమవారం ఇటలీ దేశానికి చెందిన ప్రపంచ బ్యాంకు ప్రతినిధి రోసన్నా నిట్టీ సందర్శించారు. ఈ సందర్భంగా ఆమెకు రామప్ప దేవాలయంలోని రామలింగేశ్వర స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాగా, ఆలయ అర్చకులు హరీష్ శర్మ,ఉమాశంకర్ స్వామివారి ఆశీర్వచనాలను,తీర్థ ప్రసాదాలను ఆమెకు అందజేశారు. అనంతరం ఆమెకు టూరిజం గైడ్ గోరంట్ల విజయ్ కుమార్ రామప్ప విశిష్టత, ఆలయ చరిత్ర, శిల్పకళ వైభవం,కాకతీయుల చరిత్ర గురించి వివరించారు. ఈ సందర్భంగా ఆమె రామప్పకు యునెస్కో గుర్తింపు తరువాత పెరిగిన సందర్శకుల వివరాలతోపాటు దేవాలయానికి,పాలంపేట గ్రామానికి పెరిగిన ఆదాయం గురించి గైడ్ విజయ్ ను అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా పర్యాటకులకు కావలసిన సదుపాయాలు, అందుతున్న సౌకర్యాలు, జరిగిన అభివృద్ధి, జరుగుతున్న అభివృద్ధి, పునర్నిర్మాణ పనులు, పాలంపేట ప్రజల జీవన విధానం, ఆదాయ వనరులు గురించి సైతం ఆమె విజయ్ ని అడిగి తెలుసుకున్నారు. అక్కడి నుండి నేరుగా రామప్ప చెరువు వద్ద కు చేరుకొని బోటింగ్ చేశారు. ఆమె వెంట కూడా అధికారి అసిఫ్,టూరిస్ట్ పోలీసులు శ్రీనివాస్,శ్రీకాంత్,బద్రు,అరుణ్,పురావస్తు, దేవాదాయ,టూరిజం శాఖల సిబ్బంది తదితరులు ఉన్నారు.

## హత్యాయత్నం కేసులో నలుగురు నిందితుల అరెస్ట్



ధర్మసాగర్ సెప్టెంబర్ 21 (జనం సాక్షి) : ధర్మసాగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని సాయిపేట గ్రామ శివారులో వేలేరు కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు మూరావత్ లక్ష్మణ్ నాయక్ పై హత్యాయయత్నానికి పాల్పడిన కేసులో నలుగురు నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు ఈ కేసుకు సంబంధించిన వివరాలను పోలీసులు మీడియాకు విడుదల చేశారు. పాత కక్షలు రాజకీయ విభేదాల నేపథ్యంలో పథకం ప్రకారం ఇనుప రాడ్డుతో దాడి చేసి హత్య చేయడానికి యత్నించడం వేలేరు మండలానికి చెందిన కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మూరావత్ లక్ష్మణ్ నాయక్ పై రాజకీయ ఎదుగుదల పార్టీ పదవులు మరియు ఎస్సీ ఎస్టీ కేసు విషయాల పట్ల పగ పెంచుకున్న ప్రధాన నిందితుడు ఎండి సద్దాం హుస్సేన్ అతడిని అడ్డు తొలగించుకోవాలని పథకం పన్నాడు ఇందులో భాగంగా బైరి అనిల్ అందె కృపాసాగర్ కురసపల్లి హరీష్‌లతో కలిసి లక్ష్మణ్ నాయక్‌పై హత్యాయయత్నానికి కుట్ర పన్నారు. పథకం ప్రకారం సెప్టెంబర్ 17న హనుమకొండ నుండి ద్విచక్ర వాహనంపై వేలేరుకు వస్తున్న లక్ష్మణ్ నాయక్‌ను సాయిపేట శివారులో కాపుకాచి మోటర్ సైకిల్ పై వెంబడించి వెనుకనుండి తలపై ఇనుప రాడ్డుతో కొట్టి తీవ్రంగా గాయపరిచారు బాధితుని కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ధర్మసాగర్ పోలీస్ స్టేషన్‌లో సి ఆర్ నెంబర్ 249/2026 యు/ సి 109 బి ఎన్ ఎస్ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు అరెస్ట్ చేయబడిన నిందితులు ఏ 1 ఎండి సద్దాం హుస్సేన్ (36) తండ్రి రాజ్ మహమ్మద్ వృత్తి వ్యాపారం ఆర్ ఓ వేలేరు గ్రామం మండలం హన్మకొండ జిల్లా, ఏ 2 బైరి అనిల్ (36) తండ్రి మొగిలి వృత్తి చికెన్ షాప్ ఆర్ ఓ వేలేరు గ్రామం మండలం హన్మకొం డ జిల్లా, ఏ 3 అందె కృపాసాగర్ (27) తండ్రి విద్యాసాగర్ వృత్తి పెయింటింగ్ పనులు ఆర్ ఓ ఉప్పరపల్లి వేలేరు శివారు హన్మకొండ జిల్లా, ఏ 4 కురసపల్లి హరీష్ (22) తండ్రి ఎల్లయ్య వృత్తి సెంట్రింగ్ పనులు ఆర్ ఓ ఉప్పరపల్లి వేలేరు శివారు హన్మకొండ జిల్లా పోలీసులు దర్యాప్తు వేగవంతం చేసి నిందితులు నలుగురిని ఈరోజు అరెస్ట్ చేసి వారి వద్ద నుండి నేరానికి ఉపయోగించిన ఆధారాలను సేకరించడం జరిగింది చట్టాన్ని చేతిలోకి తీసుకునే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు.

## ఉపరితల గని కార్యాలయంలో షావల్ యంత్రం ప్రారంభం

- రామకృష్ణాపూర్ కు పూర్వ వైభవం
- ఏరియా జియం రాధాకృష్ణ



రామకృష్ణాపూర్, సెప్టెంబర్ 21(జనంసాక్షి): మందమర్రి ఏరియా ఆర్కేపీ పట్టణానికి పూర్వవైవం తిరిగి రానుందని ఏరియా జిఎం రాధాకృష్ణ తెలిపారు. స్థానిక ఉపరితల గని కార్యాలయంలో 58 లక్షల రూపాయల విలువ గల షావల్ యంత్రాన్ని సోమవారం జిఎం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలోనే ఆర్కేఓసిపి ఫెజ్-2 పనులు ప్రారంభం కానున్నట్లు సంతోషం వ్యక్తం చేశారు. ఉపరితల గనుల నిర్వహణలో షావల్ యంత్రాలు కీలకపాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. గని ఏర్పాటులో భాగంగా అటవీశాఖ అనుమతులు లభించాయని తెలిపారు. దీంతో ప్రత్యక్షంగా, పరోక్షంగా ఎంతో మందికి జీవనోపాధి అవకాశాలు కలుగుతాయన్నారు. ఎలాంటి ఆటంకాలు కలగకుండా పట్టణ ప్రజలు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ ఓటుజిఎం.జి ఎల్ ప్రసాద్, ఈఅండ్ఎం. బాలాజీ భగవతి జ, ఓసి మేనేజర్ రామరాజు, డిప్యూటీ సీఎం రవీందర్, సూపర్డెంట్ ఇంజనీర్ సంపత్, చంద్రమౌళి, ఏఐటియుసి ఫిట్ సెక్రటరీ హరి రామకృష్ణ పాల్గొన్నారు.

## అదిలాబాద్ విమానాశ్రయానికి కొండ లక్ష్మణ్ బాపూజీ పేరు పెట్టాలి

- తెలంగాణ రాష్ట్ర పద్మశాలి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బేత రమేష్



గుడిహత్నూర్ సెప్టెంబర్ 21 (జనం సాక్షి): అదిలాబాద్ లో నూతనంగా ఏర్పాటు కానున్న జాయింట్ యూజర్ ఎయిర్‌పోర్ట్‌కు ఆదిలాబాద్ జిల్లా ముద్దుబిడ్డ, స్వాతంత్ర్య సమరయోధుడు కొండా లక్ష్మణ్ బాపూజీ పేరు పెట్టాలని తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బేత రమేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో కొండా లక్ష్మణ్ బాపూజీ 14వ వర్ధంతిని పురస్కరించుకుని ఆయన విగ్రహానికి పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బేత రమేష్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం కొండా లక్ష్మణ్ బాపూజీ కీలక పాత్ర పోషించారని గుర్తుచేశారు. అయితే ఆయన ఆశయాలు పూర్తిస్థాయిలో నెరవేరడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆదిలాబాద్‌లో ఏర్పాటు కానున్న ఎయిర్‌పోర్ట్‌కు లిలి'కొండా లక్ష్మణ్ బాపూజీ ఎయిర్‌పోర్ట్'లిలిగా నామకరణం చేయాలని కోరారు. అలాగే ఈ నెల 27న జరిగే కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతిని పురస్కరించుకుని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో అధికారిక సెలవుదినంగా ప్రకటించాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో పద్మశాలి సంఘం నాయకులు జక్కుల సత్యనారాయణ, ఆశమ్మ, అనుముల ఉషన్న, కుర్ర రవీందర్, అడెల్లు తదితరులు పాల్గొన్నారు.



## జాతీయస్థాయి సాఫ్ట్ బాల్ పోటీలకు డిగ్రీ విద్యార్థిని ఎంపిక

బెల్లంపల్లి, సెప్టెంబర్ 21, (జనంసాక్షి) : బెల్లంపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన బీఎస్సీ బిజెడ్సి ద్వితీయ సంవత్సరం విద్యార్థిని సనా అంజుమ్ జాతీయస్థాయి సాఫ్ట్బాల్ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ కాంపల్లి శంకర్ తెలిపారు. విద్యార్థిని వివిధ స్థాయిలలో సాఫ్ట్ బాల్ పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబరిచి జాతీయస్థాయికి కాకతీయ విశ్వవిద్యాలయం తరఫున అర్హత సాధించారని పేర్కొన్నారు. త్వరలో జాతీయ స్థాయిలో జరగనున్న సాఫ్ట్బాల్ పోటీల్లో పాల్గొంటారని వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థిని సాధించిన ఘనతపై ప్రిన్సిపాల్ తో పాటు అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది, విద్యార్థిని, విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు.

## సింగరేణి కార్మికుల హామీల అమలు ఎప్పుడు?

- టీఎస్ యూఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గట్టయ్య



జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి): సింగరేణి కార్మికుల సమస్యలను అసెంబ్లీలో ప్రస్తావించడం అభినందనీయమని, కానీ అమలుకు నోచుకోవడం లేదని టీఎస్ యూఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కామెర గట్టయ్య అన్నారు. భూపాలపల్లిలో విలేకరులతో మాట్లాడుతూ.. మెడికల్ బోర్డు ఏర్పాటు, 250 గజాల ఇంటికి వడ్డీ లేని రుణం, పెండింగ్ విజిలెన్స్ కేసుల పరిష్కారం, కార్మికులకు ఇన్ కమ్ టాక్స్, రిటైర్మెంట్ తర్వాత రూ.25 లక్షల వైద్య సాయం, కాంట్రాక్ట్ కార్మికుల దసరా అడ్వాన్స్ పెంపు, కేంద్ర లేబర్ కోడ్ ల రద్దు వంటి హామీలను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు.

## నీటిపారుదల డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా బాధ్యతలు బి.భీంరావు



నేరడిగొండ సెప్టెంబర్ 21 (జనంసాక్షి) : నీటిపారుదల డివిజన్ నం.2 ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా బి.భీమ్‌రావు సోమవారం బాధ్యతలు స్వీకరించచిన సందర్భంగా కలెక్టరేట్ వీసీ హాల్ ఆవరణలో జిల్లా కలెక్టర్ రాజర్షిషా ను మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్కను అందజేశారు. ఈ సందర్భంగా ఈఈ కి కలెక్టర్ శుభాకాంక్షలు తెలుపుతూ జిల్లాలో నీటిపారుదల శాఖ అభివృద్ధి,పనుల నిర్వహణను సమర్ధవంతంగా, పారదర్శకంగా నిర్వహించాలని సూచించారు.

# సత్తుపల్లి ట్రంక్‌కు గోదావరి జలాలు అందించడమే లక్ష్యం

- 25 రోజుల్లో టన్నెల్ పనులు పూర్తి చేయాలి
- అధికారులకు మంత్రి తుమ్మల ఆదేశం
- కమలాపురం పంప్‌హౌస్ నుంచి అన్నదైవం ప్రాజెక్టుకు నీటి విడుదల
- కుమ్మరిపాడులో హై లెవల్ బ్రిడ్జి, బీటీ రోడ్డు ప్రారంభం



**భద్రాద్రి కొత్తగూడెం, సెప్టెంబర్ 21 (జనం సాక్షి) :** సీతారామ ప్రాజెక్టు ద్వారా సత్తుపల్లి ట్రంక్‌కు గోదావరి జలాలను అందించి రైతులకు సాగునీటి భరోసా కల్పించేందుకు పనులను వేగవంతం చేస్తున్నామని రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్, చేనేత శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. సత్తుపల్లి మండలం యాతాలకుంట వద్ద సీతారామ ప్రాజెక్టు టన్నెల్ పనులను మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, అశ్వరావుపేట శాసనసభ్యులు జారే ఆదినారాయణ, జిల్లా కలెక్టర్ అంకిత్‌తో కలిసి పరిశీలించారు. యాతాలకుంట టన్నెల్‌లో జరుగుతున్న పనులను పరిశీలించిన మంత్రి, టన్నెల్ నిర్మాణ పనుల పురోగతిపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. టన్నెల్ కింది భాగంలో ఉన్న ఖాళీలను కాంక్రీట్‌తో పటిష్టంగా నింపాలని, గ్రౌటింగ్, ప్యాకింగ్, కాంక్రీట్ పనులను సాంకేతిక ప్రమాణాలకు అనుగుణంగా పూర్తి చేయాలని సూచించారు. టన్నెల్ పనుల్లో నాణ్యత, భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, ఎలాంటి జాప్యానికి తావులేకుండా పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. టన్నెల్‌కు సంబంధించిన మిగిలిన పనులను 25 రోజుల్లో పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామని అధికారులు మంత్రికి వివరించారు. అక్టోబర్ నెలలో టర్నల్ పనులను పూర్తి చేసి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించే విధంగా అవసరమైన చర్యలు చేపట్టాలని మంత్రి అధికారులను ఆదేశించారు. టన్నెల్ లైనింగ్, కెనాల్ లైనింగ్, రోడ్ క్రాసింగ్స్ తదితర మిగిలిన పనులను సమన్వయంతో వేగవంతం చేయాలని స్పష్టం చేశారు. అనంతరం ములకలపల్లి మండలం కుమ్మరిపాడు గ్రామంలో ఎస్‌టీఎస్‌డీఎఫ్ నిధులతో 4 కోట్ల 63 లక్షల అంచనా వ్యయంతో నిర్మించిన హై లెవల్ బ్రిడ్జి, బీటీ రోడ్డును మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రారంభించారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు రాకపోకలు సులభతరం చేయడంతో పాటు అన్ని కాలాల్లో రవాణా సౌకర్యం అందుబాటులో ఉండేలా మౌలిక వసతులను అభివృద్ధి చేస్తున్నామని మంత్రి తెలిపారు.

ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ సీతారామ ప్రాజెక్టు ద్వారా సత్తుపల్లి ట్రంక్‌కు గోదావరి జలాలను అందించాలన్నది ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి లక్ష్యమని తెలిపారు. సత్తుపల్లి ట్రంక్‌కు గోదావరి నీటిని అందించే దిశగా ప్రాజెక్టు పనులను వేగవంతం చేస్తున్నామని చెప్పారు. యాతాలకుంట వద్ద టన్నెల్ పనులను పరిశీలించి, మిగిలిన పనులను నిర్ణీత గడువులో పూర్తి చేయాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చామని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో సంబంధిత ఇంజినీరింగ్ అధికారులు, రెవెన్యూ అధికారులు, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## బహుజన రాజ్యాధికార సమరభేరి కరపత్రం విడుదల



**కొడంగల్, సెప్టెంబర్ 21 (జనం సాక్షి) :** బహుజన్ సమాజ్ పార్టీ వ్యవస్థాపకులు మాన్యవార్ కాన్షీరామ్ 20వ వర్ధంతి సందర్భంగా నిర్వహించనున్న "చలో హైదరాబాద్--బహుజన రాజ్యాధికార సమరభేరి" కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాన్ని సోమవారం కొడంగల్ పట్టణంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద బీఎస్పీ కొడంగల్ అసెంబ్లీ కమిటీ ఆధ్వర్యంలో విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ చేవెళ్ల పార్లమెంట్ ఇన్‌చార్జి సయ్యద్ అమీర్, వికారాబాద్ జిల్లా అధ్యక్షుడు చెట్టుకింది ఇసువప్ప, జిల్లా ఉపాధ్యక్షుడు కిందింటి కృష్ణంరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దాపురం చెన్నప్ప, కొడంగల్ అసెంబ్లీ ఇన్‌చార్జి యు. రమేశ్ బాబు, అసెంబ్లీ అధ్యక్షుడు మ్యాతరి శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు ఎం. వెంకటేశ్, కోశాధికారి మహమ్మద్, టౌన్ అధ్యక్షుడు కోస్గి దస్తప్ప, మండల నాయకులు అన్నారం సాయిలు, సోషల్ మీడియా ఇన్‌చార్జి వెంకటేష్, మండల అధ్యక్షుడు పోలేపల్లి శ్రీనివాస్‌తో పాటు వివిధ గ్రామాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పోలీసులపై ఎస్పీకి ఫిర్యాదు

- రూ.5 లక్షల అప్పు వ్యవహారంలో బెదిరింపులు



**నల్లగొండ ప్రతినిధి, సెప్టెంబర్ 21 (జనం సాక్షి) :** రూ.5 లక్షలు అప్పుగా తీసుకుని తిరిగి చెల్లించకుండా బెదిరిస్తున్నారని,తన ఫిర్యాదుపై పోలీసులు స్పందించకుండా ఎదుటివారితో కుమ్మక్కై తమపై కేసు నమోదు చేశారని ఆరోపిస్తూ మిర్యాలగూడ మండలం లావుడితండకు చెందిన పానుగోతు బుజ్జి నల్లగొండ జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేశారు. ఫిర్యాదులో పేర్కొన్న వివరాల ప్రకారం.. చింతలతండకు చెందిన రమావత్ హనుమ తన అత్యవసర అవసరాల కోసం రూ.5 లక్షలు అప్పుగా ఇవ్వాలని కోరగా, మూడు నెలల్లో తిరిగి చెల్లిస్తానని చెప్పడంతో 2025 జూన్ 14న నగదుగా ఇచ్చినట్లు బుజ్జి తెలిపారు. గడువు పూర్తయిన తర్వాత డబ్బులు తిరిగి ఇవ్వాలని కోరగా దుర్భాషలాడుతూ ఇబ్బందులకు గురి చేశారని ఆరోపించారు. 2026 మార్చి 8న జగ్రాంతండలో రమావత్ హనుమను కలిసి తన బాకీ డబ్బుల గురించి అడగగా, హనుమ, అతని భార్య రమావత్ లక్ష్మి తనను దుర్భాషలాడుతూ చంపుతామని బెదిరించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ విషయంపై మిర్యాలగూడ రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినప్పటికీ స్పందించలేదని, స్టేషన్‌లోని ఎస్సై ఎం. లక్ష్మయ్య, ఏ ఎస్సై రాములు నాయక్, అసిస్టెంట్ రైటర్ సైదా.. హనుమ కుటుంబంతో కుమ్మక్కై తమపై కేసు నమోదు చేశారని బుజ్జి ఆరోపించారు. తనను, తన కుటుంబాన్ని బెదిరిస్తున్న రమావత్ హనుమ, లక్ష్మి, లావుడి సురేష్, రమావత్ పరమేష్‌తో పాటు సంబంధిత పోలీసు సిబ్బందిపై సమగ్ర విచారణ జరిపి, తనకు న్యాయం చేయాలని జిల్లా ఎస్పీని పానుగోతు బుజ్జి కోరారు.

# గణేష్ నిమజ్జనంను ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలి

- ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా కలెక్టర్, ఎస్పీ

**సూర్యాపేట, సెప్టెంబర్ 21 (జనంసాక్షి) :** బుధవారం జరిగే గణేష్ నిమజ్జనాల కార్యక్రమాన్ని పురస్కరించుకొని సూర్యాపేట జిల్లా కేంద్రంలోని సద్దలచెరువు మినీ ట్యాంక్‌బండ్ వద్ద నిమజ్జన ప్రదేశాన్ని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్, జిల్లా ఎస్పీ కె.నరసింహ, మున్సిపల్ చైర్ పర్సన్ మోరిశెట్టి నివేదిత లక్షాది, డిఎస్పీ, మున్సిపల్ కమిషనర్, స్థానిక కౌన్సిలర్లు, ఇతర శాఖల అధికారులతో కలిసి పరిశీలించారు.ఈ సందర్భంగా నిమజ్జన ఏర్పాట్లు, భద్రత, ట్రాఫిక్ నియంత్రణ, విద్యుత్, పారిశుద్ధ్యం, అగ్నిమాపక, విపత్తు నిర్వహణ తదితర అంశాలపై అధికారులతో సమీక్షించారు. మున్సిపల్, ఇరిగేషన్, విద్యుత్, డిజాస్టర్ మేనేజ్‌మెంట్, ఫైర్, పోలీస్ శాఖల అధికారులు, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ మాట్లాడుతూ గణేష్ ఉత్సవాలను అందరూ కలిసిమెలిసి ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని సూచించారు. నిమజ్జనం సందర్భంగా శోభాయాత్రలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ఉత్సవ కమిటీలు, భక్తులు పోలీసులకు సహకరించాలని కోరారు. ఉత్సవ కమిటీలు ముందస్తుగా నిమజ్జనానికి బయలుదేరి, వీలైనంత త్వరగా నిమజ్జనం పూర్తి చేసుకోవాలని సూచించారు. నిమజ్జనానికి వినియోగించే వాహనాలు పూర్తి కండిషన్‌లో ఉండాలని, వాహనాలపై పిల్లలను ఎక్కించరాదని స్పష్టం చేశారు. వృద్ధులు, మహిళలు నిమజ్జన ప్రదేశాలకు దూరంగా ఉండి భద్రతా సిబ్బందికి సహకరించాలని కోరారు.జిల్లా ఎస్పీ కె.నరసింహ మాట్లాడుతూ గణేష్ నిమజ్జనాల కోసం జిల్లాలో పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.నిమజ్జన ప్రదేశంలో క్రేన్లు, గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచినట్లు చెప్పారు.అన్ని కోణాల్లో భద్రతా చర్యలు చేపట్టి పటిష్టమైన బందోబస్తు నిర్వహిస్తామని తెలిపారు.యువత, ఉత్సవ కమిటీలు బాధ్యతాయుతంగా వ్యవహరించి, ఇతరులకు ఆదర్శంగా నిలవాలని సూచించారు.మున్సిపల్ చైర్ పర్సన్ మోరిశెట్టి నివేదిత లక్షాది మాట్లాడుతూ నిమజ్జన ప్రదేశంలో నీరు కలుషితం కాకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.చెత్తను ఎప్పటికప్పుడు తరలించేందుకు ప్రత్యేక వాహనాలను అందుబాటులో ఉంచినట్లు చెప్పారు.మున్సిపల్ సిబ్బందితో నిరంతరం పారిశుద్ధ్య పనులు చేపట్టి నిమజ్జన ప్రాంతాన్ని పరిశుభ్రంగా ఉంచుతామని తెలిపారు.గణేష్ నిమజ్జన కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో, ప్రశాంతంగా, సురక్షితంగా నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ అధికారులకు సహకరించాలని అధికారులు కోరారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ షఫీ ఉల్లా,ఆర్డిఓ వేణు మాధవ రావు, సూర్యాపేట డిఎస్పి ప్రసన్నకుమార్, పట్టణ, రూరల్ ఇన్స్పెక్టర్లు వెంకటయ్య, రాజశేఖర్, మున్సిపల్ కమిషనర్ హనుమంత్ రెడ్డి, ఫైర్ ఎస్ఐ జానయ్య, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు అనంతల కృపాకర్,సభ్యులు రంగరాజు రుక్మారావు, చల్లమల్ల నరసింహ, గండూరి రమేష్ తదితరులు పాల్గొన్నారు.



# అటవీ - రెవెన్యూ భూ సమస్యలను సమన్వయంతో పరిష్కరించాలి

- జిల్లా కలెక్టర్ అంకిత్



**భద్రాద్రి కొత్తగూడెం, సెప్టెంబర్ 21 (జనం సాక్షి) :** జిల్లాలో అటవీ, రెవెన్యూ భూ సమస్యలు, వివిధ అభివృద్ధి పనులకు అవసరమైన భూసేకరణ, భూ సర్వేలు, అటవీ భూముల సరిహద్దుల నిర్ధారణ, పోడు భూములు తదితర అంశాలపై జిల్లా కలెక్టర్ అంకిత్ అధ్యక్షతన సోమవారం ఐడీఓసీ కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ వేణుగోపాల్, ఐటీడీఏ పీఓ రాహుల్, భద్రాచలం సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ, జిల్లా అటవీ శాఖ అధికారి సిద్ధార్థ విక్రం సింగ్,అటవీ శాఖ అధికారులు, తహసీల్దార్లు, సర్వేయర్లు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు. అటవీ, రెవెన్యూ శాఖల మధ్య సమన్వయంతో భూ సమస్యలను క్షేత్రస్థాయిలో పరిష్కరించాలని కలెక్టర్ అంకిత్ ఆదేశించారు. కార్యాలయాల మధ్య లేఖల మార్పిడికే పరిమితం కాకుండా సంబంధిత అధికారులు సంయుక్తంగా క్షేత్రస్థాయిలో పర్యటించి రికార్డులు, వాస్తవ పరిస్థితులను పరిశీలించి సమస్యలకు పరిష్కారం చూపాలని సూచించారు. జాయింట్ సర్వేలను నిర్దిష్ట గడువులో పూర్తి చేసి స్పష్టమైన సమగ్ర నివేదికలు సమర్పించాలని ఆదేశించారు. పాపకొల్లు గ్రామంలోని అటవీ, ప్రభుత్వ, పట్టా భూముల సరిహద్దులు, పాత రికార్డులకు సంబంధించిన భూ వివాదాన్ని సమావేశంలో సమీక్షించారు. పాత ఖాస్రా పహాణీ, రెవెన్యూ రికార్డులు, ప్రస్తుత రికార్డులను పరిశీలించి వాస్తవ పరిస్థితులను నిర్ధారించాలని అధికారులను ఆదేశించారు. సర్వే నంబర్ 90తో పాటు ఇతర పెండింగ్ సర్వేలను కూడా పూర్తి చేయాలని సూచించారు. అశ్వాపురం పరిధిలోని తుమ్మలచెరువు, మామిళ్లగూడెం ప్రాంతాల్లో అటవీ సరిహద్దుకు వెలుపల ఉన్న భూములకు సంబంధించిన లబ్ధిదారుల దరఖాస్తులు, పట్టాదారు పాస్‌పుస్తకాల జారీ ప్రక్రియపై సమీక్షించారు. అర్హులైన గిరిజనులకు హక్కులు కల్పించే ప్రక్రియను వేగవంతం చేయాలని, పెండింగ్ దరఖాస్తులను నిబంధనల ప్రకారం త్వరగా పరిష్కరించాలని ఆదేశించారు. ఎండోమెంట్స్ భూముల సరిహద్దుల నిర్ధారణ, ఆక్రమణలకు సంబంధించిన అంశాలపై కూడా సమీక్ష జరిగింది. సంబంధిత భూములను గుర్తించి బౌండరీ ఫిక్సేషన్ పూర్తి చేయడానికి సర్వేయర్లను మోహరించాలని, దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలను క్షేత్రస్థాయిలో పరిష్కరించాలని కలెక్టర్ సూచించారు.

## వరి పంట పొలాలను పరిశీలించిన ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి



**పెన్ పహాడ్, సెప్టెంబర్ 21 (జనం సాక్షి) :** పెన్‌పహాడ్ మండలం నూర్జహన్ పేట, గూడెపుకుంట తండా గ్రామాలలో ఎండిన వరి పంట పొలాలను మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్ రెడ్డి సందర్శించారు. రైతులతో మాట్లాడి వారి కష్టాలు తెలుసుకున్నారు. అనంతరం చీదెళ్ల సబ్ స్టేషన్ లో లాగ్ బుక్ ను పరిశీలించి అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ రేవంత్ సర్కార్ పై నిప్పులు చెరిగారు.ఏ గ్రామంలో చూసినా వందల ఎకరాలు ఎండిపోయి కనిపిస్తున్నాయి. కాలం పరిస్థితి చూసి రైతులు సగం పొలాలే నాటు పెట్టుకుంటే, అందులో సగం పంటలు ఎండే పరిస్థితి వచ్చింది.అంగట్లో అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని ఉన్నట్లుంది ఈ ప్రభుత్వ పాలన, నీళ్లు, కరెంట్ పుష్కలంగా ఉన్నా కావాలనే పంటలు ఎండబెడుతున్నారు. ఉన్న కరెంటును కూడా సరిగ్గా ఇవ్వకపోవడంతో మోటార్లు కాలిపోతున్నాయి. ఇది రైతుల పట్ల కక్షపూరిత చర్య.ఈ రాష్ట్రానికి కాంగ్రెస్ పార్టీ దయ్యం, రేవంత్ భూతం పట్టింది. ఆ దయ్యాలను ఎలా వదిలించాలో రైతులకు తెలుసు, కన్నేపల్లి పంప్ హౌస్ ఇప్పుడు స్విచ్ ఆన్ చేసినా నీళ్లు సరిపడా ఉన్నాయి. 24 గంటల కరెంట్ ఇవ్వడానికి అన్ని అవకాశాలు ఉన్నాయి.కేసీఆర్, కేటీఆర్, హరీష్ రావు, నా మీద దాడులు చేస్తే ఎండిన పొలాలు మర్చిపోతాయా? మీ డైవర్షన్ పాలిటిక్స్ తో ప్రజల ఇబ్బందులు తొలగిపోతాయా?పంటలు చేతికొచ్చే సమయంలోనే కావాలనే ఎండబెడుతున్నారని, మీడియా సంస్థలు విలేకరులను గ్రామాల్లో తిప్పి వాస్తవాలు ప్రజలకు చూపాలని కోరారు. రైతులను ఇబ్బంది పెట్టిన ఏ ప్రభుత్వం ముందుకు సాగలేదని హెచ్చరించారు. కేసీఆర్ నాయకత్వంలో రాష్ట్రాన్ని సాధించుకుని పదేళ్లు సస్యశ్యామలంగా పంటలు పండించుకున్నామని, మళ్లీ పంటలు కాపాడుకునేందుకు పోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం బుద్ధి తెచ్చుకోకపోతే రైతుల పక్షాన దీ=ూ పోరాటం తప్పదని తేల్చి చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీలు నెమ్మది బిక్షం, జీడి బిక్షం మాజీ మండల పార్టీ అధ్యక్షులు దొంగరి యుగంధర్ , పిఏసి చైర్మన్లు వెన్న సీతారాం రెడ్డి నాతాల జానకి రామ్ రెడ్డి పార్టీ శ్రేణులు రైతులు పాల్గొన్నారు.

# ఎస్సీ ఎస్టీలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలి

- తెలంగాణ రాష్ట్ర షెడ్యూల్ కులాల,తెగల కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య



**భద్రాద్రి కొత్తగూడెం, సెప్టెంబర్ 21 (జనం సాక్షి) :** ఎస్సీ, ఎస్టీలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని అందుకోసం రాష్ట్ర ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశ పెట్టి అమలు చేస్తూ, రక్షణ చట్టాలను రూపొందించిందని తెలంగాణ రాష్ట్ర షెడ్యూల్ కులాల, తెగల కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అన్నారు. సోమవారం భద్రాద్రి జిల్లా ఐ.డీ.ఓ.సీ లో ల్యాండ్, సర్వీస్( ఆర్.ఓ.ఆర్), అట్రాసిటీస్ అంశాలపై అధికారులతో సమీక్షా సమావేశం ముగ్గురు కమీషన్ సభ్యులతో కలిసి నిర్వహించి మాట్లాడారు. రాష్ట్రంలోనే విస్తీర్ణంలో అతి పెద్ద ఏజెన్సీ జిల్లా భద్రాద్రి జిల్లా అని గుర్తుచేశారు. కమిషన్ సమావేశానికి జిల్లాకు రెండోసారి రావడం జిల్లా అధికారులు ఘనస్వాగతం పలకడం మర్చిపోలేని సంఘటనని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీల అభ్యున్నతి కోసం ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేస్తుందని, వాటిని అందిపుచ్చుకొని ఆర్థికంగా దినదినాభివృద్ధి చెందాలని సూచించారు. వివిధ శాఖల్లో పని చేస్తున్న ప్రభుత్వ ఎస్సీ, ఎస్టీల భూమి సమస్యలు, బ్యాక్ లాగ్ పోస్టులు వివరాలు, ఉద్యోగులు రక్షణ కోసం చట్టాలను, రోస్టర్ విధానాలు,రూపొందించి వాటిని పకడ్బందీగా అమలు చేసేందుకు కమిషన్ చర్యలు చేపడుతుందని గుర్తు చేశారు. ఎస్సీ, ఎస్టీ ప్రజల పైన ఉద్యోగులపైన ఎటువంటి వేధింపులు కానీ చిత్రహింసలు గాని ఇబ్బందులు గురి చేసిన శాఖ పరంగా కఠిన చర్యలు తీసుకుంటామని కమిషన్ చైర్మన్ హెచ్చరించారు. న్యాయం కోసం దరఖాస్తు చేసుకున్న ఎస్సీ, ఎస్టీ బాధితులకు ఎఫ్.ఐ.ఆర్, చార్జిషీట్, కమిషన్, కంపన్సేషన్ వరకు పారదర్శకంగా ఉండేందుకు అధికారులు పనిచేయాలని ఆదేశించారు. భద్రాద్రి జిల్లాకు శ్రీ సీతారామచంద్రస్వామి ఆశీస్సులు ఎల్లవేళలా ఉంటాయని, ఎన్నీ సమస్యలు ఉన్న వాటి పరిష్కారం ఆ రాములోరి దయ వలన సత్వరమే తీరిపోతాయని కమిషన్ చైర్మన్ పేర్కొన్నారు. దక్షిణ అయోధ్యగా పేరు గడించిన భద్రాచలం పుణ్యక్షేత్రాన్ని దర్శించుకోవడం ఎంతో భాగ్యంమన్నారు. అదేవిధంగా వివిధశాఖల అధికారుల నుంచి వివరాలు తోపాటు ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల నివేదిక రాష్ట్ర కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అడిగి తెలుసుకున్నారు. ఈ క్రమంలో భద్రాద్రి జిల్లా పోలీస్ శాఖ నివేదికను కమిషన్ చైర్మన్ అడుగగా 2014 నుంచి ఇప్పటివరకు జిల్లాలో 1115 ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదయాయని జిల్లా ఎస్పీ రోహిత్ రాజు వివరించారు. అందులో 51 కేసులు ప్రస్తుతం విచారణలో ఉన్నాయని, వాటిలో 20 కేసులో చార్జింగ్ చార్జిషీట్ చేశామని, రెండు హైకోర్టు స్టేలు ఉండగా, 9 కేసులు లీగల్ ఒపీనియన్ కోసం ఉన్నాయని, 20 పెండింగ్ కేసులు ప్రస్తుతం ఉన్నట్లు జిల్స్ ఎస్పీ వివరించారు. అనంతరం న్యాయంకోసం వచ్చిన ఎస్సీ, ఎస్టీ బాధితుల నుంచి కమిషన్ సభ్యులు లక్ష్మీనారాయణ, రాంబాబు నాయక్,నీలాదేవి,డీ.బీ.ఎఫ్ శంకర్ లతో కమిషన్ చైర్మన్ వెంకటయ్య దరఖాస్తులను స్వీకరించి సంబంధిత శాఖల అధికారులకు రిఫర్ చేసి ఎటువంటి నిర్లక్ష్యం, అలసత్వం ప్రదర్శించకుండా తక్షణమే సమస్యలు పరిష్కారం చేసేలా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. తొలుత రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ వెంకటయ్యకు భద్రాద్రి పోలీస్, ఏ.ఆర్ విభాగాల ఆధ్వర్యంలో గాడ్ ఆఫ్ హనర్ ఏర్పాటు చేసి ఘన స్వాగతం పలికారు.

ఈ సమావేశంలో భద్రాద్రి జిల్లా ఎస్పీ రోహిత్ రాజు, అదనపు కలెక్టర్ (రెవిన్యూ) వేణుగోపాల్, భద్రాచలం ఐటిడిఏ పి.ఓ రాహుల్, భద్రాచలం సబ్ కలెక్టర్ మృనాల్ శ్రేష్ట్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన,డీ. ఆర్.ఓ పద్మావతి, సిపిఓ సునీత, జిల్లా షెడ్యూలు కులముల అధికారిని శ్రీలత, కార్పొరేషన్ ఈ.డీ ఉపేందర్,జడ్పీ సీఈఓ నాగలక్ష్మి,డీపీఓ అనూష, డీ.ఏ.వో బాబురావు, విద్యుత్ శాఖ ఈ వివిధ శాఖల అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## రైతుల కోసం పోరాడితే అరెస్టులా..?

- మాజీ మంత్రి డా.సి.లక్ష్మారెడ్డి



**జడ్చర్ల, సెప్టెంబర్ 21 (జనంసాక్షి) :** రైతుల హక్కుల కోసం పోరాడుతున్న తమను అరెస్టు చేయడం ప్రభుత్వ నియంతృత్వానికి నిదర్శనమని మాజీ మంత్రి డాక్టర్ సి.లక్ష్మారెడ్డి మండిపడ్డారు. జూరాల ఆయకట్టు రైతులకు వెంటనే సాగునీరు విడుదల చేయాలని సోమవారం బీఆర్ఎస్ పార్టీ పిలుపునిచ్చిన ధర్నా కార్యక్రమాన్ని పోలీసులు అడ్డుకున్నారు. ఈ మేరకు జడ్చర్లలోని తిరుమలహిల్స్ నివాసంలో లక్ష్మారెడ్డిని పోలీసులు హౌస్ అరెస్టు చేయగా, ఉమ్మడి జిల్లావ్యాప్తంగా నాయకుల అక్రమ అరెస్టులను ఆయన తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా లక్ష్మారెడ్డి మాట్లాడుతూ జూరాల ప్రాజెక్టులో 8.5 టీఎంసీల నీళ్లు ఉన్నప్పటికీ, లక్షా పదివేల ఎకరాల పంటలకు సడన్‌గా నీటి విడుదలను నిలిపివేయడం దారుణమన్నారు. ఎగువన ఉన్న కర్ణాటక ప్రాజెక్టుల నుంచి అడిగైనా నీటిని రప్పించి ఎండిపోతున్న పంటలను వెంటనే కాపాడాలని డిమాండ్ చేశారు. రైతులపై శ్రద్ధ లేని కాంగ్రెస్ ప్రభుత్వంలో సాగునీటితో పాటు విద్యుత్ సమస్యలు కూడా తీవ్రమయ్యాయని, రోజుకు 6 గంటలకు మించి సరఫరా చేయడం లేదని ఆరోపించారు. ప్రభుత్వం వెంటనే స్పందించి పంటలను కాపాడాలని, పాలమూరు-రంగారెడ్డి పనులను పూర్తి చేయాలని డిమాండ్ చేశారు.




# సిమ్ దుర్వినియోగం చేస్తే 3 ఏళ్ల జైలు.. రూ.50 లక్షలు జరిమానా

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**
నకిలీ లేదా ఇతరుల గుర్తింపు పత్రాలతో సిమ్ కార్డులు తీసుకోవడం చట్టరీత్యా నేరమని టెలికాం విభాగం స్పష్టంచేసింది. సిమ్ కార్డులు, ఫోన్ల ఎఓఇఐ నంబర్లను ట్యాంపరింగ్ చేయడం టెలికమ్యూనికేషన్స్ చట్టం-2023 ప్రకారం తీవ్రమైన నేరంగా పరిగణిస్తామని హెచ్చరించింది. ఇటువంటి ఉల్లంఘనలకు పాల్పడితే గరిష్ఠంగా మూడేళ్ల వరకు జైలు శిక్ష, రూ.50 లక్షల వరకు జరిమానా విధించే అవకాశముందని పేర్కొంది. ఛత్తీస్‌గఢ్‌కు చెందిన ఓ పాయింట్ ఆఫ్ సేల్ ఏజెంట్ వద్ద ఇటీవల 25 సిమ్ కార్డులను డాట్ గుర్తించింది. పౌరుల సమాచారం లేకుండా వారి ధ్రువపత్రాలతో అక్రమంగా ఈ సిమ్‌కార్డులను యాక్టివేట్ చేసినట్లు దర్యాప్తులో తేలింది. వెంటనే సదరు ఏజెంట్‌ను బ్లాక్‌లిస్ట్‌లో పెట్టడంతో పాటు అనుమానాస్పద నంబర్లను రీ-వెరిఫికేషన్ చేసి డీయాక్టివేట్ చేసింది. ఈ నేపథ్యంలో సిమ్ కార్డు వినియోగం పట్ల పౌరులకు డాట్ అడ్వైజరీ జారీ చేసింది.

డాట్ కీలక సూచనలు

తమ పేరిట ఉన్న సిమ్ కార్డులను ఇతరులకు అద్దెకు ఇవ్వడం, బదిలీ చేయడం లేదా విక్రయించకూడదు. ఆ నంబర్లతో సైబర్ నేరాలు జరిగితే సబ్‌స్క్రైబర్‌పై చట్టపరమైన చర్యలుంటాయి.నకిలీ పత్రాలు, మోసపూరిత విధానాల ద్వారా సిమ్‌లు పొందకూడదు.కాలింగ్ లైన్ ఐడెంటిటీని మార్చే యాప్‌లు, వెబ్‌సైట్లు ఉపయోగించకూడదు.ట్యాంపరింగ్ చేసిన ఐఎంఈఐలు ఉండే మోడెమ్‌లు, సిమ్ బాక్స్‌లు వంటి పరికరాలను ఉపయోగించడం లేదా అసెంబుల్ చేయడం నిషిద్ధం

కనెక్షన్లు తెలుసుకోండి..

తమకు తెలీకుండానే జరిగే మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని పౌరులకు డాట్ సూచించింది. సంచార్ సాథీ పోర్టల్ లేదా మొబైల్ యాప్ ద్వారా తమ గుర్తింపుతో ఉన్న అన్ని మొబైల్ నంబర్‌లను క్రమం తప్పకుండా తనిఖీ చేసుకోవాలని సూచించింది. తెలియని లేదా అవసరం లేని నంబర్లను బ్లాక్ చేయడానికీ ఈ పోర్టల్‌ను వినియోగించుకోవచ్చని సూచించింది. మీ మొబైల్ హ్యాండ్‌సెట్ ప్రామాణికతను ధ్రువీకరించుకోవడానికి అదే వెబ్‌సైట్‌లో 'జెన్యూన్‌నెస్ ఆఫ్ మొబైల్ హ్యాండ్‌సెట్' సదుపాయం ఉపయోగపడుతుందని తెలిపింది.



# లాభాల్లో ముగిసిన సూచీలు

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు రాణించాయి అంతర్జాతీయ మార్కెట్ల నుంచి సానుకూల సంకేతాలు, చమురు ధరలు తగ్గుముఖం పట్టడం, ప్రపంచ బాండ్ల రాబడులు బలహీనపడటం మార్కెట్ల సెంటిమెంట్‌ను బలపరిచింది. దేశీయ ఈక్విటీ షేర్లలో విదేశీ పెట్టుబడుల ప్రవాహం కొనసాగడమూ కలిసొచ్చింది. దీంతో సూచీలు లాభాల్లో ముగిశాయి. సెన్సెక్స్ ఉదయం 74,535.18 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 74,294.96) లాభాల్లో ప్రారంభమైంది. రోజంతా సూచీ లాభాల్లోనే కదలాడింది. ఇంట్రాడేలో ఓ దశలో 700 పాయింట్ల వరకు ఎగబాకిన సూచీ.. చివరికి 564.03 పాయింట్ల లాభంతో 74,858.99 వద్ద ముగిసింది. నిఫ్టీ 67.90 పాయింట్లు పెరిగి 23,414.30 వద్ద స్థిరపడింది. డాలరుతో పోలిస్తే రూపాయి మారకం విలువ 95.80గా ఉంది. సెన్సెక్స్30లో భారతీ ఎయిర్‌టెల్, పవర్‌గ్రిడ్, ఇన్ఫోసిస్, అదానీ పోర్ట్స్, టాటా స్టీల్, బజాజ్ ఫిన్‌సర్వ్ షేర్లు మాత్రమే నష్టాలను చవిచూశాయి. మిగతా



కంపెనీల షేర్లన్నీ లాభాలను ఆర్జించాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ ధర 101.36 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. బంగారం ఔన్స్ ధర 4,350.74 డాలర్ల వద్ద కొనసాగుతోంది.

## గుడ్ల ధరలు

| హైదరాబాద్ | వరంగల్ |
|---|---|
| ₹ 5.40 | ₹ 5.42 |

## బంగారం ధరలు (10 గ్రాములు)

హైదరాబాద్

| ₹ 1,62,254 | ₹ 1,77,008 |
|---|---|
| (22 క్యారెట్లు) | (24 క్యారెట్లు) |

## వెండి ధరలు (కేజీ)

హైదరాబాద్

₹ 2,50,000

# టాటా సన్స్ వివాదం కోర్టుకెక్కితే.. ఖర్చు భరించేది ఎవరు..?

కార్పొరేట్ దిగ్గజం టాటా సన్స్‌లో బోర్డురూమ్ వివాదం రోజురోజుకీ ముదురుతోంది. ఈ కంపెనీఎగ్జిక్యూటివ్ ఛైర్మన్‌గా ఎన్.చంద్రశేఖరన్‌ను మరో అయిదేళ్ల కాలానికి తిరిగి నియమిస్తూ బోర్డు తీసుకున్న నిర్ణయం చట్టవిరుద్ధమని, అది చెల్లదని మెజారిటీ వాటాదారు అయిన టాటా ట్రస్ట్స్ పేర్కొంది. దీంతో ఈ వివాదం కోర్టుకెక్కే అవకాశాలు కన్పిస్తున్నాయి. మరి పరిష్కారం కోసం న్యాయస్థానానికి వెళితే ఆ ఖర్చులు భరించేది ఎవరన్నది చర్చనీయాంశంగా మారింది.టాటా ట్రస్ట్స్-టాటా సన్స్ వివాదానికి సంబంధించిన న్యాయపరమైన ఖర్చుల కోసం టాటా ఎడ్యుకేషన్ అండ్ డెవలప్‌మెంట్ ట్రస్ట్ నిధులను వినియోగించే ఏ అవకాశాన్నైనా.. తాము వ్యతిరేకిస్తున్నట్లు ట్రస్టీ మెహ్లీ మిస్త్రీ వెల్లడించారు. ఈ మేరకు టాటా ట్రస్ట్స్ సీఈఓ సిద్ధార్థ శర్మతో పాటు ట్రస్ట్స్ ఛైర్మన్ నోయెల్ టాటాకు ఆయన మెయిల్ పంపినట్లు తెలిసింది. “కంపెనీ 150 ఏళ్ల చరిత్రలో ఇలాంటి వివాదం అనూహ్యమైనది. దీనిపై మేం విచారం వ్యక్తం చేస్తున్నాం. అయితే, టాటా సన్స్‌లో మా ట్రస్ట్ వాటాదారుగా లేదు. అందువల్ల ఈ వివాదంతో మాకు సంబంధం లేదు. న్యాయపరమైన ఖర్చులకు మేం వెచ్చించలేం” అని మెహ్లీ మిస్త్రీ స్పష్టం చేశారు.

**నాడు రూ.200కోట్ల ఖర్చు..**

టాటా ట్రస్ట్స్ గతంలోనూ పలుమార్లు న్యాయపరమైన



ఖర్చులను ఎదుర్కొన్నాయి. మాజీ ఛైర్మన్ సైరస్ మిస్త్రీతో టాటా గ్రూప్‌నకు నెలకొన్న సుదీర్ఘ న్యాయ వ్యవహారంలో.. టాటాసన్స్, టాటాట్రస్ట్స్ సంయుక్తంగా రూ.200 కోట్లు వెచ్చించినట్లు మీడియా కథనాలు వెల్లడించాయి. సైరస్ మిస్త్రీ వైపు మరో రూ.50 కోట్లు ఖర్చు అయినట్లు సమాచారం. దీన్ని దృష్టిలో ఉంచుకునే ట్రస్టీ.. తాజా మెయిల్ పంపినట్లు తెలుస్తోంది.

**సింఘ్వీ వర్సెస్ సాల్వే..**

తాజా వివాదంలో టాటా ట్రస్ట్స్ వైపు సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీ వాదించేందుకు సిద్ధమయ్యారు. అటు టాటా సన్స్ ఛైర్మన్ ఎన్. చంద్రశేఖరన్ తరఫున మరో సీనియర్ న్యాయవాది హరీష్ సాల్వే వాదించనున్నట్లు సమాచారం. ఇప్పటికే ఈ లాయర్లు ఇద్దరూ టాటా గ్రూప్ వివాదంపై తమతమ అభిప్రాయాలను మీడియా ముందు వ్యక్తపరుస్తున్నారు. ఈ నెల 17న జరిగిన బోర్డు సమావేశంలో చంద్రశేఖరన్ పదవీకాలాన్ని పొడిగించే ప్రతిపాదనపై ఇద్దరు టాటా ట్రస్ట్స్ నామినీ డైరెక్టర్లలో నోయల్ టాటా వ్యతిరేకంగా ఓటు వేశారు. మరో ట్రస్ట్ నామినీ వేణు శ్రీనివాసన్ మాత్రం అనుకూలంగా ఓటేశారు. దీంతో కాస్టింగ్ ఓటు వినియోగించి ప్రతిపాదనను బోర్డు అంగీకరించింది.

# రూ.20 వేలకే లావా కొత్త స్మార్ట్‌ఫోన్

మెమొరీ చిప్‌లు ప్రియం కావడంతో స్మార్ట్‌ఫోన్ ధరలు ఆకాశాన్ని తాకుతున్నాయి. ఎంట్రీ లెవల్ ఫీచర్లు కలిగిన స్మార్ట్‌ఫోన్లకు కూడా రూ.15వేల వరకు పెట్టాల్సి వస్తోంది. రూ.30 వేలు బడ్జెట్ పెట్టినా ఎల్‌సీడీ డిస్‌ప్లే కలిగిన ఫోన్లే దిక్కు. ఈ పరిస్థితుల్లో దేశీయ స్మార్ట్‌ఫోన్ తయారీ కంపెనీ లావా(ఒంఎం) బడ్జెట్ ధరలో విరాట్ కర్వ్ 5జీ పేరిట కొత్త స్మార్ట్‌ఫోన్‌ను లాంచ్ చేసింది. 3డీ కర్వ్‌డ్ అమోలెడ్ డిస్‌ప్లేతో దీన్ని తీసుకొచ్చింది.లావా విరాట్ కర్వ్ 5జీ స్మార్ట్‌ఫోన్ ఆండ్రాయిడ్ 16పై పనిచేస్తుంది. రెండేళ్లపాటు మేజర్ ఓఎస్ అప్‌డేట్స్, మూడేళ్ల పాటు సెక్యూరిటీ అప్‌డేట్స్ ఇస్తామని కంపెనీ చెబుతోంది. ఇందులో 6.67 అంగుళాల ఫుల్ హెచ్‌డీ+ 3డీ కర్వ్‌డ్ అమోలెడ్ డిస్‌ప్లే ఇచ్చారు. 120 ఊళి రిఫ్రెష్ రేటు ఉంది. 1100 నిట్స్ పీక్ బ్రైట్‌నెస్‌కు సపోర్ట్ చేస్తుంది. వెనుక వైపు మినీ డిస్‌ప్లే కూడా ఇచ్చారు. దీని సాయంతో వాల్యూమ్ లెవల్, బ్యాటరీ పర్సంటేజీ, టైమ్, నోటిఫికేషన్లు వంటివి చూసుకోవచ్చు.

చైనా 'యూట్యూబ్'పై మన కంటెంట్ క్రియేటర్ల ఆసక్తి

ఈ స్మార్ట్‌ఫోన్‌లో మీడియాటెక్ డైమెన్సిటీ 7100 ప్రాసెసర్ అమర్చారు. 6జీబీ ర్యామ్‌తో వస్తున్న ఈ స్మార్ట్‌ఫోన్‌లో 6జీబీ వర్చువల్ ర్యామ్ సదుపాయం కూడా ఉంది. 50 ఎంపీ ప్రధాన కెమెరా, సెల్ఫీల కోసం 13 ఎంపీ కెమెరా ఇచ్చారు. ఐఆర్ బ్లాస్టర్ కూడా ఉంది. ఇన్‌డిస్‌ప్లే ఫింగర్ ప్రింట్ సెన్సర్, ఫేస్ అన్‌లాక్ వంటి సదుపాయాలు ఉన్నాయి. 6000 ఎంఏహెచ్ బ్యాటరీ




45చి ఫాస్ట్ ఛార్జింగ్‌కు సపోర్ట్ చేస్తుంది. బాక్సుతో పాటు 33చి ఫాస్ట్ ఛార్జర్‌ను అందిస్తున్నారు.ధర విషయానికొస్తే.. ఇది కేవలం సింగిల్ వేరియంట్‌లో లభిస్తుంది. 6జీబీ ర్యామ్, 128జీబీ స్టోరేజీ కలిగిన ఈ స్మార్ట్‌ఫోన్ ధరను కంపెనీ రూ.23,999గా కంపెనీ నిర్ణయించింది. బ్యాంక్ ఆఫర్‌తో రూ.19,999కు కొనుగోలు చేయొచ్చని కంపెనీ చెబుతోంది. ఎల్లోరా స్లేట్, హెరిటేజ్ ఇండిగో, మాక్రానా ఐవరీ రంగుల్లో లభిస్తుంది. ఫ్లిప్‌కార్ట్‌లో సెప్టెంబర్ 28 నుంచి విక్రయానికి రానుంది.

# చైనా 'యూట్యూబ్'పై మన కంటెంట్ క్రియేటర్ల ఆసక్తి

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**
కంటెంట్ క్రియేటర్లు కొత్త మార్గాలను అన్వేషిస్తున్నారు. యూట్యూబ్ వంటి ప్లాట్‌ఫామ్‌లు నిబంధనలు కఠినతరం చేస్తుండడంతో ప్రత్యామ్నాయ మార్గాల కోసం గాలిస్తున్నారు. ఈ క్రమంలోనే చైనాకు చెందిన ప్రముఖ వీడియో షేరింగ్ ప్లాట్‌ఫామ్‌పై ఆసక్తి చూపుతున్నారు. చైనా యూట్యూబ్‌గా పేరొందిన ఈ ప్లాట్‌ఫామ్‌లో అనధికారికంగా కంటెంట్ పోస్ట్ చేస్తున్నారు.చైనాలో 2009లో ప్రారంభమైందీ ప్లాట్‌ఫామ్. తొలుత యానిమే, కామిక్స్, గేమింగ్ కంటెంట్‌తో మొదలైంది. ప్రస్తుతం టెక్నాలజీ, ఎంటర్‌టైన్‌మెంట్, లైఫ్‌స్టైల్, నాలెడ్జ్ వంటి విభిన్న రంగాలకు విస్తరించింది. 2025 మూడో త్రైమాసికం నాటికి దీనికి 37.6 కోట్ల మంత్లీ యాక్టివ్ యూజర్లు ఉన్నారు. వినియోగదారులు రోజుకు సగటున 112 నిమిషాలు ఇందులో గడుపుతున్నారని కంపెనీ చెబుతోంది.యూట్యూబ్ వంటి ప్లాట్‌ఫామ్‌లకు పోటీగా చైనాకు చెందిన బిలిబిలి.. అంతర్జాతీయంగా విస్తరించేందుకు సన్నద్ధమవుతోంది. ఇండోనేసియా, ఫిలిప్పీన్స్, థాయ్‌లాండ్, వియత్నాం, సింగపూర్, మలేసియా వంటి దేశాలకు ఇప్పటికే విస్తరించింది. ఆండ్రాయిడ్ యూజర్ల కోసం ఇంటర్నేషనల్ యాప్‌ను కూడా తీసుకొచ్చింది. మరికొన్ని దేశాలకూ విస్తరిస్తామని కంపెనీ ప్రకటించింది. అయితే, ఆ జాబితాలో ప్రస్తుతానికి భారత్ లేదు.

భారత క్రియేటర్ల ఆసక్తి

భారత్‌కు చెందిన కొంతమంది క్రియేటర్లు ఇప్పటికే బిలిబిలిలో కంటెంట్‌ను పోస్ట్ చేయడం మొదలుపెట్టారు. ఝార్ఖండ్‌కు చెందిన ట్రావెల్ వ్లాగర్ నవనీత్‌కుమార్ తివారీ ఇటీవల బిలిబిలిలో వీడియో పోస్ట్‌చేసినట్లు సామాజిక మాధ్యమాల్లో పంచుకున్నాడు.




15 రోజుల వ్యవధిలోనే అక్కడి నుంచి మంచి స్పందన వచ్చిందని, వ్యూస్ కూడా బాగున్నాయని పేర్కొన్నాడు. మరికొందరు కంటెంట్ క్రియేటర్లు ఆయన మార్గాన్ని అనుసరిస్తున్నారు. భారత్‌లో అధికారికంగా అందుబాటులో లేకపోవడంతో వీపీఎన్, సైడ్‌లోడెడ్ ఏపీకే (ఒఖఐ), ఫోన్ లొకేషన్ సెట్టింగ్‌లు మార్చడం వంటి ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా ఈ ప్లాట్‌ఫామ్‌ను కంటెంట్ క్రియేటర్లు వినియోగిస్తున్నారు.

కొత్త ఆదాయ మార్గం

యూట్యూబ్, ఇన్‌స్టాగ్రామ్‌లకు అదనంగా మరో ప్లాట్‌ఫామ్ ద్వారా కొత్త ఆడియన్స్‌ను చేరుకోవడానికి ఇది ఉపయోగపడుతుందని కంటెంట్ క్రియేటర్లు భావిస్తున్నారు. ముఖ్యంగా గేమింగ్, టెక్నాలజీ, ట్రావెల్, నాలెడ్జ్ ఆధారిత కంటెంట్ రూపొందించే వారికి ఇది విస్తృత అవకాశాలను కల్పిస్తుండడం ఇందుక్కారణం. ఇప్పటికే ఉన్న వీడియోలతోనే అంతర్జాతీయ ప్రేక్షకులను ఆకర్షించేందుకు దీన్నో ప్రత్యామ్నాయ మార్గంగా పరిశీలిస్తున్నారు. దీనికితోడు యూట్యూబ్ తన మానిటైజేషన్ ప్రోగ్రామ్‌ను కఠినతరం చేయడమూ దీనికి మరో కారణంగా టెక్ నిపుణులు చెబుతున్నారు. చైనాతో ఘర్షణల కారణంగా టిక్‌టాక్‌పై భారత్ నిషేధం విధించింది. ఇప్పుడు ఇరు దేశాల మధ్య సంబంధాలు కాస్త మెరుగుపడ్డాయి. ఈ నేపథ్యంలో భారత్‌లోకి బిలిబిలి ఎంట్రీకి అవకాశం లభిస్తుందా? లేదా? అనేది తెలియాలంటే కొన్ని రోజులు వేచి చూడాల్సిందే అంటున్నారు విశ్లేషకులు.

# సింగపూర్ ఎయిర్‌లైన్స్ టాప్.. ఎయిరిండియా, ఇండిగో స్థానమెంత?

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**
ప్రపంచంలోనే అత్యుత్తమ విమానయాన సంస్థగా సింగపూర్ ఎయిర్‌లైన్స్ అగ్రస్థానంలో నిలిచింది. ఖతార్ ఎయిర్‌వేస్, కాథే పసిఫిక్ రెండు, మూడు స్థానాల్లో నిలిచాయి. ఈ మేరకు స్కైట్రాక్స్ వార్షిక జాబితాను విడుదల చేసింది. భారత్‌కు చెందిన ఎయిరిండియా సంస్థ 57వ స్థానంలో నిలవగా.. ఇండిగో 61వ స్థానం సాధించింది. 2025 సెప్టెంబర్ 25 నుంచి 2026 ఆగస్టు మధ్య 300 విమానయాన సంస్థలకు సంబంధించి ప్రయాణికుల నుంచి స్వీకరించిన అభిప్రాయాల ఆధారంగా ఈ నివేదికను స్కైట్రాక్స్ రూపొందించింది.2025లో రెండో స్థానంలో ఉన్న సింగపూర్ ఎయిర్‌లైన్స్ ఈ సారి అగ్రస్థానానికి చేరుకోవడం విశేషం. అదే సమయంలో ఖతార్ ఎయిర్‌వేస్ మొదటి స్థానం నుంచి రెండో స్థానానికి పడిపోయింది. కాథే పసిఫిక్ మాత్రం తన స్థానాన్ని నిలుపుకొంది. భారత్ తరఫున ఎయిరిండియా 57వ



స్థానంలో నిలిచింది. 2025తో పోలిస్తే 25 స్థానాలను మెరుగుపరుచుకుంది. ఇండిగో గతేడాదితో పోలిస్తే 22 స్థానాలు కోల్పోయి 61వ స్థానానికి దిగజారింది.

చైనా 'యూట్యూబ్'పై మన కంటెంట్ క్రియేటర్ల ఆసక్తి

భారత్, దక్షిణాసియా ప్రాంతీయ ర్యాంకింగ్స్‌నూ స్కైట్రాక్స్ ప్రకటించింది. ఇందులో ఎయిరిండియా, ఇండిగో ఒకట్రెండు స్థానాల్లో నిలిచాయి. ఆకాశ ఎయిర్, ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్, శ్రీలంకన్ ఎయిర్‌లైన్స్, స్పైస్‌జెట్, బియాండ్, బిమన్ బంగ్లాదేశ్ ఎయిర్‌లైన్స్, పాకిస్థాన్ ఇంటర్నేషనల్ ఎయిర్‌లైన్స్, మాల్దీవియన్ విమాన సంస్థలు టాప్-10 స్థానాల్లో ఉన్నాయి. భారత్‌కు చెందిన ఎయిరిండియా, ఇండిగో మాత్రమే గ్లోబల్ ర్యాంకింగ్స్‌లో చోటు దక్కించుకున్నాయి. ఆకాశ ఎయిర్, ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్, స్పైస్‌జెట్‌కు గ్లోబల్ టాప్-100లో చోటు దక్కలేదు.

# మళ్లీ చిక్కుల్లో సోనియా


**ఓటరు జాబితాలో పేరు అంశంపై దర్యాప్తు చేపట్టిన ఢిల్లీఈ న్యాయస్థానం**

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**ఓటరు జాబితాలో పేరు అంశంలో కాంగ్రెస్ అగ్రనాయకురాలు సోనియా గాంధీకి మళ్లీ చిక్కులు ఎదురయ్యాయి. భారత పౌరసత్వం పొందడానికి మూడేళ్ల ముందే 1980లో ఓటర్‌గా రిజిస్టర్ చేసుకున్నారని ఆరోపిస్తూ.. గతేడాది కోర్టులో పిటిషన్ దాఖలయ్యింది. ఆమె ఎన్నికల చట్టాన్ని ఉల్లంఘించారని, ఈ వ్యవహారంలో ఎఫ్ఐఆర్ నమోదు చేసేలా ఆదేశాలు ఇవ్వాలని పిటిషనర్ కోరారు. ఆ పిటిషన్‌ను మేజిస్ట్రియల్ కోర్టు తిరస్కరించింది. ఆ ఉత్తర్వును సవాల్ చేస్తూ దాఖలైన రివిజన్ పిటిషన్‌పై తాజాగా దర్యాప్తు చేపట్టిన దిల్లీ న్యాయస్థానం.. ఆ తీర్పును పక్కనబెట్టింది. దీంతో సోనియా పౌరసత్వ అంశంపై దర్యాప్తునకు మార్గం సుగమం అయ్యింది. మేజిస్ట్రేట్ కోర్టు ఉత్తర్వులు సరైన వివరణ లేనివని పేర్కొంటూ ప్రత్యేక న్యాయమూర్తి విశాల్ గోగ్నే వాటిని కొట్టివేశారు. చట్టపరమైన నియమాలు పాటించకపోవడం, సంబంధిత అధికారి వాదనలను వినకపోవడం వంటి అనేక లోపాలు ఈ ఉత్తర్వులో ఉన్నట్లు గుర్తించామన్నారు.తదుపరి విచారణను సెప్టెంబర్ 29కి వాయిదా వేశారు.

పెన్షన్ కార్డు పేరుతో పెన్షనర్లకు గాలం..

# సైబర్ నేరగాళ్ల కొత్త పన్నాగం

సైబర్ నేరగాళ్లు రోజురోజుకూ కొత్త వ్యూహాలు పన్నుతున్నారు అమాయకులను ఆసరాగా చేసుకొని రూ.లక్షల కొద్దీ నగదు దోచేస్తున్నారు. కేటుగాళ్లు కొత్తగా పెన్షనర్లను లక్ష్యంగా చేసుకుంటున్నారు. పెన్షన్ కార్డు పేరిట సరికొత్త మోసాలకు తెరలేపారు.మహారాష్ట్రలో ఇటీవల ఇద్దరు విశ్రాంత ఉద్యోగులు సైబర్ వలలో చిక్కి దాదాపు రూ.37 లక్షలు పోగొట్టుకున్నారు. నాగ్‌పుర్‌లోని మహేంద్ర నగర్‌కు చెందిన 70 ఏళ్ల వృద్ధుడి నుంచి కూడా ఇలానే రూ.5 లక్షలను సైబర్ నేరగాళ్లు కాజేశారు. పెన్షనర్లను ఆకర్షించడానికి పెన్షన్ కార్డులతో పలు లాభాలు ఉన్నాయంటూ బ్యాంకుల లోగోలతో సోషల్ మీడియాలో ప్రకటనలు ఇస్తున్నారు. వాటికి ఆకర్షితులైన వారి దగ్గరి నుంచి బ్యాంకు ప్రతినిధులమంటూ చెప్పుకొని.. పెన్షన్ డాక్యుమెంట్ల సమాచారం కోసం నకిలీ లింకులు పంపుతున్నారు. బ్యాంకు ఖాతా, సీవీవీ వివరాలను లాగేస్తున్నారు. ఒక్కసారి ఆ డేటా వారి చేతికి రాగానే గంటల వ్యవధిలోనే సొమ్మును బదిలీ చేసుకుంటున్నారు. ఇలాంటి మోసపూరిత ప్రకటనల పట్ల జాగ్రత్తగా ఉండాలని హోంమంత్రిత్వ శాఖ పరిధిలోని సైబర్‌క్రైమ్ విభాగం 'సైబర్ దోస్త్' ఎక్స్ వేదికగా హెచ్చరించింది. సామాజిక మాధ్యమాల్లో వచ్చే ప్రకటనలను ఒకటికి రెండుసార్లు బ్యాంక్ అధికారిక వెబ్‌సైట్ లేదా బ్యాంకు శాఖలను సంప్రదించి ధ్రువీకరించుకోవాలని సూచించింది.






# దగ్గు మందు సీసాలపై హెచ్చరిక!

**నాలుగేళ్లలోపు చిన్నారులకు వాడకుండా చూసేందుకే..**

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**
ఇప్పటివరకు సిగరెట్లు, గుట్కా, మద్యం సీసాలపై ముద్రిస్తున్న 'ఆరోగ్యానికి హానికరం' అనే హెచ్చరికల తరహాలోనే దగ్గుమందు సీసాలపైనా 'నాలుగేళ్లలోపు చిన్నారుల ఆరోగ్యానికి ప్రమాదకరం' అంటూ ఎర్ర అక్షరాలతో ముద్రించేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోందని సమాచారం. 2025 అక్టోబరులోనే డైరెక్టరేట్ ఆఫ్ జనరల్ ఆఫ్ హెల్త్ సర్వీసెస్ (డీజీహెచ్ఎస్) హెచ్చరికలు చేసినా కూడా, చిన్నారులకు దగ్గు మందు వాడకం కొనసాగుతోందని గమనించినందునే.. ఔషధ నియంత్రణ సంస్థ తాజా చర్యలకు ఉపక్రమించనుందని తెలుస్తోంది. వైద్యులు ప్రిస్క్రైబ్ చేయకుండానే, ఔషధ దుకాణాల్లో కొనుగోలు చేసి, దగ్గు మందును చిన్నారులకు వాడటమూ మనదేశంలో ఎక్కువే. ఈ నేపథ్యంలోనే పలు చర్యలు తీసుకుంటున్నారు.శిశువులు, తప్పటడుగులు వేసే చిన్నారులకు దగ్గుమందు ఇవ్వడాన్ని నిరుత్సాహపరిచేలా 'సీసాలపై ఉండే లేబుళ్లలో మార్పులు చేయాలనే' ప్రతిపాదనను భారత ఔషధ నియంత్రణ సంస్థ పరిశీలిస్తోంది. పాఠశాల వయస్సు పిల్లల చిత్రాన్ని దగ్గుమందు సీసా ప్యాకేజింగ్‌పై ముద్రించడం ద్వారా, అంతకంటే చిన్నపిల్లలకు వాడొద్దనే సందేశాన్ని స్పష్టంగా తెలియజేయాలని భావిస్తోంది. 'నాలుగేళ్లలోపు చిన్నారులకు వాడొద్దంటూ' ఎరుపు రంగులో హెచ్చరిక ముద్రించాలన్నదీ ప్రణాళిక. తద్వారా ఈ ఉత్పత్తి పెద్ద పిల్లల కోసం ఉద్దేశించినదని తెలియచేయొచ్చన్నది యోచిస్తున్నారు. ఈ ప్రతిపాదనను పరిశీలన కోసం డ్రగ్స్ కన్సల్టేటివ్ కమిటీకి సమర్పించారు. ఇందుకోసం 1945 నాటి డ్రగ్స్ రూల్స్‌లోని 96 నిబంధనావళిలో మార్పులు చేయాలని ప్రతిపాదించారు.ఈ ఏడాది జూన్‌లో కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ ఔషధ నిబంధనావళిలో మార్పులు చేసింది. దగ్గుమందుతో పాటు సిరప్ రూపంలో ఉండే మందులను ఓవర్-ది-కౌంటర్ (ఓటీసీ) విభాగం నుంచి తొలగించింది. ఈ మందులను కొనుగోలు చేయాలంటే వైద్యుడి ప్రిస్క్రిప్షన్ తప్పనిసరి అని ప్రకటించింది.

# 2 నెలల వ్యవధిలో.. యాపిల్‌లో రెండోసారి లేఆఫ్‌లు..!

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**ప్రముఖ టెక్ సంస్థ యాపిల్ మరోసారి లేఆఫ్‌లు ప్రకటించినట్లు సమాచారం. రెండు నెలల వ్యవధిలో రెండోసారి ఉద్యోగాలకు కోతపెట్టినట్లు అంతర్జాతీయ మీడియా కథనం వెల్లడించింది. ఈసారి ఫిట్‌నెస్+ ఆడియో బృందంలోని పలువురిని తొలగించినట్లు పేర్కొంది. గతవారమే ఈ లేఆఫ్‌లు ఇచ్చినట్లు వెల్లడించింది.నడిచేటప్పుడు వినడానికి, రన్నింగ్ అలవాటును మెరుగుపరుచుకోవడం కోసం డిజైన్ చేసిన టైమ్ టు వాక్, టైమ్ టు రన్ కంటెంట్‌పై పనిచేసే ఉద్యోగులు ఇందులో ఉన్నారు. ప్రస్తుతానికి ఈ ఫీచర్లను పూర్తిగా నిలిపివేయలేదు. ఆగస్టులో యాపిల్ (ఒజూజూశ్రీవ) సంస్థ 200 మందికి పైగా



ఉద్యోగులను తొలగించిన సంగతి తెలిసిందే. అప్పుడు సిరి, విజన్ ప్రో, ఇంటెలిజెంట్ సిస్టమ్స్ ఎక్స్‌పీరియన్స్ బృంద సభ్యులను తొలగించింది.

# పెండింగ్ దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలి

- వివిధ సమస్యలపై ప్రజావాణిలో 117 దరఖాస్తులు
- జిల్లా కలెక్టర్ దీపక్ తివారి

వికారాబాద్ జిల్లా బ్యూరో (జనం సాక్షి):



ప్రజా వాణి కార్యక్రమంలో దరఖాస్తులు స్వీకరించిన జిల్లా కలెక్టర్ దీపక్ తివారి స్వీకరించారు. ప్రజావాణి దరఖాస్తులను అత్యంత ప్రాధాన్యత నిచ్చి , పెండింగ్ ఉంచకుండా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ సమావేశము హాలు నందు నిర్వహించిన ప్రజా వాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ప్రజల నుంచి వివిధ సమస్యలకు సంబంధించిన దరఖాస్తులను స్వీకరించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకు వచ్చారు. భూ సమస్యలు, పింఛన్లు, ప్రభుత్వ సంక్షేమ పథకాలు, విద్య, వైద్యం, ఉపాధి, రహదారులు, గ్రామ పంచాయతీ, హౌసింగ్, తదితర అంశాలకు సంబంధించిన 117 వినతులను సమర్పించారు.ప్రజల నుంచి స్వీకరించిన ప్రతి దరఖాస్తును సంబంధిత శాఖల అధికారులకు పంపించి, నిబంధనల ప్రకారం పరిశీలించి సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, దరఖాస్తులపై నిర్ణీత గడువులోగా చర్యలు తీసుకోవాలని సూచించారు.
ప్రజా వాణి కార్యక్రమం ద్వారా ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కరించేందుకు ప్రభుత్వం కల్పించిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ వెంకటాచారి, ట్రైనీ కలెక్టర్ సచిన్ బస్వరాజ్ గుట్టూర్,డి ఆర్ ఓ స్వర్ణ లత, జాడ్ పిసిఇఓ సుధీర్, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.






# నారాయణపూర్ గ్రామస్తులకు న్యాయం చేస్తాం

- ఆందోళన చెందొద్దు.. సంయమనం పాటించండి
- సమస్యను మంత్రి పొంగులేటి దృష్టికి తీసుకెళ్తా
- ముంపు ప్రభావంపై సమగ్ర నివేదిక సిద్ధం చేస్తాం
- భూసేకరణకు సహకరించాలి: కలెక్టర్

కరీంనగర్ బ్యూరో, సెప్టెంబర్ 21 (జనంసాక్షి):
నారాయణపూర్ రిజర్వాయర్ ప్రభావంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న గ్రామస్తులకు ప్రభుత్వం న్యాయం చేసేలా కృషి చేస్తామని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రాతో కలిసి గంగాధర మండలం నారాయణపూర్ గ్రామస్తులతో సమావేశమై వారి సమస్యలను విన్నారు. గ్రామాన్ని ముంపు గ్రామంగా ప్రకటించే అంశాన్ని ప్రభుత్వానికి నివేదించాలని కలెక్టర్‌ను ఎమ్మెల్యే కోరారు. అలా సాధ్యం కాకపోతే అనువైన ప్రాంతంలో ఇంటి స్థలాలు, ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. నారాయణపూర్ సమస్యను పలుమార్లు అసెంబ్లీలో ప్రస్తావించడంతోపాటు మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని గ్రామానికి తీసుకొచ్చానని, తాజాగా రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి దృష్టికి కూడా తీసుకెళ్లానని తెలిపారు. గ్రామస్తులు ఆందోళన చెందకుండా సంయమనం పాటించాలని, సమస్య పరిష్కారానికి ప్రభుత్వంతో కలిసి పనిచేద్దామని కోరారు.
రిజర్వాయర్ సర్వే ప్రారంభం నుంచి ఇప్పటివరకు జరిగిన పరిణామాలను పరిశీలించి సమగ్ర నివేదికను ప్రభుత్వానికి సమర్పిస్తామని కలెక్టర్ చిత్రా మిశ్రా తెలిపారు. రెవెన్యూ, భూ సర్వే, నీటిపారుదల శాఖల నుంచి వివరాలు సేకరించి కమిటీ ద్వారా గ్రామంపై ముంపు ప్రభావం, ప్రజలకు కలిగే నష్టాన్ని శాస్త్రీయంగా అంచనా వేస్తామని చెప్పారు. పాక్షికంగా ముంపునకు గురయ్యే వారికి తగిన పరిహారం అందేలా ప్రభుత్వానికి నివేదిస్తామన్నారు. భూసేకరణకు గ్రామస్తులు సహకరించాలని, అభ్యంతరాలుంటే రాతపూర్వకంగా సమర్పిస్తే విచారణ జరిపి న్యాయం చేస్తామని స్పష్టం చేశారు. సమావేశంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, ఆర్డీవో మహేశ్వర్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రాజేశ్వరి, తహసీల్దార్ రజిత తదితరులు పాల్గొన్నారు.

# హైకోర్టు తీర్పుతో రవీందర్‌రావుకు మళ్లీ పగ్గాలు

**కరీంనగర్ కేంద్ర సహకార బ్యాంక్ చైర్మన్‌గా పునఃబాధ్యతలు**



గంభీరావుపేట సెప్టెంబర్ 21 జనం సాక్షి: తెలంగాణ హైకోర్టు ఆదేశాలతో కరీంనగర్ కేంద్ర సహకార బ్యాంక్ (కేడీసీసీబీ) చైర్మన్‌గా కొండూరు రవీందర్‌రావు సోమవారం తిరిగి బాధ్యతలు స్వీకరించారు. దీంతో ఆయన మరోసారి బ్యాంకు చైర్మన్‌గా కొనసాగనున్నారు. కేంద్ర సహకార బ్యాంకులకు సంబంధించి ప్రభుత్వం జారీ చేసిన జీఓ.ఆర్టీ నం. 598ను రద్దు చేస్తూ, గతంలో అమల్లో ఉన్న జీఓ.ఆర్టీ నం.386ను కొనసాగించాలని హైకోర్టు తీర్పు ఇచ్చింది. ఈ తీర్పు నేపథ్యంలో రవీందర్‌రావు తిరిగి చైర్మన్ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా బ్యాంకు అధికారులు, సిబ్బంది, నాయకులు రవీందర్‌రావును కలిసి అభినందనలు తెలిపారు.

# బాధితుల సమస్యల పరిష్కారమే లక్ష్యం

**గ్రీవెన్స్ డేలో 19 ఫిర్యాదుల స్వీకరణ..త్వరిత పరిష్కారానికి పోలీసు అధికారులకు ఆదేశాలు**



రాజన్న సిరిసిల్ల బ్యూరో, సెప్టెంబర్ 21 (జనంసాక్షి): బాధితుల సమస్యలను సత్వరమే పరిష్కరించి ప్రజలకు పోలీసు శాఖపై నమ్మకం కల్పించడమే గ్రీవెన్స్ డే లక్ష్యమని జిల్లా ఎస్పీ మహేష్ బి. గీతే తెలిపారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్ డేలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి 19 ఫిర్యాదులను స్వీకరించారు. ఆయా పోలీస్‌స్టేషన్ల అధికారులతో ఫోన్‌లో మాట్లాడి ఫిర్యాదులను చట్టపరంగా త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. పోలీస్‌స్టేషన్లకు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదగా వ్యవహరించి, అవసరమైతే క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టి చట్ట ప్రకారం న్యాయం చేయాలని సూచించారు. గ్రీవెన్స్ డేలో స్వీకరించిన ఫిర్యాదులను ఆన్‌లైన్‌లో నమోదు చేసి, వాటి పరిష్కారంపై ఎప్పటికప్పుడు సమీక్ష నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ప్రజలు తమ సమస్యలను నేరుగా అధికారుల దృష్టికి తీసుకువచ్చేలా గ్రీవెన్స్ డేను సద్వినియోగం చేసుకోవాలని ఎస్పీ సూచించారు.

# ఎస్ఐఆర్‌లో అర్హులైన ఓటర్ల హక్కులు కాపాడాలి

- అనర్హుల వివరాల తొలగింపునకు నిబంధనలు పాటించాలి
- చెల్లుబాటు అయ్యే ధ్రువపత్రాలను పరిగణనలోకి తీసుకోవాలి
- బీఎల్‌వోలతో క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టాలి



హయత్‌నగర్, సెప్టెంబర్ 21 (జనంసాక్షి):
ఎస్ఐఆర్ ప్రక్రియలో అర్హులైన ఓటర్ల పేర్లు తొలగించకుండా వారి ఓటు హక్కును పరిరక్షించాలని ప్రగతిశీల మహిళా సంఘం (పీఓడబ్ల్యూ) రాష్ట్ర అధ్యక్షురాలు జి. అనసూయ ప్రభుత్వాన్ని, ఎన్నికల సంఘాన్ని కోరారు. ప్రశాంత్‌నగర్, వనస్థలిపురం మహిళా మండలి సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన సదస్సులో ఆమె మాట్లాడారు. స్పెల్లింగ్, ఇంటిపేరు, చిరునామా మార్పుల వంటి కారణాలతో అర్హుల పేర్లు తొలగించకుండా చెల్లుబాటు అయ్యే ధ్రువపత్రాలను పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు. మహిళలు, వలస కార్మికులు, ఆదివాసీలు, నిరక్షరాస్యులు, అణగారిన వర్గాల వారు వివరాలు నిరూపించుకోవడంలో ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉన్నందున ప్రత్యేక శ్రద్ధ అవసరమన్నారు. వివాహం తర్వాత మహిళల ఇంటిపేరు, చిరునామా మారే అంశాన్ని కూడా పరిగణనలోకి తీసుకోవాలని కోరారు.
ఎస్ఐఆర్‌లో అర్హులైన ఓటర్ల హక్కులు కోల్పోకుండా చర్యలు తీసుకోవాలని సదస్సులో వక్తలు కోరారు. మరణించిన వారు, శాశ్వతంగా వలస వెళ్లిన వారు, చట్టప్రకారం అనర్హుల వివరాలను మాత్రమే నిబంధనల ప్రకారం తొలగించాలని సూచించారు. బీఎల్‌వోలు ఇంటింటికీ వెళ్లి వివరాలను పరిశీలించి, కొత్తగా 18 ఏళ్లు నిండిన అర్హులను నమోదు చేయడంతోపాటు చిరునామా మార్పులు, ఒకటి కంటే ఎక్కువ చోట్ల ఓటు ఉన్నవారి వివరాలను సరిచేయాలని కోరారు. ఓటరు నమోదు, తొలగింపు, పునఃసమీక్ష ప్రక్రియలను సులభతరం చేయాలని డిమాండ్ చేశారు. ముఖ్య వక్త అనిశెట్టి సాయికుమార్, పీఓడబ్ల్యూ జిల్లా అధ్యక్షురాలు ప్రేమలత, మహిళా మండలి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ఈనెల 27న చలో యాదాద్రి

**తెలంగాణ ఉద్యమకారుల కృతజ్ఞత సదస్సు పోస్టర్ ఆవిష్కరణ**



కరీంనగర్ టౌన్, సెప్టెంబర్ 21, (జనం సాక్షి) : తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఆధ్వర్యంలో ఈనెల 27న నిర్వహించనున్న చలో యాదాద్రి-కృతజ్ఞత సదస్సు పోస్టర్‌ను సోమవారం కరీంనగర్‌లోని ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో ఆవిష్కరించారు. తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఉమ్మడి జిల్లా కరీంనగర్ చైర్మన్ జీవన్ ఆనంద్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ పట్టణ అధ్యక్షుడు, కరీంనగర్ ఇన్‌చార్జి వైద్యుల అంజన్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరై పోస్టర్‌ను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా జీవన్ ఆనంద్, ఫోరం రాష్ట్ర కార్యదర్శి బొల్లం లింగమూర్తి మాట్లాడుతూ.. ఉద్యమకారులకు ఇచ్చిన హామీల అమలు విషయంలో ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి సానుకూలంగా స్పందించి నిర్ణయాలు తీసుకోవడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఉద్యమకారుల సమస్యల పరిష్కారానికి స్పందించిన ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. ఈనెల 27న నిర్వహించే కృతజ్ఞత సదస్సును విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారుల ఫోరం కరీంనగర్ నగర అధ్యక్షుడు గొడిశెల రమేష్ గౌడ్, నాయకులు గుండేటి ఐలయ్య, పాములాపర్తి రామారావు, ఓగేటి బిందు, కలర్ సత్యనారాయణ, మంద వెంకన్న గౌడ్, మెరుగు రవి యాదవ్, లింగంపల్లి సత్యనారాయణ, పెద్దపల్లి మధుసూదన్, గుమ్మడి శ్రీధర్, తోట రాజేష్, బల ప్రసన్న, గద్దం లత, మెరుగు లక్ష్మి, కంజర్ల రేణుక, గుజ్జుల పద్మారెడ్డి, కుమారస్వామి, కొలిపాక శ్రీనివాస్, నర్సింగోజు సాగర్, సిరికొండ శ్రీకాంత్, మల్లేశం, బూర్ల చంద్రప్రకాశ్, వరాల రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

**గణేశ్ నిమజ్జన ట్రాఫిక్ నియంత్రణలో**

# ట్రాన్స్‌జెండర్ల భాగస్వామ్యం



- 17 మందికి ట్రాఫిక్ విధుల్లో అవకాశం
- టీషర్టులు అందజేసిన ఎస్పీ అశోక్‌కుమార్
- సమానత్వం, గౌరవానికి పోలీసుల వినూత్న ముందడుగు
- ప్రజలు ట్రాఫిక్ నియంత్రణకు సహకరించాలి

జగిత్యాల బ్యూరో, సెప్టెంబర్ 21 (జనంసాక్షి): గణేశ్ నిమజ్జనోత్సవ బందోబస్తులో ట్రాన్స్‌జెండర్లను భాగస్వామ్యం చేస్తూ ట్రాఫిక్ నియంత్రణ విధులు అప్పగిస్తున్నట్లు జిల్లా ఎస్పీ అశోక్‌కుమార్ తెలిపారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ట్రాన్స్‌జెండర్లతో సమావేశమైన ఆయన.. విధుల్లో పాల్గొనే 17 మందికి టీషర్టులు అందజేసి మార్గదర్శకాలు ఇచ్చారు. నిమజ్జన సమయంలో భక్తులు, గణేశ్ విగ్రహాల రాకపోకలతో ట్రాఫిక్ అంతరాయం కలగకుండా పోలీసు సిబ్బందితో కలిసి వారు విధులు నిర్వహిస్తారని తెలిపారు. సమాజంలోని ప్రతి వర్గానికి సమాన అవకాశాలు, గౌరవం కల్పించాలనే సందేశాన్ని ఈ కార్యక్రమం ద్వారా చాటుతున్నట్లు ఎస్పీ పేర్కొన్నారు. నిమజ్జనోత్సవాలను ప్రశాంతంగా నిర్వహించేందుకు విస్తృత బందోబస్తు, ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ప్రజలు పోలీసుల సూచనలు పాటించి ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో డీఎస్పీ పురుషోత్తంరెడ్డి, టౌన్ ఇన్‌స్పెక్టర్ కరుణాకర్, ట్రాన్స్‌జెండర్లు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కరించాలి

రంగారెడ్డి జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 21 (జనంసాక్షి): ప్రజల నుంచి వచ్చే సమస్యలను సత్వరమే, నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణిలో ఆయన ప్రజల నుంచి వినతిపత్రాలను స్వీకరించారు. మొత్తం 84 ఫిర్యాదులు అందగా.. రెవెన్యూ శాఖకు సంబంధించి 44, ఇతర శాఖలకు చెందిన 40 అర్జీలు ఉన్నాయి. ప్రతి దరఖాస్తును సంబంధిత అధికారులు ప్రాధాన్యతతో పరిశీలించి, ఎలాంటి జాప్యం లేకుండా పరిష్కరించాలని కలెక్టర్ సూచించారు. అర్జీలను పెండింగ్‌లో ఉంచకుండా ఎప్పటికప్పుడు సమీక్షించాలని, ప్రజా సమస్యల పరిష్కారంలో బాధ్యతాయుతంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు కిరణ్మయి, చంద్రారెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి శారద, వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రజావాణి అర్జీలకు సత్వర పరిష్కారం

- పెండింగ్ లేకుండా పరిష్కరించాలి
- జిల్లా ప్రజావాణికి 172 దరఖాస్తులు.. ఆర్డీవో కార్యాలయాల్లో మరో 18 అర్జీలు
- మండలాల్లోనూ ప్రజావాణిని సద్వినియోగం చేసుకోవాలి



రాజన్న సిరిసిల్ల బ్యూరో, సెప్టెంబర్ 21 (జనంసాక్షి): ప్రజావాణిలో స్వీకరించిన అర్జీలను ఎప్పటికప్పుడు పరిశీలించి సత్వర పరిష్కారం చూపాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ అధికారులను ఆదేశించారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం (ఐడీఓసీ) ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజావాణిలో కలెక్టర్ ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. జిల్లా ప్రజావాణికి 172 అర్జీలు రాగా, వాటిని సంబంధిత శాఖల అధికారులకు పంపించి పరిష్కరించాలని ఆదేశించారు. సిరిసిల్ల ఆర్డీవో కార్యాలయంలో 8, వేములవాడ ఆర్డీవో కార్యాలయంలో 10 దరఖాస్తులు అందినట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలోని అన్ని మండలాల ఎంపీడీవో కార్యాలయాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రజావాణి నిర్వహించి అర్జీలు స్వీకరించారు. ముస్తాబాద్‌లో అత్యధికంగా 16, వేములవాడ రూరల్‌లో 11 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు తెలిపారు. ప్రజలు తమ సమస్యలను స్థానిక ఆర్డీవో, ఎంపీడీవో కార్యాలయాల్లో నిర్వహించే ప్రజావాణిలో నేరుగా సమర్పించుకోవాలని కలెక్టర్ సూచించారు. స్వీకరించిన అర్జీలను ఆన్‌లైన్‌లో నమోదు చేసి సంబంధిత అధికారులు పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి జయశ్రీ, జడ్పీ సీఈవో వెంకట మాధవరావు, ప్రొబేషనరీ డిప్యూటీ కలెక్టర్ నిఖిత తదితరులు పాల్గొన్నారు.

# ఆర్టీసీ బస్సును ఢీకొన్న ద్విచక్ర వాహనం.. ఒకరు మృతి

శామీర్‌పేట, సెప్టెంబర్ 21 (జనంసాక్షి): ఆర్టీసీ బస్సును ద్విచక్ర వాహనం వెనుక నుంచి ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తి మృతి చెందగా, మరొకరు గాయపడ్డారు. శామీర్‌పేట్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని రాజీవ్ రహదారిపై ఫౌజీ ధాబా వద్ద సోమవారం ఈ ప్రమాదం జరిగింది. స్థానికుల వివరాల ప్రకారం.. ఆర్టీసీ బస్సును వెనుక నుంచి ద్విచక్ర వాహనం ఢీకొనడంతో బైక్‌పై ఉన్న షాపూర్‌కు చెందిన రాజు (42) తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందారు. అదే వాహనంపై ఉన్న నరసింహారావుకు గాయాలు కావడంతో నగరంలోని ఓ ఆసుపత్రికి తరలించారు. సమాచారం అందుకున్న శామీర్‌పేట్ పోలీసులు ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# 40 మందికి ఇన్‌పుట్ డీలర్లకు సర్టిఫికెట్ల పంపిణీ, అభినందన

ముస్తాబాద్ సెప్టెంబర్ 21 (జనం సాక్షి) :
ఇన్‌పుట్ డీలర్ల డిప్లొమా కోర్సు పూర్తి చేసుకున్న అభ్యర్థులు రైతులకు ఉత్తమ సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ సూచించారు. డిప్లొమా ఇన్ అగ్రికల్చరల్ ఎక్స్‌టెన్షన్ సర్వీస్ ఫర్ ఇన్‌పుట్ డీలర్స్ (డీఏఈఎస్ఐ) కోర్సు జిల్లాలోని 40 మంది అభ్యర్థులు పూర్తి చేసుకోగా, వారికి జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో జిల్లా కలెక్టర్ సోమవారం సర్టిఫికెట్లు పంపిణీ చేసి, అభినందించారు.
జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. డీఏఈఎస్ఐ కోర్సు, లేదా ఇన్‌పుట్ డీలర్ల కోసం డిప్లొమా ఇన్ అగ్రికల్చరల్ ఎక్స్‌టెన్షన్ సర్వీసెస్, వ్యవసాయంలో ఇన్‌పుట్ డీలర్ల సాంకేతిక నైపుణ్యాన్ని పెంపొందించడానికి ఒక సంవత్సరం డిప్లొమా ప్రోగ్రామ్ రూపొందించి, మేనేజ్ సంస్థ ఆధ్వర్యంలో ఎస్ఏఎంఈటీఐ వారి నుంచి శాస్త్రవేత్తలు, అర్హత కలిగిన నిపుణుల ఆధ్వర్యంలో శిక్షణ అందించారని తెలిపారు.నేల ఆరోగ్య నిర్వహణ, వ్యవసాయ ఉత్పాదకతలో నేల ఆరోగ్యం దాని ప్రాముఖ్యతను అర్థం చేసుకోవడం. ఇంటిగ్రేటెడ్ తెగులు నిర్వహణ పద్ధతులను నేర్చుకోవడం, వ్యవసాయ పనిముట్లు - పరికరాలు యంత్రాలపై పరిచయం, విస్తరణ విధానాలు పద్ధతులు రైతులతో సమర్థవంతంగా సంభాషించడానికి నైపుణ్యాలను అభివృద్ధి చేయడం, విత్తన తత్వశాస్త్ర నిర్వహణను అర్థం చేసుకోవడం, నీటి పారుదల పద్ధతులను నేర్చుకోవడంపై శిక్షణ అందించారని వివరించారు. ఈ కోర్సు విజయవంతంగా పూర్తి చేసుకున్న అభ్యర్థులకు సర్టిఫికెట్లు అందజేసి, రైతులకు ఉత్తమ సేవలు అందించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అఫ్జల్ బేగం, రమేష్ గుప్తా పాల్గొన్నారు.



# మూలన పడిన పారిశుద్ధ్య యంత్రాలకు మోక్షమెప్పుడు?

- కోట్ల విలువైన యంత్రాలు నిరుపయోగం
- రిపేర్లకు టెక్నికల్ టీం ఏర్పాటు చేయాలి
- ఖర్చులపై ఎస్టిమేషన్ రూపొందించాలి
- కౌన్సిల్ ఎజెండాలో పెట్టి ఆమోదించాలి



గోదావరిఖని, సెప్టెంబర్ 21 (జనంసాక్షి):
రామగుండం మున్సిపల్ కార్పొరేషన్‌లో కోట్ల రూపాయల ప్రజాధనంతో కొనుగోలు చేసిన పారిశుద్ధ్య యంత్రాలు వినియోగానికి నోచుకోకుండా కార్యాలయం వెనుక, చెట్ల పొదల్లో పడి ఉన్నాయని సీపీఐ ఫ్లోర్ లీడర్ మార్కపురి సూర్య ఆరోపించారు. సోమవారం ఆయన యంత్రాలను పరిశీలించి మాట్లాడారు. సుమారు రూ.2 కోట్లతో కొనుగోలు చేసిన పలు యంత్రాల్లో స్వీపింగ్ మిషన్ ఒక్కటే సుమారు రూ.65 లక్షలు, రెండు ట్రక్ మౌంటెడ్ గార్బేజ్ కంపాక్టర్లు రూ.60 లక్షలు, రెండు స్టాటిక్ కంపాక్టర్లకు రూ.70 లక్షలు వెచ్చించినట్లు తెలిపారు. వీటిలో కొన్ని చిన్నపాటి సాంకేతిక సమస్యలతోనే మూలనపడి ఉన్నాయని పేర్కొన్నారు. హుక్ హోల్డర్ మిషన్లు, చెత్త సేకరణ ట్రాలీలు కూడా వినియోగంలో లేకపోవడంతో ప్రజాధనం వృథా అవుతోందని విమర్శించారు. యంత్రాలను వెంటనే వినియోగంలోకి తీసుకురావడానికి ప్రత్యేక టెక్నికల్ టీంను ఏర్పాటు చేసి మరమ్మతుల వ్యయంపై ఎస్టిమేషన్ రూపొందించాలని, రానున్న జనరల్ కౌన్సిల్ సమావేశం ఎజెండాలో చేర్చి ఆమోదించాలని సూర్య డిమాండ్ చేశారు. నగర మేయర్, కమిషనర్ చర్యలు తీసుకుని పారిశుద్ధ్య యంత్రాలను ప్రజలకు అందుబాటులోకి తేవాలని కోరారు.

# గణేశ్ నిమజ్జన ఏర్పాట్లు వేగవంతం చేయాలి

- భక్తులకు అసౌకర్యం లేకుండా చర్యలు
- నిమజ్జన కేంద్రాల్లో బారికేడింగ్, లైటింగ్, క్రేన్లు, తాగునీరు, పారిశుద్ధ్య ఏర్పాట్లు
- ప్రతి కేంద్రంలో గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచాలి



కరీంనగర్ బ్యూరో, సెప్టెంబర్ 21 (జనంసాక్షి): గణేశ్ నిమజ్జన వేడుకలు ప్రశాంతంగా నిర్వహించేందుకు ఏర్పాట్లను వేగవంతం చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఆయన ఇంజినీరింగ్ అధికారులతో కలిసి కొత్తపల్లి చెరువు, చింతకుంట, మానకొండూర్ నిమజ్జన కేంద్రాలను పరిశీలించారు. నిమజ్జన ప్రాంతాలను చదును చేయడంతోపాటు పటిష్టమైన బారికేడింగ్, తగినంత లైటింగ్ ఏర్పాటు చేయాలని సూచించారు. కొత్తపల్లి చెరువు వద్ద తొలిసారిగా ఏర్పాటు చేస్తున్న నిమజ్జన కేంద్రంలో ప్రత్యేక ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని, అన్ని కేంద్రాల్లో క్రేన్లు, తాగునీరు, పారిశుద్ధ్య సదుపాయాలు కల్పించాలని ఆదేశించారు. ప్రతి నిమజ్జన కేంద్రంలో గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచి, వేడుకలు పూర్తయ్యే వరకు అధికారులు, సిబ్బంది కేటాయించిన విధుల్లో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఇంజినీరింగ్, పారిశుద్ధ్య, టౌన్‌ప్లానింగ్ విభాగాలు నిరంతరం పర్యవేక్షించాలని కమిషనర్ ఆదేశించారు. కార్యక్రమంలో డీఈ వెంకటేశ్వర్లు, ఏఈ సతీష్ పాల్గొన్నారు.

# జీఓ 76పై కాంగ్రెస్ కమిటీలతో రాజకీయమే

- కార్మికుల సొంతింటి కల నెరవేర్చింది కేసీఆర్ ప్రభుత్వమే
- దాదాపు 30 వేల మందికి గతంలోనే పట్టాల పంపిణీ
- అర్హులకు పట్టాలు ఇవ్వాలి.. కొత్తగా రాజకీయం వద్దు
- సింగరేణిపై ఆరోపణలకు సీబీఐ విచారణ జరపాలి



గోదావరిఖని, సెప్టెంబర్ 21 (జనంసాక్షి):
సింగరేణి కార్మికుల సొంతింటి హక్కుల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం కమిటీల పేరుతో రాజకీయాలు చేస్తోందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ గౌరవ అధ్యక్షుడు కొప్పుల ఈశ్వర్, మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ ఆరోపించారు. సోమవారం గోదావరిఖని ప్రెస్‌క్లబ్‌లో బీఆర్ఎస్ అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు వ్యాల్ల హరీష్‌రెడ్డితో కలిసి వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జీఓ 76, జీఓ 29 ద్వారా సింగరేణి ప్రాంతంలో దశాబ్దాలుగా నివసిస్తున్న కార్మికులు, ప్రజలకు దాదాపు 30 వేల పట్టాలు అందించినట్లు కొప్పుల ఈశ్వర్ తెలిపారు. అర్హులకు ఇంకా పట్టాలు అందకపోతే ఆ ప్రక్రియను పూర్తి చేయాలని, కమిటీల పేరుతో కొత్తగా రాజకీయాలు చేయడం సరికాదన్నారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో విఠల్‌నగర్, 18 ఇంక్లైన్ కాలనీలు తదితర ప్రాంతాల్లో అర్హుల నుంచి దరఖాస్తులు, ఫీజులు స్వీకరించి పట్టాలు పంపిణీ చేపట్టినట్లు కోరుకంటి చందర్ పేర్కొన్నారు. ఒకవైపు చిన్న వ్యాపారులు, ఇళ్ల స్థలాలపై కూల్చివేతలు చేపడుతూ మరోవైపు పట్టాలు ఇస్తామనడం ప్రజలను గందరగోళానికి గురిచేస్తోందని విమర్శించారు. సింగరేణిలో సోలార్ పెండింగ్, ఓబీ కాంట్రాక్టులు, బొగ్గు నిల్వలకు సంబంధించి అవకతవకలు జరుగుతున్నాయని కొప్పుల ఆరోపిస్తూ సీబీఐ విచారణ జరపాలని డిమాండ్ చేశారు. మెడికల్ బోర్డుల వ్యవస్థను బలోపేతం చేసి కార్మికుల ఆరోగ్య సమస్యలపై దృష్టి పెట్టాలని కోరారు. సమావేశంలో బీఆర్ఎస్, టీబీజీకేఎస్ నాయకులు, కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రజాపాలనలో లాభాల శిఖరానికి ఏపీఎచ్ఎంఈఎల్

### మూడేళ్లలో రూ.34.20 కోట్ల నికర లాభం

- 2025-26లో రికార్డు స్థాయిలో రూ.23.33 కోట్ల లాభాలు
- సింగరేణి నిర్వహణతో ఆర్థికంగా బలోపేతం
- జాతీయస్థాయి సంస్థగా విస్తరణకు చర్యలు



**గోదావరిఖని, సెప్టెంబర్ 21 (జనంసాక్షి):** ఒకప్పుడు రూ.21 కోట్ల నష్టాలతో మూసివేత అంచులకు చేరిన ఆంధ్రప్రదేశ్ హెవీ మెషినరీ అండ్ ఇంజినీరింగ్ లిమిటెడ్ (ఏపీఎచ్ఎంఈఎల్) ఇప్పుడు సింగరేణి నిర్వహణలో లాభాల బాటలో పయనిస్తోంది. 2023-24లో రూ.1.05 కోట్లు, 2024-25లో రూ.9.87 కోట్లు, 2025-26లో రికార్డు స్థాయిలో రూ.23.33 కోట్ల నికర లాభాలను సంస్థ నమోదు చేసింది. దీంతో గత మూడేళ్లలో రూ.34.20 కోట్ల నికర లాభాలు ఆర్జించగా, సింగరేణి ఆధీనంలోకి వచ్చిన నాటి నుంచి 2025-26 వరకు సంచిత లాభాలు రూ.60.85 కోట్లకు చేరాయి. 2023 డిసెంబరులో రాష్ట్రంలో ప్రభుత్వం మారిన అనంతరం సింగరేణి విస్తరణతోపాటు ఏపీఎచ్ఎంఈఎల్ను జాతీయస్థాయిలో పోటీపడే సంస్థగా తీర్చిదిద్దేందుకు చర్యలు చేపట్టారు. ఉప ముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి భట్టి విక్రమార్క గత ఏడాది ఆగస్టులో ప్లాంటును సందర్శించి పనితీరు, అభివృద్ధి ప్రణాళికలపై సమీక్ష నిర్వహించారు. కొత్త యంత్రాలు, యంత్ర విడిభాగాల తయారీ, ఉత్పత్తుల విస్తరణ, కొత్త మార్కెట్లను అందిపుచ్చుకోవడంపై దిశానిర్దేశం చేశారు.

గతంలో ప్రధానంగా సింగరేణికి యంత్రాలు, విడిభాగాలు సరఫరా చేసిన సంస్థ ప్రస్తుతం బీహెచ్ఈఎల్, జెన్కో, ఎన్ఎండీసీ, ఆర్ఐఎన్ఎల్ వంటి సంస్థలకు కూడా ఉత్పత్తులు అందిస్తోంది. కొత్త ఆర్డర్లు సాధించడం, ఉత్పత్తుల్లో వైవిధ్యం, వ్యయ నియంత్రణ చర్యలు సంస్థ ఆర్థిక పనితీరును మెరుగుపరిచాయి. 1976లో విజయవాడ సమీపంలోని కొండపల్లిలో 209 ఎకరాల్లో ఏర్పాటైన ఏపీఎచ్ఎంఈఎల్ ప్రారంభంలో ఆశించిన ఆర్డర్లు లేకపోవడం, అధిక సిబ్బంది వంటి కారణాలతో నష్టాల్లోకి వెళ్లింది. 1997-98 నాటికి రూ.21 కోట్ల నష్టాలు పేరుకుపోగా, 2002లో సంస్థ మూసివేతకు సంబంధించిన పరిస్థితి ఏర్పడింది.

సంక్షోభ సమయంలో సింగరేణి సంస్థకు ఆర్డర్లు ఇవ్వడంతోపాటు ఈక్విటీ పెట్టుబడులు పెట్టి నిర్వహణ బాధ్యతలు చేపట్టింది. మొత్తం రూ.14.08 కోట్ల పెట్టుబడితో 81.54 శాతం వాటాను కలిగి ప్రధాన భాగస్వామిగా మారింది. సింగరేణి అధికారులు నిర్వహణ బాధ్యతలు చేపట్టడం, ఉ త్పాదకత పెంపు, వ్యయ నియంత్రణ, కొత్త ఆర్డర్ల సాధన వంటి చర్యలతో సంస్థ క్రమంగా బలోపేతమైంది. తాజాగా విద్యుత్ వ్యయాన్ని తగ్గించేందుకు 300 కిలోవాట్ల సోలార్ ప్లాంట్ను ఏర్పాటు చేస్తున్నారు. రోజుకు సుమారు 1,200 కిలోవాట్ అవర్ల విద్యుత్ ఉత్పత్తి ద్వారా నెలకు రూ.2 లక్షల వరకు ఆదా అయ్యే అవకాశం ఉంది. రూ.1.24 కోట్ల పెట్టుబడిని సుమారు ఐదేళ్లలో తిరిగి పొందే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఏపీఎచ్ఎంఈఎల్ను మరింత విస్తరించి జాతీయస్థాయి భారీ ఇంజినీరింగ్ సంస్థగా తీర్చిదిద్దే చర్యలు కొనసాగుతున్నాయి.

# పీహెచ్సీల్లో మెరుగైన వైద్యం అందించాలి

- ప్రతి రోగికి సకాలంలో నాణ్యమైన సేవలు
- కోదురుపాక పీహెచ్సీలో రికార్డుల పరిశీలన
- మందులు, పరీక్షలు అందుబాటులో ఉండాలి
- సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



**బోయిన్పల్లి, సెప్టెంబర్ 21 (జనంసాక్షి):** ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు వచ్చే ప్రతి రోగికి నాణ్యమైన, సకాలంలో వైద్య సేవలు అందించాలని ప్రజా ఆరోగ్యం, కుటుంబ సంక్షేమ శాఖ డైరెక్టర్ డాక్టర్ రవీందర్ నాయక్ ఆదేశించారు. రాజన్న సిరిసిల్ల జిల్లా పర్యటనలో భాగంగా సోమవారం కోదురుపాక పీహెచ్సీని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఫార్మసీ, ల్యాబొరేటరీ, ఓపీ విభాగాలను పరిశీలించి మందుల నిల్వలు, పరీక్షల నిర్వహణ, రికార్డులను తనిఖీ చేశారు. అవసరమైన మందులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంచాలని, రోగులకు సకాలంలో పరీక్షలు నిర్వహించి ఫలితాల ఆధారంగా చికిత్స అందించాలని సూచించారు. ఓపీ, ఇతర రికార్డులను ఎప్పటికప్పుడు ఆన్లైన్లో నవీకరించాలని ఆదేశించారు. ఆశా కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బందితో మాట్లాడి గర్భిణులు, చిన్నారులకు అందుతున్న సేవలను సమీక్షించారు. వర్షాకాలంలో డెంగ్యూ, చికున్గున్యా, మలేరియా వంటి సీజనల్ వ్యాధులపై నిరంతర నిఘా ఉంచాలని, జ్వరం బాధితులకు వెంటనే ఉచిత పరీక్షలు, చికిత్స అందించాలని సూచించారు. పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా దోమల ఉత్పత్తి కేంద్రాలను నిర్మూలించడంతోపాటు ప్రజలకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. కార్యక్రమంలో డీఎంహెచ్వో డాక్టర్ ఎంజెలిన్ ఆల్ఫ్రెడ్, వైద్యాధికారులు డాక్టర్ రాంరెడ్డి, డాక్టర్ నాగేంద్రబాబు, పీహెచ్సీ వైద్యాధికారి డాక్టర్ రేజు ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.

# నిమజ్జనాలకు కాకతీయ కాలువలో నీరు విడుదల చేయాలి

- ఎస్సారెస్పీ నుంచి వెంటనే నీటిని వదలాలి
- చింతకుంట వద్ద బీజేపీ 'ఛలో చింతకుంట'
- అర టీఎంసీ నీరు విడుదల చేస్తే సరిపోతుంది
- ప్రభుత్వం స్పందించకుంటే ఆందోళన ఉధృతం చేస్తాం



**కరీంనగర్ బ్యూరో, సెప్టెంబర్ 21 (జనంసాక్షి):** గణేశ్ నిమజ్జన ఉత్సవాల కోసం ఎస్సారెస్పీ నుంచి కాకతీయ కాలువకు వెంటనే నీటిని విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బీజేపీ జిల్లా శాఖ ఆధ్వర్యంలో సోమవారం చింతకుంట కెనాల్ వద్ద 'ఛలో చింతకుంట' కార్యక్రమం నిర్వహించారు. బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్రావు ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా సునీల్రావు మాట్లాడుతూ.. గణేశ్ నిమజ్జనాలకు లోయర్ మానేరు డ్యామ్కు వచ్చే వరద కాలువలో నీరు ఉండేలా ఎస్సారెస్పీ నుంచి దిగువకు నీటిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. గతంలో తక్కువ నీటి నిల్వ ఉన్నప్పటికీ నిమజ్జనాల కోసం నీటిని విడుదల చేసిన సందర్భాలున్నాయని, ప్రస్తుతం ఎస్సారెస్పీలో తగినంత నీరు ఉన్నా ప్రభుత్వం స్పందించడం లేదని ఆరోపించారు. నిమజ్జనాలకు అర టీఎంసీ నీరు విడుదల చేస్తే సరిపోతుందని తెలిపారు. ఈ విషయంపై కేంద్ర మంత్రి బండి సంజయ్కుమార్ రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్కుమార్రెడ్డితో మాట్లాడినప్పటికీ చర్యలు తీసుకోలేదని పేర్కొన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి నీటిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ కార్పొరేటర్లు బోయినపల్లి ప్రవీణ్రావు, బండారి వేణు, గాజ శివరాం, ఎన్నం ప్రకాష్, చంద్ర, చొప్పరి జయశ్రీ, బండ రమణారెడ్డి, సొగాని కొమురయ్య, సోమిడి వేణు తదితరులు పాల్గొన్నారు.

## హజ్ యాత్రికులకు ఉచిత వైద్య పరీక్షలు

### ప్రారంభించిన ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్

**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి, జనం సాక్షి:** హజ్ యాత్రకు వెళ్లే యాత్రికుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని హజ్ కమిటీ ఆధ్వర్యంలో ఉచిత వైద్య పరీక్షలు ప్రారంభించారు. సోమవారం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో మూడు రోజుల పాటు నిర్వహించనున్న వైద్య శిబిరాన్ని ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హజ్ యాత్రికుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటూ ముందస్తుగా వైద్య పరీక్షలు నిర్వహించడం అభినందనీయమన్నారు. 2027 హజ్ యాత్రకు నిజామాబాద్ నుంచి 361 మంది యాత్రికులు వెళ్లనున్నారని, రోజుకు 120 మంది చొప్పున వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. యాత్రికుల ఆరోగ్య విషయంలో నిర్లక్ష్యానికి తావులేకుండా పరీక్షలు నిర్వహించి యాత్రకు పంపేలా చర్యలు తీసుకుంటున్న హజ్ కమిటీని అభినందించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య పరీక్షల నిర్వహణకు సహకరిస్తున్న సూపరింటెండెంట్ ఎల్.రాములును ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో హజ్ కమిటీ సభ్యులు, కుల పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# కామారెడ్డిలో డీజేలకు అనుమతి లేదు

### గణేష్ నిమజ్జనాల్లో సంప్రదాయ వాయిద్యాలకే ప్రాధాన్యం

- సుప్రీంకోర్టు మార్గదర్శకాలు తప్పనిసరిగా పాటించాలి
- నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు
- డీజేలకు అడ్వాన్స్లు ఇవ్వొద్దని సూచన



**కామారెడ్డి జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 21 (జనంసాక్షి):** గణేష్ ఉత్సవాలు, నిమజ్జన ఊరేగింపుల్లో డీజే సౌండ్ సిస్టమ్లకు ఎలాంటి అనుమతి లేదని జిల్లా ఎస్పీ ఎం. రాజేష్చంద్ర స్పష్టం చేశారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో డీజే నిర్వాహకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. భారీ జనసమూహంతో జరిగే నిమజ్జనాల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా భద్రతకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపారు. డీజేల అధిక శబ్దం వల్ల ఆరోగ్య సమస్యలు, ఇతర ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉన్నందున సుప్రీంకోర్టు మార్గదర్శకాలు, పోలీస్ శాఖ సూచనలను ప్రతి ఒక్కరూ పాటించాలని కోరారు. గతేడాది కామారెడ్డి పట్టణంలో డీజేలు లేకుండా డప్పులు, సంప్రదాయ వాయిద్యాలు, నృత్యాలతో నిమజ్జనం నిర్వహించిన తీరును ఈసారి కూడా కొనసాగించాలని సూచించారు. డీజే వినియోగంపై నిషేధం ఉన్నందున గణేష్ ఉత్సవ కమిటీల నుంచి నిర్వాహకులు ఎలాంటి అడ్వాన్స్లు తీసుకోవద్దని ఆదేశించారు. ఇప్పటికే తీసుకున్న మొత్తాలను వెంటనే తిరిగి చెల్లించాలని స్పష్టం చేశారు. నిబంధనలు ఉల్లంఘించి డీజేలు ఏర్పాటు చేస్తే చట్టపరమైన చర్యలు తప్పవని ఎస్పీ హెచ్చరించారు.

# సీఎంసీ ప్రజావాణికి 41 ఫిర్యాదులు

### టౌన్ ప్లానింగ్ విభాగానికే 36 వినతులు

**శేరిలింగంపల్లి, సెప్టెంబర్ 21 (జనంసాక్షి):** సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి 41 ఫిర్యాదులు స్వీకరించినట్లు అధికారులు తెలిపారు. ఇందులో టౌన్ ప్లానింగ్ విభాగానికి 36, ఇంజినీరింగ్కు 2, ఎలక్ట్రికల్, స్పోర్ట్స్, ల్యాండ్ అక్విజిషన్ విభాగాలకు ఒక్కో ఫిర్యాదు చొప్పున అందాయి. ప్రతి వినతికి ప్రత్యేక గ్రీవెన్స్ ఐడీ, ట్రాకింగ్ లింక్ కేటాయించి పరిష్కార స్థితిని ప్రజలు తెలుసుకునే అవకాశం కల్పించినట్లు అధికారులు తెలిపారు. ఫిర్యాదులను ప్రాధాన్యతతో పరిశీలించి సకాలంలో పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఇదే సమయంలో శేరిలింగంపల్లి జోన్ పరిధిలోని మియాపూర్ సర్కిల్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో మరో ఐదు ఫిర్యాదులు అందాయి. వీటిలో టౌన్ ప్లానింగ్కు 2, ఇంజినీరింగ్కు 2, ఎలక్ట్రికల్ విభాగానికి ఒక ఫిర్యాదు ఉన్నట్లు అధికారులు వెల్లడించారు.

# రానున్న ఎన్నికల్లో బీసీ ముఖ్యమంత్రి

### కొందుర్గులో తెలంగాణ రాజ్యాధికార యాత్ర..పార్టీ జెండా ఆవిష్కరించిన తీన్మార్ మల్లన్న



**కొందుర్గు, సెప్టెంబర్ 21 (జనంసాక్షి):** రానున్న ఎన్నికల్లో బీసీ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తినే ముఖ్యమంత్రిని చేస్తామని ఎమ్మెల్సీ, తెలంగాణ రాజ్యాధికార పార్టీ అధినేత తీన్మార్ మల్లన్న అన్నారు. ఆయన చేపట్టిన 'తెలంగాణ రాజ్యాధికార యాత్ర' సోమవారం కొందుర్గు మండల కేంద్రానికి చేరుకుంది. ఈ సందర్భంగా పార్టీ జెండాను ఆవిష్కరించి, అనంతరం నిర్వహించిన కార్నర్ మీటింగ్లో మాట్లాడారు. బీసీలను ఓటు బ్యాంకుగా వినియోగించుకుంటూ కొన్ని సామాజిక వర్గాల నాయకులు అధికారం కొనసాగిస్తున్నారని ఆయన ఆరోపించారు. 'ఎవరి వాటా వారికే.. మేమెంతో మాకంత' నినాదంతో బీసీల రాజ్యాధికారం కోసం పోరాడుతున్నామని తెలిపారు. రానున్న రోజుల్లో బహుజనులకు అధికారం దక్కాలని ఆకాంక్షించారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించిన మల్లన్న వైద్యాధికారులతో మాట్లాడి రోగులకు అందుతున్న వైద్య సేవలు, ఆసుపత్రిలోని సౌకర్యాలు, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు మెరుగైన వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు.

## సంగెంకలాన్ రైతులకు అండగా చిట్టినాడు సిమెంట్ కంపెనీ

### రూ.14 లక్షల పంట నష్టపరిహార చెక్కుల పంపిణీ. : ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి.



**తాండూరు సెప్టెంబర్ 21(జనంసాక్షి)** : తాండూరు మండలం సంగెంకలాన్ గ్రామంలో గత ఏడాది అకాల వర్షాల కారణంగా రైల్వే ట్రాక్ పరిసర ప్రాంతాల్లో పంట నష్టపోయిన 57 మంది రైతులకు ఊరట లభించింది. చిట్టినాడు సిమెంట్ కంపెనీ ఆధ్వర్యంలో సుమారు రూ.14 లక్షల పంట నష్టపరిహారం చెక్కులను రైతులకు అందజేశారు. ఈ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డితో కలిసి తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి రైతులకు చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బీఎంఆర్ మాట్లాడుతూ గత ఏడాది కురిసిన అకాల వర్షాలకు రైల్వే ట్రాక్ పక్కన నీరు నిలిచి సంగెంకలాన్ రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఈ విషయాన్ని చిట్టినాడు సిమెంట్ కంపెనీ యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లాం. స్పందించిన యాజమాన్యం మానవతా దృక్పథంతో 57 మంది రైతులకు రూ.14 లక్షల పరిహారం అందించడం అభినందనీయం. బాధిత రైతులకు న్యాయం జరిగే వరకు మేము అండగా ఉంటామని తెలిపారు. ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ రైతులు అధైర్య పడవద్దని, ప్రభుత్వం మరియు స్థానిక సంస్థల సహకారంతో ఇలాంటి సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపుతామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో చిట్టినాడు సిమెంట్ కంపెనీ ప్రతినిధులు, స్థానిక ప్రజాప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

## గన్నేరువరం గుట్టపై ఎలుగుబంటి హల్చల్



**గన్నేరువరం, సెప్టెంబర్ 21 (జనంసాక్షి):** గన్నేరువరం మండల కేంద్రంలోని గుట్టపై ఎలుగుబంటి సంచారం స్థానికులను భయాందోళనకు గురిచేస్తోంది. ఆదివారం రాత్రి 9.30 గంటలకు గన్నేరువరం--పోతూరు రహదారిపై స్మశానవాటిక సమీపంలో ఎలుగుబంటి కనిపించడంతో స్థానిక యువకులు బైక్ లైట్ల వెలుగులో వీడియో, ఫొటోలు తీశారు. అవి సోషల్ మీడియాలో వైరల్గా మారాయి. మనుషుల అలికిడితో ఎలుగుబంటి గుట్టపైకి వెళ్లిపోయినట్లు స్థానికులు తెలిపారు. గత నెల రోజులుగా ఇదే ప్రాంతంలో మూడుసార్లు ఎలుగుబంటి కనిపించిందని గ్రామస్థులు చెబుతున్నారు. దీంతో పశువుల కోసం గుట్టపైకి వెళ్లేందుకు, రాత్రివేళ రహదారిపై ప్రయాణించేందుకు ప్రజలు భయపడుతున్నారు. గుట్ట సమీపంలోని సుమారు 50 కుటుంబాలు పిల్లలను బయటకు పంపేందుకు జంకుతున్నాయి. ఎలుగుబంటి సంచారంపై పలుమార్లు ఫిర్యాదు చేసినా అటవీశాఖ అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ప్రాణనష్టం జరగకముందే గాలింపు చేపట్టి బోను ఏర్పాటు చేసి ఎలుగుబంటిని పట్టుకుని అడవిలో వదలాలని కోరుతున్నారు.

## రిటైర్డ్ ఉద్యోగి పింఛన్ కోసం లంచం డిమాండ్

### రూ.15 వేల లంచం లంచం తీసుకుంటుండగా.. ఏసీబీకి చిక్కిన ఇద్దరు



**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 21 (జనంసాక్షి):** రిటైర్డ్ ఉద్యోగి పింఛన్కు సంబంధించిన అధికారిక పనులు చేసేందుకు రూ.15 వేల లంచం డిమాండ్ చేసిన నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్కు చెందిన ఇద్దరు ఉద్యోగులను ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. పింఛన్కు అవసరమైన ఇంక్రిమెంట్ ఉత్తర్వులు సిద్ధం చేయడంతోపాటు సర్వీస్ బుక్లో వివరాలు నమోదు చేసేందుకు జూనియర్ అసిస్టెంట్ (గణాంకాల విభాగం) పాల్డ అశోక్, ఆడిట్ విభాగం ఉద్యోగి కలకుంట్ల కిరణ్కుమార్ లంచం డిమాండ్ చేసినట్లు ఏసీబీ అధికారులు తెలిపారు. దీంతో బాధితురాలు ఏసీబీని ఆశ్రయించారు. జిల్లా కేంద్రంలోని రాజరాజేంద్ర చౌరస్తా సమీపంలోని సీతారాంనగర్ కాలనీ పద్మశాలి సంఘం వద్ద లంచం తీసుకుంటుండగా డీఎస్పీ చంద్రశేఖర్గౌడ్ ఆధ్వర్యంలోని బృందం వారిని రెడ్హ్యాండెడ్గా పట్టుకున్నట్లు పేర్కొన్నారు. నిందితులను హైదరాబాద్లోని రెండో అదనపు ప్రత్యేక ఏసీబీ న్యాయస్థానంలో హాజరుపరచనున్నట్లు తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగులు విధులను నిజాయితీగా నిర్వహించాలని, లంచం డిమాండ్ చేసే వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని డీఎస్పీ హెచ్చరించారు. లంచం కోరితే ఏసీబీ టోల్ఫ్రీ నంబర్ 1064కు సమాచారం ఇవ్వాలని ప్రజలకు సూచించారు.


# గణేష్ శోభాయాత్రకు పటిష్ట బందోబస్తు

- 1300 మందికి పైగా పోలీసులు, 200 సీసీ కెమెరాలతో భద్రతా ఏర్పాట్లు

**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 21 (జనంసాక్షి):** గణేష్ నిమజ్జన శోభాయాత్రను ప్రశాంతంగా నిర్వహించేందుకు నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య తెలిపారు. నిజామాబాద్, ఆర్మూర్, బోధన్ డివిజన్లలోని ప్రధాన నిమజ్జన మార్గాల్లో 1300 మందికి పైగా పోలీసు సిబ్బందిని మోహరించడంతో పాటు 200 సీసీ కెమెరాలు, డ్రోన్ కెమెరాలతో నిఘా ఏర్పాటు చేశారు. ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి, పోలీసులతో పాటు ఎక్సైజ్, అటవీ శాఖ, ఎన్సీసీ, ఎన్ఎస్ఎస్ సిబ్బందిని బందోబస్తులో భాగస్వామ్యం చేశారు. శోభాయాత్రలో అనుమానాస్పద వ్యక్తులు, వస్తువులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని, ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. ఆడియో సిస్టమ్స్ను నిర్ణీత స్థాయిలోనే వినియోగించాలని, డీజేలకు పూర్తిగా నిషేధం ఉందని స్పష్టం చేశారు. పుకార్లను నమ్మవద్దని, మద్యం సేవించి ఊరేగింపులో పాల్గొంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అత్యవసర సమయంలో 112కు, పోలీస్ కంట్రోల్ రూమ్ 87126-59700కు సమాచారం ఇవ్వాలని కోరారు. ఇదిలా ఉండగా, శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా తెలంగాణ ఎక్సైజ్ యాక్ట్--1968 సెక్షన్ 20(1) ప్రకారం నిజామాబాద్, ఆర్మూర్, బోధన్ డివిజన్లలో కల్లు దుకాణాలు, కల్లు డిపోలు, ఐఎంఎల్ షాపులు, 2బీ బార్లు, క్లబ్బులు తదితర మద్యం విక్రయ కేంద్రాలను సెప్టెంబర్ 22 ఉదయం 6 గంటల నుంచి 23 ఉదయం 6 గంటల వరకు మూసివేయనున్నట్లు కమిషనర్ తెలిపారు. ప్రజలు పోలీసులకు సహకరించి శోభాయాత్రను ప్రశాంతంగా నిర్వహించుకోవాలని కోరారు.

# అక్టోబర్ 1లోగా ఫార్మర్ రిజిస్ట్రేషన్ పూర్తి చేయాలి

- ప్రభుత్వ వ్యవసాయ సేవలకు రిజిస్ట్రేషన్ ఐడీ తప్పనిసరి
- విత్తనాలు, ఎరువులు, పథకాల కోసం ఉపయోగకరం
- సీసీఎస్, మీ సేవ కేంద్రాల్లో నమోదు అవకాశం
- పెండింగ్ రిజిస్ట్రేషన్లపై ప్రత్యేక చర్యలు



**వికారాబాద్ జిల్లా బ్యూరో, సెప్టెంబర్ 21 (జనంసాక్షి):** ప్రభుత్వ వ్యవసాయ పథకాలు, విత్తనాలు, ఎరువులు, ఇతర వ్యవసాయ సేవలను నిరంతరాయంగా పొందేందుకు రైతులు ఫార్మర్ రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి కవిత సూచించారు. జిల్లాలోని రైతులంతా అక్టోబర్ 1లోగా ఫార్మర్ రిజిస్ట్రీలో తమ వివరాలను నమోదు చేసుకుని ఐడీ పొందాలని కోరారు. ఫార్మర్ రిజిస్ట్రేషన్ ఐడీ ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేసే వివిధ వ్యవసాయ పథకాలు, సేవలను పొందేందుకు సౌలభ్యం కలుగుతుందని తెలిపారు. రిజిస్ట్రేషన్ స్థితిని ఆన్లైన్లో పరిశీలించి ఐడీని ధ్రువీకరించుకోవచ్చన్నారు. రిజిస్ట్రేషన్ పూర్తి కాని రైతులు సమీప కామన్ సర్వీస్ సెంటర్, మీ సేవ కేంద్రం లేదా వ్యవసాయ విస్తరణాధికారిని సంప్రదించాలని సూచించారు. పెండింగ్ రిజిస్ట్రేషన్లను గడువులోగా పూర్తి చేసేందుకు క్లస్టర్ల వారీగా ప్రత్యేక చర్యలు చేపట్టాలని అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు కవిత తెలిపారు. రైతులు ఎలాంటి అంతరాయం లేకుండా ప్రభుత్వ పథకాలు, వ్యవసాయ సేవలు పొందేందుకు వెంటనే రిజిస్ట్రేషన్ స్థితిని పరిశీలించుకుని అక్టోబర్ 1లోగా ఫార్మర్ రిజిస్ట్రేషన్ ఐడీ పొందాలని కోరారు.

## సబితా ఇంద్రారెడ్డి సమక్షంలో బీఆర్ఎస్లో చేరికలు

### మాజీ సర్పంచ్ శ్రీనివాస్ సహా 100 మంది చేరిక



**మొయినాబాద్, సెప్టెంబర్ 21 (జనంసాక్షి):** మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి సమక్షంలో మొయినాబాద్ మండలానికి చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్లో చేరారు. మండల అధ్యక్షుడు దారెడ్డి వెంకట్రెడ్డి ఆధ్వర్యంలో తొల్కట్ట గ్రామ మాజీ సర్పంచ్ కనకమామిడి శ్రీనివాస్తో పాటు సుమారు 100 మంది పార్టీ కండువాలు కప్పుకున్నారు. సబితా ఇంద్రారెడ్డి వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో గ్రామాలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాయని, సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికీ అందాయని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమైందని విమర్శించారు. ప్రజా సమస్యల పరిష్కారానికి బీఆర్ఎస్ ఎల్లప్పుడూ ముందుంటుందని, కేసీఆర్ నాయకత్వంపై ప్రజలకు విశ్వాసం ఉందని తెలిపారు. పార్టీలో చేరిన నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్ బలోపేతానికి, ప్రజా సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, మండల నాయకులు, ముఖ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

# భూసేకరణ, ఆర్అండ్ఆర్ పనులు వేగవంతం చేయాలి

### అవార్డులు జారీ చేసిన భూములకు పరిహారం తక్షణమే చెల్లించాలి

- భూసేకరణకు ప్రత్యేక అధికారుల నియామకం
- ప్రతి వారం పురోగతిపై సమీక్షించాలి
- రైతులతో సంప్రదించి న్యాయమైన పరిహారం అందించాలి



**పెద్దపల్లి, సెప్టెంబర్ 21 (జనంసాక్షి):** రాష్ట్రంలోని నీటిపారుదల ప్రాజెక్టులకు అవసరమైన భూసేకరణ, అటవీ భూముల పరిహారం, పునరావాసం-పునరుద్ధరణ (ఆర్అండ్ ఆర్) పనులను వేగవంతం చేయాలని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం రాష్ట్ర మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. పెద్దపల్లి ఐడీఓసీ నుంచి కలెక్టర్ కోయ శ్రీహర్ష పాల్గొన్నారు. భూసేకరణకు 2026-27 ఆర్థిక సంవత్సరంలో రూ.6 వేల కోట్ల వరకు నిధులు విడుదల చేయనున్నట్లు మంత్రి తెలిపారు. ఇప్పటికే రూ.1,050 కోట్లు, తాజాగా రూ.1,500 కోట్లు కలిపి రూ.2,550 కోట్లు విడుదల చేశామని చెప్పారు. విడుదలైన నిధులు అధికారుల వద్దే ఉండకుండా లబ్ధిదారులకు పరిహారం చెల్లింపులు త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. నిధుల కొరత ఉంటే అదనపు నిధుల కోసం ప్రతిపాదనలు పంపాలని సూచించారు. భూసేకరణకు ప్రత్యేక అధికారులను నియమించి బాధ్యతలు అప్పగించాలని, నీటి పారుదల, రెవెన్యూ అధికారులు సమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేశారు. రైతుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని స్నేహపూర్వక వాతావరణంలో భూసేకరణ పూర్తి చేయాలని మంత్రి సూచించారు. నిబంధనల ప్రకారం రైతులకు మార్కెట్ విలువకు సాధ్యమైనంత సమీపంగా పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎస్ఎల్బీసీ సొరంగం పూర్తయ్యేలోపు పెండ్లిపాకల రిజర్వాయర్ పనులు పూర్తయ్యేలా భూసేకరణకు ప్రాధాన్యం ఇవ్వాలని ఆదేశించారు. అవార్డులు జారీ చేసిన భూములకు పరిహారం చెల్లింపులను తొలి ప్రాధాన్యతగా పూర్తి చేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు. పరిహారం చెల్లింపుల్లో జాప్యం వల్ల అదనపు పరిహారం కోసం డిమాండ్లు పెరిగే అవకాశం ఉందన్నారు. పెండింగ్ భూసేకరణపై ప్రతి వారం సమీక్ష నిర్వహించాలని సూచించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో భూసేకరణ, ఆర్అండ్ఆర్ పనులకు సుమారు రూ.3,100 కోట్ల విలువైన పనులు గుర్తించగా, రూ.2,514 కోట్ల మేర నిధులు విడుదల చేసినట్లు సీఎస్ సంజయ్ జాజు తెలిపారు. పరిహారం నేరుగా రైతులకు చేరేలా కలెక్టర్లు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.



# పేదలకు సొంతింటి కల సాకారమే లక్ష్యం

- రాష్ట్ర రెవెన్యూ, సమాచార పౌర సంబంధాలు, గృహ నిర్మాణ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి
- రాయదుర్గంలో 480 ఇందిరమ్మ ఫ్లాట్ల నిర్మాణానికి శంకుస్థాపన

రంగారెడ్డి జిల్లా ప్రతినిధి (జనంసాక్షి) : అర్హులైన ప్రతి పేద కుటుంబానికి సొంతింటి కల సాకారం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర రెవెన్యూ, సమాచార పౌర సంబంధాలు, గృహ నిర్మాణ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి స్పష్టం చేశారు. పేదల ఆత్మగౌరవానికి ప్రతీకగా ప్రభుత్వం చేపట్టిన 'ఇందిరమ్మ టవర్స్' కార్యక్రమంలో భాగంగా, రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి నియోజకవర్గం రాయదుర్గంలో నాలుగు టవర్ల నిర్మాణానికి (మొత్తం 480 ఫ్లాట్లు) ఆయన సోమవారం శంకుస్థాపన చేశారు. ఒక్కో టవర్‌లో 120 ఫ్లాట్ల చొప్పున వీటిని నిర్మించనున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, హైదరాబాద్‌లోని అత్యంత విలువైన ప్రాంతాల్లోనే పేదలకు సురక్షితమైన, గౌరవప్రదమైన నివాసాలు కల్పించాలనే సంకల్పంతో ఈ ప్రాజెక్టును చేపట్టామన్నారు. నగర కోర్ పరిధిలోని 20 నియోజకవర్గాల్లో పైలట్ ప్రాజెక్టు కింద తొలి విడతగా నియోజకవర్గానికి 480 ఇళ్ల చొప్పున నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే 16 నియోజకవర్గాల్లో టెండర్లు, ఒప్పందాల ప్రక్రియ పూర్తయిందని వెల్లడించారు.

**ఉచిత రిజిస్ట్రేషన్.. పారదర్శక ఎంపిక**

రాజకీయ ఒత్తిళ్లు, సిఫార్సులకు తావులేకుండా పూర్తి పారదర్శకంగా లాటరీ పద్ధతిలోనే లబ్ధిదారులను ఎంపిక చేసినట్లు మంత్రి వివరించారు. ఎంపికైన వారికి శాంక్షన్ లెటర్లను వాట్సాప్ ద్వారా పంపుతామన్నారు. రాయదుర్గం వంటి ఖరీదైన ప్రాంతంలో ఫ్లాట్‌తో పాటు లబ్ధిదారులకు భూమి వాటా (అన్‌డివైడెడ్ షేర్) కూడా దక్కుతుందని, రిజిస్ట్రేషన్ చార్జీలను ప్రభుత్వమే భరించి ఉచితంగా సేల్ డీడ్ అందజేస్తుందని ప్రకటించారు. నిర్మాణ నాణ్యతను లబ్ధిదారులే స్వయంగా పర్యవేక్షించవచ్చని, లోపాలుంటే అధికారులు సరిచేస్తారని చెప్పారు.

**దసరా నాటికి 2.10 లక్షల ఇళ్లు**

కులం, మతం, రాజకీయాలకు అతీతంగా అర్హత, పేదరికమే ప్రామాణికంగా లబ్ధిదారులను ఎంచుకుంటున్నట్లు మంత్రి స్పష్టం చేశారు. పట్టణాలతో పాటు గ్రామీణ ప్రాంతాల్లోనూ ఇళ్ల నిర్మాణం వేగంగా జరుగుతోందని, దసరా పండుగ నాటికి గ్రామాల్లో సుమారు 2.10 లక్షల ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. మిగిలిన నియోజకవర్గాల్లోనూ దశలవారీగా టవర్లు నిర్మిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, ఎమ్మెల్సీ దయానంద్, కార్పొరేషన్ చైర్మన్ రఘునాథ్ యాదవ్, హౌసింగ్ ఎండీ గౌతమ్ కుమార్, అదనపు కలెక్టర్ కిరణ్మయి తదితరులు పాల్గొన్నారు.

# లే ఔట్ ఆక్రమణలపై చర్యలు తీసుకోండి

- రహదారుల్లో ఆటంకాలను తొలగించండి
- హైడ్రా ప్రజావాణికి 47 ఫిర్యాదులు



హైదరాబాద్, సెప్టెంబరు 21 (జనంసాక్షి) : బయట వారికే కాదు.. పక్క కాలనీ వాసులకు కూడా దారి లేకుండా చేస్తున్నారు. ఒకే లే ఔట్‌లో ఫేజ్ -1, ఫేజ్ -2 పేరిట ఉన్న వాటి మధ్యే గోడలు కడుతున్నారు. నివాస ప్రాంతాల్లో గొడవ పడాల్సి వస్తోందని హైడ్రా ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. హైడ్రా అధికారులు స్పందించి మాకు దారి చూపాలంటూ కోకాపేటలోని లెజెండ్ చైమ్స్ ఫేజ్-2 కాలనీ నివాసితులు హైడ్రాను విజ్ఞప్తి చేశారు. కేపీహెచ్‌బీ కాలనీ సెవెంత్ ఫేజ్‌లో పై అంతస్తులకు ఎలాంటి అనుమతులు లేకుండా 80 గజాల స్థలంలో 7 అంతస్తులు నిర్మిస్తున్నారని.. వెంటనే ఆపని పక్షంలో పక్కన ఉన్న నివాసాలకు ముప్పు పొంచి ఉంటుందని ఫొటోలు, వీడియోలను చూపించి హైడ్రా ప్రజావాణిలో విజ్ఞప్తి చేశారు. మెహిదీపట్నంలోని సంతోష్‌నగర్ కాలనీలో ప్రభుత్వ భూమి ఉండగా.. అక్కడ అపార్టుమెంట్లు నిర్మిస్తున్న వారు ఆక్రమించేస్తున్నారని.. గ్రీన్ బెల్ట్ ఏరియాగా అభివృద్ధి చేయాలని స్థానికులు హైడ్రా ప్రజావాణిలో కోరారు. రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండలం పశుమాముల గ్రామంలోని పార్కుకోసం కేటాయించిన స్థలాన్ని కబ్జా చేసి ప్లాట్లుగా మార్చుతున్నారని వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. ఇలా ప్రజావాణికి 47 ఫిర్యాదులు రాగా వాటిని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ పరిశీలించారు. అక్కడికక్కడే వాటి పూర్వాపరాలలోకి వెళ్లి పరిష్కార బాధ్యతలను సంబంధిత అధికారులకు అప్పగించారు.

# బీసీ సంక్షేమ శాఖపై మంత్రి పొన్నం ప్రభాకర్ సమీక్ష



హైదరాబాద్ (జనంసాక్షి) : బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అమలు చేస్తున్న వివిధ సంక్షేమ, విద్యా కార్యక్రమాలపై మినిస్టర్ క్వార్టర్స్ లో రవాణా బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. బీసీ మహిళలకు అందిస్తున్న 'ఇంటింటా ఇందిరమ్మ కుట్టు మిషన్లు' పథకం అప్లికేషన్ ప్రక్రియ,పథకం అమలు, బీసీ గురుకులాలు, హాస్టళ్ల పనితీరు, విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలు తదితర అంశాలపై మంత్రి విస్తృతంగా చర్చించారు. 'ఇంటింటా ఇందిరమ్మ కుట్టు మిషన్లు' పథకం కింద ఇప్పటివరకు 4 లక్షల 6 వేల దరఖాస్తులు అందినట్లు అధికారులు మంత్రికి వివరించారు. కుట్టు మిషన్ల కోసం దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ఈ నెల 30వ తేదీతో ముగియనున్నందున, అర్హులైన బీసీ మహిళలకు పథకం ప్రయోజనం అందేలా ప్రక్రియను సమర్థవంతంగా పూర్తి చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు. మహాత్మా జ్యోతిబా పూలే తెలంగాణ బీసీ సంక్షేమ గురుకుల విద్యా సంస్థలు, బీసీ హాస్టళ్ల పనితీరుపై మంత్రి ఆరా తీశారు. విద్యార్థులకు ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం నాణ్యమైన, పౌష్టికాహారం అందించాలని అధికారులను ఆదేశించారు. విద్యార్థులకు పాఠ్యప్రణాళికతో పాటు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. గత ఏడాది కంటే ఈ సంవత్సరం మరింత మెరుగైన ఉత్తీర్ణత సాధించేలా విద్యార్థులు, ఉపాధ్యాయులు సమన్వయంతో కృషి చేయాలని మంత్రి సూచించారు. గురుకులాలు, హాస్టళ్లలో విద్యా ప్రమాణాల మెరుగుదల, మౌలిక వసతుల కల్పన, క్రీడలకు ప్రాధాన్యం, సిబ్బంది నియామకాలు, డిజిటల్ విద్య, ఉన్నత విద్య, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు, కుల సంఘాలతో సమన్వయం తదితర అంశాలపై సమావేశంలో విస్తృతంగా చర్చించారు. బీసీల ఆర్థిక పరిస్థితిని మెరుగుపరిచేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. బీసీ విద్యార్థులకు నాణ్యమైన శిక్షణ అందించేందుకు బీసీ స్టడీ సర్కిల్ ద్వారా నైపుణ్యాభివృద్ధితో పాటు పోటీ పరీక్షలకు శిక్షణ అందిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు చదువుతో పాటు తమ ప్రతిభను వివిధ రంగాల్లో అభివృద్ధి చేసుకునేలా అవసరమైన అవకాశాలను కల్పించాలని అధికారులకు సూచించారు.

# అక్టోబర్ 2న ఎల్‌నినో యాక్షన్ ప్లాన్‌పై తీర్మానాలు

- ప్రతి గ్రామపంచాయతీని మోడల్ పంచాయతీగా తీర్చిదిద్దాలి
- పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి డా. దనసరి అనసూయ సీతక్క



హైదరాబాద్ (జనంసాక్షి) : ఎల్‌నినో ప్రభావంతో రానున్న కాలంలో ఎదురయ్యే పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు గ్రామస్థాయిలో పటిష్టమైన కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి డా. దనసరి అనసూయ సీతక్క అధికారులను ఆదేశించారు. ఖైరతాబాద్‌లోని పంచాయతీరాజ్ కమిషనర్ కార్యాలయంలో సోమవారం మంత్రి సీతక్క పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖపై ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. అక్టోబర్ 2న నిర్వహించనున్న గ్రామసభలు, ఎల్‌నినో నేపథ్యంలో గ్రామాల వారీగా చేపట్టాల్సిన పనులు, ఈ ఏడాది గ్రామపంచాయతీల్లో అమలు చేయాల్సిన అభివృద్ధి ప్రణాళికపై మంత్రి సమీక్షించారు. ఈ సమావేశానికి స్పెషల్ సీఎస్ దానకిషోర్, అడిషనల్ కమిషనర్ పి. రవీందర్‌తోపాటు శాఖకు చెందిన ఇతర ఉన్నతాధికారులు హాజరయ్యారు. ఎల్‌నినో తీవ్రత, దాని ప్రభావం గురించి అందరికీ అవగాహన ఉందని మంత్రి సీతక్క తెలిపారు. ఎల్‌నినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని అసెంబ్లీలో ఇప్పటికే యాక్షన్ ప్లాన్‌పై చర్చించి తీర్మానం చేశామని చెప్పారు. అక్టోబర్ 2న ప్రతి గ్రామపంచాయతీలో నిర్వహించే గ్రామసభల్లో ఎల్‌నినో యాక్షన్ ప్లాన్‌పై చర్చించి, గ్రామస్థాయిలో అవసరమైన చర్యలపై తీర్మానాలు చేయాలని అధికారులను ఆదేశించారు. గ్రామానికి అవసరమైన పనులు ఏమిటి? అందుబాటులో ఉన్న నిధులు ఎంత? వచ్చే ఏడాది కాలంలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల ద్వారా గ్రామపంచాయతీలకు అందే నిధులు ఎంత? అనే అంశాలపై గ్రామసభల్లో సమగ్రంగా చర్చించి, గ్రామ అవసరాలకు అనుగుణంగా కార్యాచరణ ప్రణాళికను ఆమోదించాలని మంత్రి సూచించారు. ప్రతి గ్రామపంచాయతీకి ఒకే రకమైన అభివృద్ధి ప్రణాళిక కాకుండా గ్రామాల వారీగా ఉన్న అవసరాలు, అందుబాటులో ఉన్న నిధులను బట్టి పనులను ఎంపిక చేయాలని మంత్రి సీతక్క స్పష్టం చేశారు. ప్రజలకు అత్యవసరమైన పనులకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని, ఆ తర్వాత ఇతర అభివృద్ధి పనులను చేపట్టాలని సూచించారు. ఆర్థికంగా, సామాజికంగా ప్రజలకు ఇబ్బందులు లేకుండా ఉపాధి కల్పించడంతో పాటు గ్రామాల్లో శాశ్వత సామాజిక ఆస్తులు సృష్టించేలా పనుల ఎంపిక ఉండాలని మంత్రి అన్నారు.

ఉపాధి హామీ పథకం ద్వారా ఈ ఏడాది రాష్ట్రంలో సుమారు రూ.6,700 కోట్లను ఖర్చు చేస్తున్నామని మంత్రి సీతక్క తెలిపారు. దీంతో ప్రతి గ్రామపంచాయతీలో సగటున సుమారు రూ.50 లక్షల విలువైన పనులు జరిగే అవకాశం ఉందని చెప్పారు. ఉపాధి హామీ పనులు కోరిన ప్రతి ఒక్కరికీ పనులు కల్పించాలని అధికారులను ఆదేశించారు. ఒకవైపు గ్రామీణ కుటుంబాలకు ఉపాధి కల్పించడం, మరోవైపు గ్రామాలకు ఉపయోగపడే శాశ్వత సామాజిక ఆస్తులను సృష్టించడం లక్ష్యంగా పనులు చేపట్టాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో నీటి భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని మంత్రి సీతక్క అన్నారు. జలసిరి కార్యక్రమాన్ని మరింత వేగవంతం చేసి, గ్రామాల్లో నీటి సంరక్షణ, నీటి నిల్వ, భూగర్భ జలాల పెంపునకు ఉపయోగపడే పనులను పెద్ద ఎత్తున చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఎల్‌నినో ప్రభావంతో నీటి కొరత ఏర్పడే పరిస్థితులను ముందుగానే అంచనా వేసి, అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు.

**అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించాలి**

జిల్లాల వారీగా ఇప్పటికే రాష్ట్రస్థాయి అధికారులను ప్రోగ్రామ్ మానిటరింగ్ అధికారులుగా నియమించామని మంత్రి తెలిపారు. వచ్చే రెండు రోజులపాటు ఈ అధికారులు తమకు కేటాయించిన జిల్లాల్లో పర్యటించాలని, కింది స్థాయి సిబ్బందికి గ్రామసభలు, ఎల్‌నినో యాక్షన్ ప్లాన్, ఉపాధి హామీ పనులు, జలసిరి కార్యక్రమంపై అవగాహన కల్పించాలని ఆదేశించారు. కేవలం కార్యాలయాల్లో సమావేశాలు నిర్వహించడం కాకుండా.. అధికారులు గ్రామస్థాయికి వెళ్లి పరిస్థితులను పరిశీలించాలని మంత్రి స్పష్టం చేశారు. గ్రామాల వాస్తవ పరిస్థితులను ప్రత్యక్షంగా తెలుసుకుని, ప్రజల అవసరాలకు అనుగుణంగా కార్యాచరణ ప్రణాళికలు రూపొందించాలని సూచించారు.

రాష్ట్రంలోని ప్రతి గ్రామపంచాయతీని మోడల్ పంచాయతీగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి సీతక్క తెలిపారు. ప్రజలకు ఉపాధి, గ్రామాలకు మౌలిక వసతులు, నీటి భద్రత, శాశ్వత సామాజిక ఆస్తులు కల్పించేలా సమగ్ర ప్రణాళికతో ముందుకు వెళ్లాలని అన్నారు. "గ్రామసభ కేవలం సమావేశం కాదు.. గ్రామ అభివృద్ధికి దిశానిర్దేశం చేసే వేదిక. ప్రజల అవసరాలు తెలుసుకుని, అందుబాటులో ఉన్న నిధులను సద్వినియోగం చేసి ప్రతి గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దాలి" అని మంత్రి సీతక్క అధికారులకు సూచించారు.

# రూ.20.30 కోట్లతో కోదాడ-హుజూర్‌నగర్ బస్‌స్టేషన్లకు మహర్దశ

- కోదాడ ఆధునిక బస్‌స్టేషన్‌కు రూ.16.80 కోట్లు
- హుజూర్‌నగర్ బస్‌స్టేషన్ పునరుద్ధరణకు రూ.3.50 కోట్లు
- మంత్రి ఉత్తమ్ కృషితో ప్రజా రవాణాకు కొత్త సొబగులు
- ప్రయాణికుల సౌకర్యమే ప్రమాణం.. పనులు వేగవంతం చేయాలి
- నిర్మాణ నాణ్యతలో రాజీ పడొద్దు: మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి



హైదరాబాద్, సెప్టెంబర్ 21 (జనం సాక్షి) : మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రత్యేక కృషితో కోదాడ, హుజూర్‌నగర్ పట్టణాల్లో ప్రజా రవాణా వ్యవస్థ సరికొత్త రూపు దిద్దుకుంటుంది కోదాడలో అధునాతన బస్‌స్టేషన్ నిర్మాణానికి రూ.16.80 కోట్లు, హుజూర్‌నగర్ బస్‌స్టేషన్ పునరుద్ధరణ మరియు ఆధునికీకరణకు రూ.3.50 కోట్లు కలిపి మొత్తం రూ.20.30 కోట్లతో రెండు ప్రధాన రవాణా కేంద్రాలను అభివృద్ధి చేయనున్నారు. ఈ రెండు బస్‌స్టేషన్ల నిర్మాణ ప్రణాళికలు, ప్రయాణికులకు కల్పించాల్సిన వసతులు, పనుల పురోగతిపై డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కలిసి మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. ప్రతిపాదిత నమూనాలను పరిశీలించిన ఆయన, పనులను వేగవంతం చేసి సాధ్యమైనంత త్వరగా ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని టీజీఎస్ఆర్టీసీ అధికారులను ఆదేశించారు.కీలక రవాణా కూడలిగా ఉన్న కోదాడలో ఐదు ఎకరాల విస్తీర్ణంలో ఆధునిక బస్‌స్టేషన్‌ను నిర్మించనున్నారు.సుమారు 65,700 చదరపు అడుగుల విస్తీర్ణంతో కూడిన రెండు అంతస్తుల ప్రధాన టెర్మినల్ భవనం ఈ ప్రణాళికలో భాగంగా ఉండనుంది. విశాలమైన బస్ బేలు, ప్రయాణికుల నిరీక్షణ ప్రాంగణం, క్రమబద్ధమైన బస్ డ్రైవ్‌వేలు, కార్లు--ద్విచక్ర వాహనాలు--ట్యాక్సీలు--ఆటోలకు ప్రత్యేక పార్కింగ్ సదుపాయాలు కల్పించనున్నారు. ఎలక్ట్రిక్ బస్సుల కోసం ప్రత్యేక ఛార్జింగ్ పాయింట్లు, వేర్వేరు ప్రవేశ--నిష్క్రమణ మార్గాలు, భద్రతా క్యాబిన్లు, సెన్సర్ బారికేడ్లు, పచ్చదనంతో కూడిన ప్రాంగణం ఏర్పాటు చేయనున్నారు. ప్రయాణికుల సౌకర్యాలతో పాటు సిబ్బంది విశ్రాంతి గదులు, పరిపాలనా విభాగాలు, శిక్షణ గది వంటి వసతులు కూడా అందుబాటులోకి రానున్నాయి. భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకొని వాణిజ్య సముదాయం, రెస్టారెంట్--హోటల్ ఏర్పాటుకు ప్రత్యేక స్థలాలను ప్రతిపాదించారు.హుజూర్‌నగర్ బస్‌స్టేషన్‌ను రూ.3.50 కోట్లతో ఆధునికంగా పునరుద్ధరించనున్నారు. ప్రతిపాదిత నమూనా ప్రకారం సుమారు రెండు ఎకరాల పరిధిలో, 28,392 చదరపు అడుగుల నిర్మిత విస్తీర్ణంతో రెండు అంతస్తుల టెర్మినల్‌ను అభివృద్ధి చేయనున్నారు. విశాలమైన ప్లాట్‌ఫామ్, ప్రయాణికుల నిరీక్షణ ప్రాంగణం, వాణిజ్య స్థలాలు, పార్కింగ్, బస్సుల రాకపోకలకు అనువైన అంతర్గత మార్గాలతో బస్‌స్టేషన్‌కు కొత్త రూపు తీసుకురానున్నారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ, "కోదాడ, హుజూర్‌నగర్ ప్రజలకు సురక్షితమైన, సౌకర్యవంతమైన, గౌరవప్రదమైన ప్రయాణ వసతులు కల్పించడమే మా లక్ష్యం. బస్‌స్టేషన్ అంటే కేవలం బస్సులు వచ్చి వెళ్లే ప్రదేశం కాదు. విద్యార్థులు, ఉద్యోగులు, మహిళలు, వృద్ధులు సహా ప్రతి ప్రయాణికుడికి భరోసా ఇచ్చే ప్రజా సౌకర్య కేంద్రంగా ఉండాలి" అని పేర్కొన్నారు."ప్రతి రూపాయి ప్రజలకు కనిపించే సౌకర్యంగా మారాలి. నిర్మాణంలో నాణ్యత, పనుల్లో వేగం-రెండింటికీ సమాన ప్రాధాన్యం ఇవ్వాలి. అనవసర జాప్యానికి అవకాశం లేకుండా స్పష్టమైన కార్యాచరణతో రెండు బస్‌స్టేషన్ల పనులను ముందుకు తీసుకెళ్లాలి" అని అధికారులను ఆదేశించారు.కోదాడ--హుజూర్‌నగర్ బస్‌స్టేషన్లు అందుబాటులోకి వస్తే ఈ ప్రాంత ప్రజలకు మెరుగైన ప్రయాణ సౌకర్యాలు లభించడంతో పాటు పట్టణాల రూపురేఖలు మారుతాయని ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. నిర్మాణ సమయంలో ప్రయాణికులకు ఇబ్బందులు కలగకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని సూచించారు.సమీక్షా సమావేశంలో మంత్రి పొన్నం ప్రభాకర్, కోదాడ శాసనసభ్యురాలు ఉత్తమ్ పద్మావతీ రెడ్డి, టీజీఎస్ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ నాగిరెడ్డి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రాజశేఖర్, చీఫ్ ఇంజనీర్ కవితతో పాటు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఛత్తీస్‌ఘడ్‌లో ఎన్ఐఏ కోర్టు 10 మంది ఆదివాసీలకు విధించిన మరణ శిక్షను రద్దు చేయాలి




హైదరాబాద్ (జనంసాక్షి) : ఛత్తీస్‌ఘడ్‌లో ఎన్ఐఏ కోర్టు 10 మంది ఆదివాసీలకు విధించిన మరణ శిక్షను రద్దు చేయాలని ప్రొఫెసర్ హరగోపాల్, జస్టిస్ చంద్రకుమార్ అన్నారు. హైదర్‌గూడలోని ఎఫ్ఎస్ఎస్ వేదికలో పౌరహక్కుల సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గడ్డం లక్ష్మణ్, నారాయణరావులతో కలిసి వారు విలేకరులతో మాట్లాడారు. ప్రజాస్వామిక దేశంలో రాజ్యాంగం అమలవుతున్న స్థితిలో ఎవరి జీవించే హక్కును కూడా ఇంకొకరు రద్దు చేసే అధికారం లేదని, మరణ శిక్ష, ఉరి శిక్ష విధించడమంటేనే రాజ్యాంగం, న్యాయస్థానం ప్రజాస్వామ్య ఉల్లంఘునకు పాల్పడుతున్నట్లేనని, జీరంఘాటి ఘటనలో ఆదివాసీలపై విధించిన మరణ శిక్షను రద్దు చేయడం ద్వారా ప్రభుత్వాలు తమ ప్రజాస్వామికతను చాటుకోవడానికి అవకాశం ఉందని, న్యాయస్థానాలు ఏవైనా సరే నేర నేపథ్యాన్ని సంఘటన లోతులను చూసి తప్ప న్యాయమైన తీర్పులను ప్రకటించడానికి అవకాశం ఉండదని తెలిపారు. ఆ విధంగా చూసినట్లయితే ఛత్తీస్ ఘడ్ ఆదివాసీలు కోల్పోయింది ఇప్పుడున్న ప్రభుత్వాలు 10 ఏళ్ళు కష్టపడినా వారి వారి కోల్పోయిన మనుషుల జీవితాలను తిరిగి ఇవ్వలేని ముద్దాయిలుగా నేటి ప్రభుత్వాలు ఉన్నాయని, ఆదివాసీలు బ్రతకడం కోసం తమ హక్కులను రక్షించుకువడం కోసం ఏదైనా నేర ప్రక్రియకు పాల్పడి ఉండవచ్చు కాని దాన్ని నేరంగా ప్రజాస్వామ్యాన్ని విశ్వసిస్తున్న మనలాంటి వాళ్ళు ఎవరూ అంగీకరించవద్దని, వారి మరణశిక్షలకు వ్యతిరేకంగా ఉద్యమిద్దామని పిలుపునిచ్చారు. జీరంఘాటి నేర సంఘటన నేపథ్యంలో కూడా ఆదివాసీల వైపే న్యాయం ఉంది. ఆదివాసీలు తమ గౌరవంగా జీవించే హక్కును రక్షించుకోవడం కోసం వారు ఉద్యమించారు. ఆ ఉద్యమం కాస్త కేంద్ర హోం మంత్రి అమిత్ షా నిండు పార్లమెంటులో ప్రకటించినట్లే మార్చి 2026 కల్లా నిర్మూలించబడిందని, అందుకో ఆ నాయకత్వాలపై కేసులు ఏమీ లేకుండా వారికి స్వేచ్ఛా జీవితాన్ని ప్రభుత్వాలు కల్పించాయి. కొంతమందిని ప్రభుత్వ విశ్వ విద్యాలయాల్లో అడ్వయిజర్లుగా పెట్టుకున్నారని తెలిపారు. ఈ నేపథ్యంలో ఇప్పటివరకు జరిగిన ఉద్యమం వైపునుంచి జరిగిన అన్ని కేసులను ఎత్తివేస్తామని జైల్లో బంధీలుగా ఉన్న రాజకీయ ఖైదీలను విడుదల చేస్తామని ఇప్పటికే ప్రభుత్వాలు ప్రకటించాయని, ఏ కేసుపై కూడా న్యాయస్థానాల్లో విచారణ జరుగుతున్నా ఆ విచారణలను ఆపివేసి అందరిని బేషరతుగా విడుదల చేయాల్సిన అవసరం ఉందని, దానిని ప్రభుత్వాలు ప్రకటించాయి. ప్రక్రియను మాత్రం నెమ్మదిగా కొనసాగుతుందని, ఇప్పటికైనా మావోయిస్టు ఉద్యమం పేరుతో దేశవ్యాప్తంగా నమోదైన అన్ని కేసులను ఎత్తివేయాలని శిక్షలు విధించినట్లయితే వాటిని కూడా ఎత్తివేసి అందరిని బేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు.



# అక్రమ ఇసుక రవాణాపై కఠిన చర్యలు తీసుకోవాలి

- గనులు, భూగర్భ వనరుల శాఖపై సీఎస్ సమీక్ష

హైదరాబాద్ (జనంసాక్షి) : అక్రమ ఇసుక రవాణాపై కఠిన చర్యలు తీసుకోవాలని సీఎస్ సంజయ్ జాజు తెలిపారు. ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు సోమవారం డా.బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో గనులు, భూగర్భ వనరుల శాఖపై ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శాఖ పనితీరు, పరిపాలనా అంశాలు, ఆదాయ సమీకరణ, సిబ్బంది నియామకాలు, పదోన్నతులు తదితర అంశాలపై సీఎస్ సమగ్రంగా సమీక్షించారు. శాఖ పరిధిలోని ఖనిజ వనరుల సమర్థవంతమైన వినియోగం ద్వారా ప్రభుత్వ ఆదాయాన్ని పెంచేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. శాఖలో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీ, ఉద్యోగుల పదోన్నతులకు సంబంధించిన ప్రక్రియలను నిబంధనల మేరకు వేగవంతం చేయాలని సూచించారు. సిబ్బంది కొరత కారణంగా శాఖ కార్యకలాపాలకు ఇబ్బందులు కలగకుండా తగిన చర్యలు తీసుకోవాలని అధికారులకు స్పష్టం చేశారు. రాష్ట్రంలో అక్రమ ఇసుక రవాణా, అక్రమ తవ్వకాలు, అనధికారికంగా ఖనిజాల తరలింపును అరికట్టేందుకు కఠిన చర్యలు తీసుకోవాలని సీఎస్ ఆదేశించారు. అక్రమ కార్యకలాపాలు జరిగే ప్రాంతాలను గుర్తించి నిరంతరం తనిఖీలు నిర్వహించాలని, విజిలెన్స్ బృందాలతో ఆకస్మిక తనిఖీలు, దాడులు చేపట్టి అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలని సూచించారు. అక్రమ ఇసుక రవాణా, అక్రమ తవ్వకాలపై వచ్చిన ఫిర్యాదులపై తక్షణమే స్పందించి చర్యలు తీసుకోవాలని సూచించారు.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at Flat No. 301, 8-2-273, 276 & 277, 3rd Floor,Pavani Estate, Indradhanush Complex,Road No. 2, Banjara Hills,Hyderabad – 500034, Telangana, Editor : M.M.RAHMAN RNI No. APTEL/2013/50370